Pubilshed from Tirupathi

PRGI NO : APTEL/25/A2316

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com




తిరుపతి
TIRUPATHI

సంపుటి : 01 | సంచిక : 285 | మంగళవారం | జూన్ 30, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ

Vol.No : 01 | Issue No : 285 | Tuesday | 30 JUNE 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/-

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

**ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని నరేందకరన మోడీ**


విక్టోరియా : భారత్-సీషెల్స్ మధ్య ఉన్న చిరకాల స్నేహబంధానికి అద్దం పట్టేలా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా జరుగుతోంది. మూడు రోజుల అధికారిక పర్యటనలో భాగంగా సీషెల్స్‌కు వెళ్లిన ప్రధాని నరేంద్ర మోదీ.. ఆ దేశ జాతీయ దినోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమ వారం భారత ఆర్మీ, నౌకాదళ దళాలు కవాతు నిర్వహించగా.. వారికి గౌరవ సూచకంగా ప్రధాని మోదీ లేచి నిలబ డటం కార్యక్రమానికి విశేషంగా నిలిచింది. రాజధాని విక్టోరియాలో నిర్వహించిన గోడలెన్ జూబ్లీ పరేడ్‌లో భారత ఆర్మీకి చెందిన అస్సాం రెజిమెంట్ సైనికులు, భారత నౌకాదళానికి చెందిన సిబ్బంది కవాతు నిర్వహించి ఆకట్టుకున్నారు.

- మిగతా 2లో..

# అమరావతి ప్రైడ్ ఫర్ ఏపీ... ప్రైడ్ ఫర్ ఇండియా

**ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో భాగమైనందుకు గర్వించండి**

- నిర్దేశిత గడువులోగా రాజధాని నిర్మాణాలు పూర్తి కావాలి
- రాజధాని పనులపై ప్రతీ 2 నెలలకు ఒకసారి సమీక్ష
- అమరావతి నిర్మాణ కాంట్రాక్టు సంస్థలతో సీఎం చంద్రబాబు



ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

యావత్ దేశం గర్వించే రాజధాని నగరంగా అమరావతిని నిర్మిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ప్లస్‌గా అమరావతి నిర్మాణం జరగాలని అన్నారు. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ నగర నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థలు కూడా భాగస్వాములు కావాలని సీఎం పిలుపునిచ్చారు. రాజధాని నిర్మాణ పనుల్లో మరింత వేగం పెంచాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు.

అమరావతిలో నిర్మాణ పనుల పురోగతిపై సచివాలయంలో కాంట్రాక్టు సంస్థలతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నిర్దేశిత గడువు కంటే ముందే నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం రూ.50,999 కోట్ల విలువైన పనులు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. హౌసింగ్, ట్రంక్ ఇన్ ఫ్రా, ఎల్పీఎస్ ఇన్ ఫ్రా, సహా అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల లాంటి ఐకానిక్ భవనాల నిర్మాణ ప్రాజెక్టులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగంగా చేసేందుకు అవసరమైన మానవ వనరులు, యంత్రాలు ఇతర సామాగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రస్తుతం 26,924 మంది కార్మికులు, 5,140కి పైగా భారీ యంత్రాలు నిర్మాణ పనుల్లో

2 పేజీలో..



## రాజ్యసభ సభ్యుడిగా ఖర్గే ప్రమాణ స్వీకారం

ప్రజాభూమి ప్రతినిధి, న్యూఢిల్లీ : కర్ణాటక నుండి తిరిగి రాజ్యసభకు ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్ష?ిడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ చైర్మన్, ఉపరాష్ట్రపతి సి.పి.రాధకృష్ణన్ తన ఛాం బర్‌లో ఆయనతో ప్రమాణం చేయించారు. ఈకార్యక్ర మానికి కాంగ్రెస్ పార్లమెంటరీ చైర్‌పర్సన్

- మిగతా 2లో..

# పాకిస్తాన్ దాడులు..

**29 మంది ఉగ్రవాదులు హతం**



ఇస్లామాబాద్ : పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు వెంబడి చేపట్టిన నిఘా ఆధారిత భూతల ఆపరేషన్‌లో కనీసం 29 మంది ఉగ్రవాదులు హతమయ్యారని పాకిస్థాన్ సోమవారం తెలిపింది. కరాచీలోని పారామిలిటరీ రేంజర్స్ ప్రధాన కార్యాలయంపై శనివారం ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ దాడులకు ప్రతిదాడులుగా ఉగ్రవాదుల స్థావరాలు, సురక్షిత కేంద్రాలపై దాడులు జరిపినట్లు సమాచార శాఖా మంత్రి అట్టా తరార్ సోమవారం తెలిపారు. ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్ ప్రజల్ని, అలాగే కరాచీలోని పాకిస్థాన్ రేంజర్స్ (సింధ్) క్యాంప్‌పైనా దాడులు జరపడం..

2 పేజీలో..

# వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తాం



**డిప్యూటీ సీఎం పవన్**

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలోని రైతు సోదరులకు 'ఏరువాక పున్నమి' పండుగ శు భాకాంక్షలు తెలియజేశారు. జ్యేష్ఠ పౌర్ణమి పర్వదినాన జరుపుకునే ఈ పండుగ.. భూమాతకు, పశుసంపదకు గౌరవం ఇస్తూ, ప్రకృతికి - మనిషికి మధ్య ఉన్న విడదీయలేని అనుబంధాన్ని చాటుతుందని ఆయన పేర్కొన్నారు. రైతు సంక్షేమానికి, వ్యవసాయాభివృద్ధికి తమ కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనంగా ఇప్పటికే 'పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ' పథకం మొదటి విడత నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. త్వరలో ప్రారంభం కానున్న 'వీబీ-జీ ర్యామ్ జీ' ప్రాజెక్టుల ద్వారా కూడా రైతులకు మేలు చేకూరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేసేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక విధానాలతో పనిచేస్తోందని పవన్ స్పష్టం చేశారు.



## ఇరాన్‌తో చర్చలు కొనసాగిస్తాం

**అమెరికా**

దోహా : హార్ముజ్ జలసంధిపై వివాదాన్ని పరిష్కరించుకునే దిశగా ఇరాన్‌తో చర్చలు కొనసాగిస్తామని అమెరికా ఉన్నతాధికారులను ఉటంకిస్తూ స్థానిక మీడియా ఆదివారం తెల్లవారుజామున తెలిపింది. మంగళవారం ఖతార్‌లో ఇరుదేశాలు సమావేశం కానున్నాయని అన్నారు. చర్చలు కొనసాగుతున్నందున ఇరుదేశాలు దాడులను నిలిపివేసేందుకు అంగీకరించాయని ఆ అధికారి వెల్లడించారు.తాము అన్ని సైనిక కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయించుకున్నామని సీనియర్ అమెరికా అధికారి ఒకరు అమెరికా మీడియాకు తెలిపారు.

- మిగతా 2లో..

## సింగపూర్ తో ఏపీ భాగస్వామ్యం బలోపేతంపై చర్చ



ప్రజాభూమి ప్రతినిధి,ఉండవల్లి: చెన్నైలోని సింగపూర్ కాన్సులేట్ జనరల్ ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ తో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో సింగపూర్‌తో ఏపీ భాగస్వామ్యం మరింత బలోపేతంపై ఇరువురు చర్చించారు. భారత్-సింగపూర్ మధ్య సాంకేతికత, వాణిజ్యం, పెట్టుబడులు, సముద్ర సంబంధిత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని ప్రోత్సహించడంలో ఎడ్గర్ పాం గ్ తే చియాంగ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఏపీలో పెట్టుబడులకు గల అవకాశాలను మంత్రి లోకేష్ వివరించారు.

- మిగతా 2లో..

# కోవిడ్ తరవాత పెరిగిన సైబర్ నేరాలు

**మోసపోతున్న వారిలో చదువుకున్నవారే ఎక్కువ**

- సైబర్ క్రైమ్ నివారణ్ ఆధునిక టెక్నాలజీ వినియోగం
- సైబర్ క్రైమ్స్ రికవరీ మేళాలో హోంమంత్రి అనిత




ప్రజాభూమి ప్రతినిధి, విశాఖపట్నం : కొవిడ్ తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. ఎన్డీఏ ప్రభుత్వం సైబర్ క్రైమ్‌పై దృష్టి పెట్టిందని పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతున్నామని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ పోలీసుస్టేషన్‌కు టూల్స్ ఇస్తున్నామని చెప్పుకొచ్చారు.



## కూటమి కృషితో సీమకు మహర్దశ

- జగన్ హయాంలో రక్తపుటేరులు పారించారు
- ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్య

ప్రజాభూమి ప్రతినిధి, అమరావతి : కూటమి ప్రభుత్వంలో రాయలసీమ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వ్యాఖ్యానించారు. అభివృద్ధికి చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారని పునరుద్ఘాటించారు.

- మిగతా 2లో..

# ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

- మనమిత్ర ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- జిల్లాల్లో క్షేత్రస్థాయి పర్యటనకు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలిపిన అధికారులు




2 పేజీలో..

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి : ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా అందించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్ నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం సమీక్షించారు. ఈ మేరకు ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించే అంశంపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

ప్రజలతో నిత్యం సంబంధాలున్న శాఖలు, విభాగాల్లో ప్రభుత్వ సేవలు పొందడం సులభతరం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ మేరకు సేవల్ని సులభతర ప్రక్రియను మొదలు పెట్టామని.. ముందుగా 11 రకాల సేవల్లో ప్రక్రియలను కుదిస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే ప్రజా ఫిర్యాదుల వ్యవస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఆన్‌లైన్లో ఫిర్యాదులు చేసే అవకాశాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు... మనమిత్ర వాట్సాప్‌లో కూడా ఫిర్యాదులు చేసే అవకాశం కల్పించాలన్నారు.



## అమరావతిలో అల్లర్లకు వైసిపి కుట్రలు

- జగన్ డైరెక్షన్‌లోనే ఈ అలజడులు
- మండిపడ్డ మంత్రి కొల్లు రవీంద్ర

ప్రజాభూమి ప్రతినిధి, మచిలీపట్నం : జగన్ డైరెక్షన్‌లోనే అమరావతిలో వైసీపీ అల్లర్లు అంటూ మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ప్రశాంతంగా ఉన్న అమరావతి రైతుల్లో అలజడులు సృష్టించేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రెండు రోజుల క్రితం అమరావతిలో జరిగిన అల్లర్లపై మంత్రి కొల్లు రవీంద్ర స్పందించారు.

- మిగతా 2లో..

# మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు..

- డీఎంకే శ్రేణులకు స్టాలిన్ పిలుపు
- తమిళనాడులో రాజకీయాలు వేగంగా మారుతున్నాయన్న డీఎంకే అధినేత
- ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపు
- టీవీకే మిత్రపక్షాల సపోర్ట్‌తో అధికారంలోకి వచ్చిందన్న స్టాలిన్
- అందుకే ప్రభుత్వం ఎప్పుడు కూలిపోతుందోనని అనుమానం
- టీవీకే హయాంలో అభివృద్ధి మందగించిందన్న మాజీ సీఎం



తమిళనాడు : తమిళనాడులో రాజకీయ పరిణామాలు వేగంగా మారే అవకాశం ఉందని డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ అన్నారు. మరో ఐదేళ్లు ఎదురుచూడాల్సిన అవసరం లేదని, మూడు నెలలు లేదా ఆరు నెలల్లో ఎన్నికలు రావొచ్చని పార్టీ శ్రేణులను అప్రమత్తం చేశారు. ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాజీ మంత్రి బెంజమిన్‌తో పాటు పలువురు ఏఐఏడీఎంకే నేతలు, కార్యకర్తలు డీఎంకేలో చేరారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వానికి సొంతంగా మెజారిటీ లేదన్నారు. 118 సీట్ల మెజారిటీ అవసరం

# సంపాదకీయం

## మళ్లీ మొదటికొచ్చిన పశ్చిమసియా !

ట్రంప్ ప్రంపచానికి పట్టిన పీడలాగా తయారయ్యాడు. అటు దేశ ప్రజలకు, ఇటు ప్రపంచ ప్రజలకు ఎప్పడీ పీడ విరగడ అవుతుందా అని ఎదురు చూస్తున్నారు. శాంతి చర్చల అనంతరం ఒప్పందం చేసుకున్న తరవాత కూడా ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడంతో పశ్చిమాసియాను మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. ట్రంప్ చేస్తున్న ప్రకటనలకు, చర్యలకు పొంతన లేకుండ ఆపోయింది. దీంతో మళ్లీ యుద్ధం వస్తుందా అన్న భయంలో అనేక దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇకపోతే ఇటలీవల చేసుకున్న ఒప్పందాన్ని కూడా ట్రంప్ ఖాతరు చేయలేదు. దీంతో అమెరికా, ఇరాన్ మధ్య అవగాహన ఒప్పందానికి పురిట్లోనే గండిపడింది. శనివారం మొదలైన పరస్పర దాడులు ఆదివారం మరింత ఉధృతం కావడంతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చిందా అన్న ఆందోళన కలుగుతోంది. దాడులు ఆపకుంటే ఇరాన్‌ను భూమ్మీదే లేకుండా చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోమారు హెచ్చరించగా... తమ జోలికి వస్తే అమెరికాకు నరకం చూపిస్తామంటూ ఇరాన్ కూడా అంతేదీటుగా స్పందించింది. దీనితో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందేమోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. హోర్ముజ్ జలసంధిలో తమ మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రయాణిస్తోందంటూ ఎవర్ లభ్లీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ డ్రోన్ దాడి చేయడంతో ఉద్రిక్తత మొదలైంది. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందంటూ.. శనివారం హోర్ముజ్ జలసంధికి సమీపంలో ఇరాన్‌లోని లక్ష్యాలపై అమెరికా యుద్ధ విమానాలతో దాడులు చేసింది. దీనితో గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపైకి ఇరాన్ డ్రోన్లు క్షిపణులను ప్రయోగించింది. అమెరికా దాడులపై ఇరాన్ దీటుగా స్పందించింది. కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్‌లోని అలీ అల్ సలేం వైమానిక స్థావరం, బహ్రెయిన్ పోర్ట్ సల్మాన్ వద్ద ఉన్న అమెరికా ఐదో నావికాదళ స్థావరం సహా ఎనిమిది కీలక సైనిక కేంద్రాలను ధ్వంసం చేశామని ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ) పేర్కొంది. అమెరికా చేసే ఎలాంటి దాడులకైనా మా స్పందన అత్యంత విధ్వంసకరంగా ఉంటుందని హెచ్చరించింది. కాగా, తమ దేశంవైపు వస్తున్న క్షిపణులు, డ్రోన్లను గగనతల రక్షణ వ్యవస్థలతో విజయవంతంగా అడ్డుకుంటున్నామని కువైట్ ప్రకటించింది. అయితే హోర్ముజ్ జలసంధిలో పనామా జెండాతో ప్రయాణిస్తున్న భారీ చమురు ట్యాంకర్ నౌక 'కికు'పై శనివారం రాత్రి దాడి జరిగింది. ఇది ఇరాన్ పనేనంటూ అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం తెల్లవారుజామున పర్షియన్ గల్ఫ్‌లోని ఇరాన్ దీవి 'ఖెష్మ్'పై, హోర్ముజ్ జలసంధి సమీపతీరంలోని సిరిక్, బందర్ ఈ లెంగే నగరాల్లో 10 ప్రాంతాలపై భారీస్థాయిలో దాడులు చేసింది. ఇరాన్ నిఘా, కమ్యూనికేషన్ వ్యవస్థలు, గగనతల రక్షణ వ్యవస్థలు, డ్రోన్లు, సముద్ర మందుపాతరల నిల్వ కేంద్రాలను ధ్వంసం చేసినట్లు ప్రకటించింది. ఈ దాడులకు సంబంధించి 38 సెకన్ల వీడియోను విడుదల చేసింది. పరస్పర దాడు లు కొనసాగుతున్నా హోర్ముజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని.. అమెరికా నౌకాదళం పూర్తి అప్రమత్తత ఉందని పేర్కొంది. అమెరికా, ఇరాన్ చర్చలకు మధ్యవర్తిగా ఉన్న పాకిస్థాన్.. తాజా ఉద్రిక్తతలను తగ్గించేందుకు ప్ర యత్నాలు మొదలుపెట్టింది. దీనిపై పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఇరుదేశాల ప్రతినిధులను సంప్రదించారు. కాల్పుల విరమణ, అవగాహన ఒప్పందానికి కట్టుబడి ఉండాలని కరారు. ఇక యూరోపియన్ యూనియన్ విదేశాంగ విధానం చీఫ్ కాజా కల్లాస్, బహ్రెయిన్ విదేశాంగ మంత్రి రషీద్ కూడా ఇషాక్‌దార్‌తో మాట్లాడారు. కాగా కువైట్, బహ్రెయిన్‌లపై ఇరాన్ దాడులను గల్ఫ్ దేశాల కూటమి 'గల్ఫ్ కోఆపరేషన్ కౌన్సిల్ (జీసీసీ)' ఖండించింది. వెంటనే దాడులు ఆపాలని విజ్ఞప్తి చేసింది. అమెరికా చేసే ప్రతీ దాడికీ తమ ప్రతిదాడి ఉంటుందని ఐఆర్‌జీసీ హెచ్చరించింది. కాల్పుల విరమణను అమెరికాయే ఉల్లంఘిస్తోందని, ఇది ఇలాగే కొనసాగితే శాంతి ఒప్పందం కోసం జరుగుతున్న దౌత్య ప్రయత్నాలన్నీ నిలిచిపోతాయని స్పష్టం చేసింది. ఈ మేరకు ఐఆర్‌జీసీ నావికాదళ కమాండర్ ప్రకటన చేశారు. గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. అవగాహన ఒప్పందాన్ని ఇరాన్ ఉల్లంఘిస్తోందని మండిపడ్డారు. ఇరాన్ మళ్లీ కాల్పు ల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడంతో మా సైన్యం దాడులు చేయాల్సి వచ్చింది. ఇరాన్ ఎప్పటికీ పాఠం నేర్చుకునేలా కనిపించడంలేదు. మా సహనానికి హద్దు అంటూ ఉంటుంది. అది దాటితే మేం సైన్యంతోనే పని పూర్తి చేయాల్సి వస్తుంది. అదే జరిగితే ఇక ఇరాన్ అనే దేశమే ఉండదని ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.విదేశాల నుంచి భారత్‌కు సరుకు రవాణా చేస్తున్న ఏడు కార్గో నౌకలు గత మూడు రోజుల్లో హోర్ముజ్ జలసంధిని దాటాయి.

వీటిలో 65 వేల టన్నుల రసాయన ఎరువులు తీసుకొస్తున్న రెండు నౌకలు శనివారం ఈ మార్గం గుండా వచ్చాయి. అంతకుముందు రోజు లక్ష టన్నులకు పైగా ముడి చమురుతో 'దేశ్ సురక్ష' ట్యాంకర్, 18,732 టన్నుల సరుకుతో 'ప్రభు పార్వతి' నౌక ఇదే మార్గం గుండా భారత్‌కు వచ్చాయి. ఇవిగాక మరో రెండు విదేశీ నౌకలు ఇదే మార్గంలో ప్రయాణించాయి. హోర్ముజ్ ద్వారా భారత్‌కు రావాల్సిన మరో 15కు పైగా నౌకలు తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో పర్షియన్ గల్ఫ్‌లో వేచి ఉన్నాయి. వీటిలో భారతీయ జెండా గల 10 నౌకలు ఉన్నాయి. వాటిలో నాలుగు ఎరువులను, మరొకటి ఇంధనాన్ని తీసుకురానున్నాయి. ఇప్పుడు ఉద్రిక్తతల కారణంగా పరిస్థితి ఎలా ఉంటుందో అన్న ఆందోళన కలుగుతోంది.

# అమరావతి ప్రైడ్ ఫర్ ఏపీ- ప్రైడ్ ఫర్ ఇండియా

నిమగ్నమైనట్టు మంత్రి నారాయణ సీఎంకు వివరించారు. నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకమూ లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలు సజావుగా సాగేందుకు వీలుగా వాటిని వెడల్పు చేస్న్తున్నామని మంత్రి తెలియచేశారు. దీనిపై స్పందించిన సీఎం భవిష్యత్ నగరంగా నిర్మిస్న్తున్న అమరావతి నిర్మాణంలో పని చేశామన్న బ్రాండ్ ను కాంట్రాక్టర్లు సంపాదించేలా పనులు చేపట్టాలని సూచించారు. కొందరు వ్యక్తులు కావాలని లిటిగెంట్లుగా మారి రాజధాని పనుల్ని అడ్డుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారని .. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లాలని సీఎం స్పష్టం చేశారు. కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శుల నివాసాలు, రహదారులు, మౌలిక సదుపాయాలతో పాటు అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల నిర్మాణాలపై ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్య క్షేత్రాలు, నదుల నుంచి పవిత్రమైన మట్టి, నీళ్లు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పునీతం చేశామని.. గత పాలకులు ఐదేళ్ల పాటు రాజధాని నిర్మాణాన్ని ఆపేశారని సీఎం అన్నారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ గాడిలో పెట్టామన్నారు. అత్యుత్తమ నివాసయోగ్య నగరంగా నిర్మాణం చేస్తున్న అమరావతిలో భాగస్వాములం అయ్యామన్న ఆలోచనతో కాంట్రాక్టు సంస్థలు పనిచేయాలని సీఎం సూచించారు. పనులు పూర్తి అయ్యాక రాజధాని నిర్మాణాల ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని సీఎం తెలిపారు. నిర్మాణ పనుల వేగంతో పాటు నాణ్యత పై కూడా ఎక్కడా రాజీ లేకుండా చేపట్టాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ భవనాలు ఐకానిక్ నిర్మాణాలుగా ఉండాలని పేర్కొన్నారు. అమరావతికి పేరు తెచ్చేలా ఈ భవనాలను నిర్మించాలన్నారు. రాజధాని నిర్మాణంలో చిన్న ఇబ్బందులు కూడా లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ప్రతీ రెండు నెలలకు ఒకసారి నిర్మాణాల పురోగతిపై సమీక్షిస్తానని సీఎం స్పష్టం చేశారు. ఎల్ అండ్ టీ, షాపూర్ జీ పల్లోంజి, మెగా ఇంజినీరింగ్, ఎన్సీసీ, బీఎస్ఆర్, కేఎంవీ సహా వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు చేపట్టిన పనులకు సంబంధించిన అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా సంస్థల ప్రతినిధులకు సీఎం దిశా నిర్దేశం చేశారు. ఈ సమీక్షకు పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, సీఆర్డీఏ అధికారులు, వివిధ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.



# కోవిడ్ తరవాత పెరిగిన సైబర్ నేరాలు

విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం సైబర్ క్రైమ్స్ రికవరీ మేళా నిర్వహించారు.
ఈ మేళాకు ముఖ్య అతిథిగా హోం మంత్రి అనిత పాల్గొనగా, సీపీ శంఖబ్రత బాగ్చి, పోలీస్ అధికారులు హాజరయ్యారు. సైబర్ క్రైమ్ బాధితులకు రికవరీ చేసి చెక్కులను హోం మంత్రి అందజేశారు. చదువుకున్నవారే సైబర్ నేరాలకు గురవుతున్నారని హోం మంత్రి అనిత చెప్పుకొచ్చారు. సైబర్ నేరాలకు గురైన 310 మందికి సుమారు ఆరు కోట్ల రూపాయలు రికవరీ చేసి అందించామని తెలిపారు. సైబర్ క్రైమ్‌లో టెక్నాలజీని పూర్తిగా వాడుతున్నామని వివరించారు. ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. సైబర్ క్రైమ్‌లో ఎవరైనా మోసపోతే తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని హోం మంత్రి అనిత పేర్కొన్నారు. అలాగే సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లకు అత్యాధునిక సాంకేతిక పరికరాలను అందజేస్తున్నామని చెప్పారు. సైబర్ నేరాల దర్యాప్తులో టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగిస్తున్నామని తెలిపారు. సైబర్ నేరాలకు బాగా చదువుకున్నవారు కూడా బలవుతున్నారని హోంమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇక, సైబర్ నేరాల నియంత్రణ లో ప్రజల అప్రమత్తత కూడా కీలకమని హోంమంత్రి అన్నారు. ప్రభుత్వం సైబర్ నేరాలపై ఉక్కుపాదం మోపుతుందని, నేరస్థులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల సహకారంతో సైబర్ నేరాలను సమర్థవంతంగా అరికట్టగలమని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విశాఖ పోలీస్ కమిషనర్ శంఖ బ్రత బాగ్చి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.




# ప్రభుత్వ సేవలు మరింత సులభతరం

**మొదటి పేజీ తరువాయి**

వాయిస్ మెసేజెస్ పెట్టినా వాటిని కూడా ఫిర్యాదులుగా స్వీకరించేలా చూడాలని సీఎం అధికారులకు సూచించారు. రాష్ట్రంలో మొబైల్ నెట్‌వర్క్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. రాష్ట్రంలో సుమారు 3 వేల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్య ఉందని.. మూడు నెలల్లో సమస్య పరిష్కరించాలన్నారు. ఈ మేరకు నెట్‌వర్క్ సంస్థలతో మాట్లాడాలని సూచించారు. నవచేతన పేరుతో స్త్రీ శిశు సంక్షేమ శాఖ చేపట్టిన ఎర్లీ చైల్డ్ హుడ్ డెవలప్మెంట్ స్క్రీనింగ్ విధానంపై సమావేశంలో అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. పిల్లల ఎదుగుదల, వారి మానసిక, శారీరక పరిస్థితులను అధ్యయనం చేస్తున్నట్టు అధికారులు వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 33,949 మంది పిల్లలను స్క్రీన్ చేసినట్టు చెప్పారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చేవారితో పాటు ఇళ్లకు కూడా వెళ్లి స్క్రీనింగ్ చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు అధికారులు చెప్పారు. స్క్రీనింగ్‌తో పాటు... ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై పైలెట్ ప్రాజెక్ట్ అమలు చేయనున్నట్లు వెల్లడించారు.




**తక్షణ పరిష్కారాలు చూపండి**

సీఎం సూచనల మేరకు క్షేత్రస్థాయి పర్యటనల విషయంలో సర్క్యులర్ జారీ చేశామని అధికారులు తెలిపారు. ఈ మేరకు నెలలో సెక్రటరీలు 3 రోజులు, హెచ్ఓడీలు 6 రోజులు, జిల్లా కలెక్టర్లు 8 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సర్క్యులర్ జారీ చేసినట్టు అధికారులు వివరించారు. సమస్యలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణ పరిష్కారాలు చూపాలని సీఎం ఆదేశించారు. పీజీఆర్ఎస్ విధానం మరింత మెరుగ్గా పనిచేసేలా స్టాండర్డ్ ఆపరేటివ్ ప్రొసీజర్స్ జారీ చేసినట్టు అధికారులు వెల్లడించారు. సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, సీఐఐ ప్రతినిధులను వెంటపెట్టుకుని సీఎం చంద్రబాబు ఆర్టీజీఎస్ కేంద్రానికి వచ్చారు. ఆర్టీజీఎస్ పనితీరును ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ సీఐఐ ప్రతినిధులకు వివరించారు. ఏఐ సహా వివిధ టెక్నాలజీలను పరిపాలనలో ఏ విధంగా వినియోగిస్తున్నామనే అంశాన్ని భాస్కర్ వెల్లడించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఆర్టీజీఎస్ పనివిధానానికి సంబంధించిన కేస్‌స్టడీస్‌ను సీఐఐ ప్రతినిధులకు వివరించారు. సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్‌ను వీలైనంత త్వరగా ఏర్పాటు చేయాలని సీఐఐ ప్రతినిధులకు సీఎం చంద్రబాబు సూచించారు. ఈ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.


## ఘనంగా సీషెల్స్ 50వ స్వాతంత్ర్య దినోత్సవం

ముఖ్యంగా అస్సాం రెజిమెంట్ జవాన్లు తమ ప్రసిద్ధ రెజిమెంటల్ గీతం 'బద్లు రామ్ కా బదన్' ఆలపిస్తూ మార్చ్ చేయడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో భారత నౌకాదళానికి చెందిన అత్యాధునిక స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ తార్కష్, స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఐఎన్ఎస్ ఇక్షాక్ సర్వే నౌకలూ పాల్గొన్నాయి. దీంతో ఇరు దేశాల మధ్య రక్షణ సహకారం మరింత బలపడుతున్న సంకేతాలు స్పష్టం అయ్యాయి. ఈ సందర్భంగా భారత నౌకాదళం స్పందించింది. సీషెల్స్ జాతీయ దినోత్సవ స్వర్ణోత్సవాల్లో ఐఎన్ఎస్ తార్కష్, ఐఎన్ఎస్ ఇక్షాక్ నౌకలు, భారత నౌకాదళ బ్యాండ్, మార్చింగ్ కంటింజెంట్ పాల్గొన్నాయని తెలిపింది. ఇది భారత్-సీషెల్స్ సముద్ర సహకారానికి ప్రతీకని పేర్కొంది. మరోవైపు, ఈ వేడుకల అనంతరం ప్రధాని మోదీ కూడా ఎక్స్‌లో స్పందించారు. ఈ సందర్భంగా సీషెల్స్ అధ్యక్షుడు పాట్రిక్ హెర్మినీ ఆతిథ్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 'అస్సాం రెజిమెంట్, భారత నౌకాదళ దళాలు సీషెల్స్ జాతీయ దినోత్సవ పరేడ్‌లో పాల్గొనడం ఇరు దేశాల మధ్య ఉన్న చిరస్థాయి స్నేహానికి మరో నిదర్శనం' అని ప్రధాని పేర్కొన్నారు. కాగా, ప్రధాని మోదీకి సీషెల్స్ అత్యున్నత పురస్కారం 'గార్డియన్ ఆఫ్ ది బ్లూ హారిజన్' లభించింది. దీనిని ఆ దేశ ప్రధాని ప్యాట్రిక్ హెర్మినీ.. భారత ప్రధానికి అందజేశారు.

# ఇరాన్‌తో చర్చలు కొనసాగిస్తాం : అమెరికా

చర్చలు కొనసాగుతున్నందున నౌకలు స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని మరో అధికారి వెల్లడించారు.జూన్ 17న తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ.. అమెరికా దూకుడుగా వ్యవహరిస్తూ ఇరాన్‌పై దాడులకు దిగిన సంగతి తెలిసిందే.అమెరికా వైమానిక దాడులకు ప్రతీకారంగా ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) ఆదివారం తెల్లవారుజామున కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని క్ష?పణులు, డ్రోన్‌లతో దాడులు చేపట్టింది. హోర్ముజ్ జలసంధి సమీపంలోని తమ కేంద్రాలపై అమెరికా జరిపిన దాడులకు సమాధానంగానే ఈ సైనిక చర్య చేపట్టినట్లు ఇరాన్ ప్రకటించింది. ఈ ఆకస్మిక దాడులతో ఇరు దేశాల మధ్య పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది.

## రాజ్యసభ సభ్యుడిగా ఖర్గే ప్రమాణ స్వీకారం



సోనియాగాంధీ, వయనాడ్ ఎంపి ప్రియాంకగాంధీ వాద్రా హాజరయ్యారు. జూన్ 11న, కర్ణాటక నుంచి రాజ్యసభకు ఖర్గేతో సహా ముగ్గురు కాంగ్రెస్ అభ్యర్థులు, ఒక బిజెపి అభ్యర్థిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. బిజెపి సభ్యులైన ఇరన్న కదాడి, నారాయణ కొరగప్ప, కాంగ్రెస్‌కు చెందిన మల్లికార్జున ఖర్గే, జెడిఎస్‌కు చెందిన మాజీ ప్రధాని హెచ్.డి. దేవెగౌడల పదవీకాలం జూన్ 25తో ముగియడంతో ఆ నాలుగు స్థానాలను భర్తీ చేసేందుకు ఎన్నికల సంఘం (ఇసి) ఎన్నికలు ప్రకటించారు.

# పాకిస్తాన్ దాడులు..

పాకిస్థాన్ అంతటా ఇటీవల జరిగిన అనేక ఉగ్రవాద దాడులకు ప్రతిచర్యగానే ఈ దాడులు జరిగాయని తరార్ ధృవీకరించారు.కాగా, పాకిస్థాన్-ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దు వెంబడి భద్రతా దళాలు పక్కా ప్రణాళికతో, నిఘా ఆధారిత క్షేత్రస్థాయి ఆపరేషన్‌ను చేపట్టాయి. సరిహద్దు ప్రాంతంలో 'జమాత్-ఉల్-అహ్రార్', 'ఫితనా-అల్-ఖవారిజ్'కు చెందిన ఉగ్రవాదుల స్థావరాలు, సురక్షిత కేంద్రాలపై లక్షిత దాడులు జరిపి ఇరవై తొమ్మిది మంది 'ఖవారిజ్'లను పాక్ భద్రతా దళాలు హతమార్చాయని సమాచార శాఖా మంత్రి తెలిపారు.

## మూడు నెలల్లో ఎన్నికలు రావొచ్చు..

కాగా ఆ పార్టీకి 108 స్థానాలే వచ్చాయని గుర్తు చేశారు.ప్రస్తుతం ప్రభుత్వం ఇతర పార్టీల మద్దతుతోనే కొనసాగుతోందన్నారు. ఇటీవల వరకు డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్షాలు, వీసీకే, ఐయూఎంఎల్ మద్దతుతోనే ప్రభుత్వం నడుస్తోందని చెప్పారు. అలాంటి ప్రభుత్వం ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేమన్నారు. ఎప్పుడు కూలిపోతుందో తెలియదని వ్యాఖ్యానించారు. అందుకే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని స్టాలిన్ సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత కాకుండా, ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో పని ప్రారంభించాలని కోరారు. డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.టీవీకే ప్రభుత్వంపై కూడా స్టాలిన్ విమర్శలు గుప్పించారు. గత నెల రోజులుగా రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్నారు. పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు వెళు తున్నారని ఆరోపించారు. మహిళలపై నేరాలు, మాదకద్రవ్యాల కేసులు, దోపిడీలు, పెట్రోల్ బాంబు దాడులు, విద్యుత్ కోతలు పెరిగాయని విమర్శించారు. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ కూడా ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఒకప్పుడు తమిళనాడులో ఉన్న సుపరిపాలన ఇప్పుడు కనిపించడం లేదన్నారు. ప్రజలు విద్యుత్, తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం పాలన కంటే ప్రచారంపైనే ఎక్కువ దృష్టి పెడుతోందని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాలు సభలా కాకుండా సినిమా షూటింగ్‌లా మారిపోయాయని ఎద్దేవా చేశారు.

# అమరావతిలో అల్లర్లకు వైసిపి కుట్రలు

ఈ సందర్భంగా మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి సంచలన ఆరోపణలు చేశారు. జగన్ మోహన్ రెడ్డి పూర్తిగా విజ్ఞత వదిలేశారన్నారు. అమరావతి పరిరక్షణ కమిటీ పేరుతో అమరావతిలో అశాంతి నెలకొల్పాలని వైసీపీ చూస్తోందని ఆరోపించారు. అమరావతిని వ్యతిరేకించిన వైసీపీ నేతలకు ఆ ప్రాంతంలో పర్యటించే హక్కు లేదని మంత్రి అన్నారు. పేర్ని నాని, అంబటి రాంబాబు పబ్లిక్‌గా బూతులు మాట్లాడి అక్కడి రైతుల్ని రెచ్చగొట్టారని తెలిపారు. నాడు మూడు రాజధానుల పేరుతో అమరావతి రైతుల్ని ఇబ్బందులు పెట్టారని.. దాడులు చేసి తీవ్రంగా కొట్టారని గుర్తుచేశారు. అధికారం పోయిన తర్వాత 'మావిగన్' అంటూ మరోసారి అమరావతిపై తమకున్న అక్కసును తీర్చుకుంటున్నారని విరుచుకుపడ్డారు. మళ్లీ ఇప్పుడు అమరావతి పరిరక్షణ కమిటీ పేరుతో కొత్త డ్రామాకు తెర లేపారన్నారు. వైసీపీ నేతలు తీరు మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మరిన్ని అవమానాలు పడాల్సి వస్తుందని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.



# కూటమి కృషితో సీమకు మహర్దశ

ప్రతిపక్ష హోదా దక్కని వాళ్లు కూడా సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రప్పా, రప్పా అంటే పారిశ్రామికవేత్తలు వస్తారా...? అని మంత్రి ప్రశ్నించారు. గతంలో ఉన్న పరిశ్రమలను సైతం రాష్ట్రం నుంచి తరిమికొట్టారని ఆగ్రహించారు.ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్దనరెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో రాయలసీమలో రక్తపుటేరులు పారించారని ధ్వజమెత్తారు. సోమవారం అమరావతి వేదికగా మంత్రి జనార్దనరెడ్డి మీడియాతో మాట్లాడారు. నేడు కూటమి ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలు రాయలసీమకు వస్తున్నాయని వివరించారు. రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా మారుస్తున్నామని చెప్పుకొచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి డిపాజిట్‌లు కూడా రావని మంత్రి బీసీ జనార్దనరెడ్డి విమర్శించారు.



## సింగపూర్ తో ఏపీ భాగస్వామ్యం బలోపేతంపై చర్చ



ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వంలో పెట్టుబడుల గ్రౌండింగ్ పై దృష్టి సారించాం. రాష్ట్రంలో 750 పరిశ్రమలు వివిధ దశల్లో ఉన్నాయి. ప్రతి 15 రోజులకోసారి ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షిస్తున్నాం. రాష్ట్రంలో 22 క్లస్టర్లను అభివృద్ధి చేస్తున్నాం. గూగుల్, ఆర్సెలార్ మిట్టల్ వంటి కంపెనీలు ఏపీకి వచ్చాయి. రాష్ట్రంలో గతేడాది కంటే జీఎస్టీ వసూళ్లలో వృద్ధి నమోదైంది. గతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పారదర్శక విధానంలో ముందుకు వెళ్తున్నాం. సింగపూర్ తో బలమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నామని చెప్పారు. ఇటీవల సింగపూర్ అధ్యయన యాత్రకు ఏపీ ఉపాధ్యాయుల బృందం వెళ్లిన విషయాన్ని లోకేష్ గుర్తుచేశారు. విద్యారంగంలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చినట్లు వివరించారు. రష్యా పర్యటన విశేషాలను పంచుకున్నారు. ఎడ్గర్ పాంగ్ తే చియాంగ్ మాట్లాడుతూ.. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందంజలో ఉందని.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని ఈ సందర్భంగా ప్రశంసించారు. ఏపీ మంత్రుల బృందం, ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఏపీతో భాగస్వామ్యం బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

ప్రజాభూమి

ఎన్టీఆర్, కృష్ణా

మంగళవారం, జూన్ 30, 2026

3


# వ్యవసాయమే దేశానికి వెన్నెముక..రైతే మన అన్నదాత






**ప్రకృతి సేద్యంతో రైతులకు సుస్థిర ఆదాయం రసాయనిక ఎరువుల వాడకం తగ్గిద్దాం**

**కన్నెవీడు లో ఘనంగా నిర్వహించిన జిల్లాస్థాయి ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్**

జగ్గయ్యపేట, ప్రజాభూమి

వ్యవసాయమే దేశానికి వెన్నెముక అని ,రైతే మనకి అన్నం పెట్టేఅన్నదాత అని ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ లు అన్నారు.జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్స వాయి మండలం, కన్నెవీడు గ్రామంలో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో ఘనం గా నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్ర మంలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ శ్రీరాం రాజగో పాల్ (తాతయ్య) , ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ,20 సూత్రాల అమలు చైర్మన్ లంక దినకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.సాంప్రదాయ వ్యవసా య సంస్కృతికి ప్రతీకగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపా ల్ కి గ్రామ రైతులు, మహిళలు, ప్రజలు ఘన స్వాగ తం పలికారు. అలంకరించిన ఎడ్లబండిపై ఎమ్మెల్యే ని ఊరేగింపుగా సభా ప్రాంగణానికి తీసుకువె ళ్లగా, గ్రామస్తులు హర్ష ధ్వానాలతో స్వాగతం తెలిపారు. జానపద కళారూపాలు, మంగళవా యిద్యాలు, సంప్రదా య వేషధారణలతో కార్యక్ర మం ఎంతో వైభవంగా జరిగింది.సభా ప్రాంగణానికి చేరుకు న్న అనంతరం ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తో కలిసి వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖ, సహకార శాఖ, వ్యవసాయ అను బంధ విభా గాలు ఏర్పాటు చేసిన వివిధ ప్రదర్శన స్టాల్స్‌ను సందర్శించి రైతులకు అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ సాంకేతికత, నూతన పంటల సాగు విధానాలు, యంత్రాల వినియోగం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అధికారులను అడిగి తెలుసుకు న్నారు. రైతులతో మమేకమై వారి సమస్యలు, సూచనలు తెలుసుకొని ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.అనంతరం సాంప్రదాయ వ్యవసా యానికి ప్రతీకగా నిర్వహించిన అరక దున్నే కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , కలెక్టర్ లక్ష్మీ శ స్వయంగా పాల్గొని రైతులతో కలిసి పొలంలో అరక దున్నారు. రైతు జీవన విధానాన్ని ప్రతిబింబించే ఈ కార్యక్రమం అందరినీ ఆకట్టుకుంది. రైతుల కష్టాన్ని గుర్తిస్తూ వారి శ్రమకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే రాజగోపాల్అన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాత య్య) మాట్లాడుతూఏరువాక పౌర్ణమి తెలుగు రైతు సంప్రదాయంలో అత్యంత విశిష్ట మైన పండుగ అని, భూమాతను పూజించి కొత్త వ్యవసాయ సంవత్స రానికి శ్రీకారం చుట్టే పవిత్రమైన రోజుగా రైతులు భావిస్తారని తెలిపా రు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట నియోజకవర్గంలోని రైతులందరికీ హృదయపూర్వక ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు.వ్యవసాయమే దేశానికి వెన్నెముక... రైతే మన అన్నదాత" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు సంతోషంగా ఉంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు, ఆధునిక వ్యవసాయ విధానాలను అమలు చేస్తోందని వివరించారు.భూమాత ఆశీస్సులతో ఈ ఏడాది సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రతి రైతు కుటుంబం సుఖసం తోషాలు, ఐశ్వర్యాలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ నాణ్యమైన విత్తనాలు, శాస్త్రీయ పద్ధతులతో సాగు చేసి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న పథకాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసా యాన్ని మరింత లాభదాయకంగా మార్చేందుకు అధికారులు రైతులకు ఎల్లప్పుడూ అందుబా టులో ఉండాలని ఎమ్మెల్యే రాజగోపాల్ సూచిం చారు. గ్రామీణ వ్యవసాయ వ్యవస్థ బలోపేతం, సాగునీటి వసతుల అభివృద్ధి, వ్యవసాయ యాంత్రీకరణకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు.జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లా డుతూ అన్నదాతలు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అందిపుచ్చుకోవాలని అన్నా రు. వ్యవ సాయ డ్రోన్లు స్మార్ట్ ఉపకరణాలు ప్రత్యేక యాప్లు ఇలా సాంకేతికతను అన్నదాతలు సద్వినియోగం చేసుకొని మంచి దిగుబడులను ఆదాయాలను పొందాలని కలెక్టర్ లక్ష్మి శ సూచించారు. ఆరోగ్యకర వ్యవసాయ ఉత్పత్తులను పొందడం ద్వారా స్వర్ణాంధ్రకు



భావితరాలకు మంచిదని అన్నారు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సంక్షేమ వ్యవసాయ అభివృద్ధి సాంకేతికత సేవలను రైతులకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఏపీ ఎయిమ్స్ యాప్ అందుబాటులోకి తీసుకువ చ్చిందని అన్నారు. ఈ యాప్ ద్వారా సమగ్ర వ్యవసాయ సాంకేతికత సమాచారం రైతుల మొబైల్ లో ఫోన్లలోనే సులభంగా అందుబాటు లోకి వచ్చిందని వివరించారు. అలానే నానో ఎరువుల వాడకంలో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయన ఎరువులు పురుగుమం దులు వినియోగించడం వల్ల మట్టి సారం తగ్గిపో వటంతో పాటు మనిషి ఆరోగ్యం పై కూడా ప్రభావం చూపుతుందని విదేశాలకు మన ఎగుమతులు చేసే వివిధ వ్యవసాయ ఉత్పత్తులు తిరస్కరణకు గురై వెనక్కి రావడానికి కారణం విచ్చలవిడిగా రసాయన ఎరువుల మరియు పురుగుమందుల వాడకమే అని వివరించారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ కొండయ్య, వత్సవాయి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వడ్లమూడి రాంబాబు, కానూరి కిషోర్, గ్రామ సొసైటీ చైర్మన్ కర్నాటి శంకర్, సాగర్ల కృష్ణవేణి, చావా నాగేశ్వరరావు, నెల్లూరి శ్రీనివాసరావు, జామ ఆనందరావు, దారెల్లి చిరంజీవి, ఆదిమల్ల రమేష్, చిట్టూరి రమేష్, కర్నాటి వివేక్, ధారావతు శ్రీను, కూరపాటి నాగేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## నిరుపేదలకు అండగా మేమున్నాం సేవా సంస్థ

ప్రజాభూమి పెడన

కృష్ణాజిల్లా పెడన పట్టణం మేమున్నాం సేవా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీనివాస్ వీణం వారి ఆధ్వర్యంలో బంటుమిల్లి రోడ్ జంక్షన్ లోని చలివేంద్రం మరియు రామలక్ష్మి వీవర్స్ కాలనీ మరి యు రెండు మూడు వార్డులోని యువజన గ్రంథాలయం వద్ద సుమారు 100 లోపు చీరలు వృద్ధమ హిళలకు,దివ్యాంగులు వారికి ఉచితంగా కొత్త కలంకారీ రిమార్క్ చీరలు పంపిణీ చేయడం జరిగిం ది మన సంస్థ సేవలు మెచ్చి కొంత మంది మహిళలకు ఆసరాగా అందించిన సహాయం చూసి దాతృత్వం చాటుకున్న కలంకారీ పారిశ్రామిక వేత్తను నిండు మనసుతో దీవించి ఆశీర్వదించడం జరిగింది ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ తో పాటు సభ్యులు కొలుకుల శ్యామ సుందర రావు, పుట్టిసపు పవన్ కళ్యాణ్, మేడక కిషోర్, వెంకన్న తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయగా మాకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు అని అన్నారు.

## అభయ ఆంజనేయ స్వామి ఆలయ శంకుస్థాపన కార్యక్రమంలో కాగిత కృష్ణ ప్రసాద్

ప్రజాభూమి పెడన



పెడన పట్టణంలోని పల్లోటి కాలనీలో శ్రీ అభయాంజనేయ స్వామి వారి ఆలయ నిర్మాణా నికి శంకుస్థాపన కార్యక్ర మంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాగి త కృష్ణ ప్రసాద్ సనాతన



ధర్మం లో ఆలయాల విశిష్ట ఎంతో విలువైన దని ఆధ్యాత్మిక సాంస్కృతిక వైభవానికి ఆలయాలు నిలుస్తాయని కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.పల్లోటి కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఈ ఆలయానికి శ్రీవాణి ట్రస్ట్ ద్వారా నిధులు మంజూరు కి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తెలిపారు.

## పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫౌండేషన్ కోర్సు



**సీడ్స్ (SEEDS) ఆధ్వర్యంలో వై.జె.ఆర్ డి.ఎమ్.ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో శిక్షణ**

**విజయవంతంగా పూర్తి చేసిన వారికి నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC) సర్టిఫికేట్**

మచిలీపట్నం/ రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

సోషల్ ఎంపవర్‌మెంట్ అండ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ సొసైటీ (సీడ్స్) ఆధ్వర్యంలో మచిలీపట్నం లోని వై.జె.ఆర్ డి.ఎమ్.ఎస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం 'ఫౌండేషన్ కోర్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' శిక్షణా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన:ఈ శిక్షణలో విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధస్సు) ప్రాథమిక అంశాలు, జనరేటివ్ ఏఐ, ఏఐ రీసెర్చ్, విద్యారంగంలో ఏఐ ప్రాధాన్యత, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, ఏఐ ఎథిక్స్ (నైతిక విలువలు) మరియు ఆధునిక సాంకేతికతలపై పూర్తి అవగా హన కల్పించారు. భవిష్యత్తులో ప్రతి రంగంలోనూ ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని, దీనిని నేర్చుకోవ డం ద్వారా విద్యార్థులు ఉన్నత విద్య, పరిశోధన మరియు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచుకో వచ్చని నిర్వాహకులు వివరించారు.

ఏఐ టూల్స్‌పై ప్రాక్టికల్ శిక్షణ:శిక్షణలో భాగంగా ప్రముఖ ఏఐ టూల్స్ అయిన చాట్ జీపీటీ, గూగుల్ జెమిని, మైక్రోసాఫ్ట్ కోపైలట్, కాన్వా ఏఐ వంటి వాటిని ఉపయోగించి కింది అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్షంగా (ప్రాక్టికల్) శిక్షణ ఇచ్చారు:ప్రాజెక్ట్ మరియు సెమినార్ రిపోర్టుల తయారీ ప్రెజెంటేషన్లు, అసైన్‌మెంట్లు, రెజ్యూమ్‌ల రూపకల్పనఅధికారిక లేఖలు, ఈ-మెయిల్స్, స్టడీ మెటీరియల్ రాయడంకోడింగ్, డీబగ్గింగ్ మరియు డేటా విశ్లేషణపరిశోధన, అనువాదం మరియు ఇంటర్వ్యూ ప్రిపరేషన్‌సరైన 'ప్రాంప్ట్' (ఆదేశాలు) ఇవ్వడం ద్వారా ఏఐ నుండి అత్యుత్తమ ఫలితాలను ఎలా పొందాలో విద్యార్థులకు లైవ్‌లో ప్రదర్శించి చూపించారు.నేషనల్ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (NSDC) సర్టిఫికేషన్:ఈ కోర్సును విజయవంతంగా పూర్తి చేసిన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వానికి చెందిన నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (NSDC) గుర్తింపు పొందిన సర్టిఫికేట్ అందజేయబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సర్టిఫికేట్ విద్యార్థుల నైపుణ్యాభివృ ద్ధికి తోడ్పడటంతో పాటు భవిష్యత్తు ఉపాధి అవకాశాలకు ఎంతో ప్లస్ అవుతుందని పేర్కొన్నారు.

ముగింపు:విద్యార్థులు ఈ శిక్షణలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని, ఏఐ టూల్స్‌ను స్వయంగా ఆపరే ట్ చేస్తూ వాటి ప్రయోజనాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సరికొత్త సాంకేతిక నైపుణ్యాలను, ఆసక్తిని పెంపొందించడానికి ఎంతో దోహదపడిందని కళాశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది.పాల్గొన్న ప్రముఖులు:ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. రవికుమార్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎన్. సుష్మ, కళాశాల మేనేజ్ మెంట్ సభ్యులు కిరణ్, సీడ్స్ ప్రతినిధుల బృందానికి చెందిన వేణు, ఉదయ్, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.


# భవిష్యత్తును విద్యుద్దీకరిద్దాం

## వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ బీటెక్ .. సరికొత్త మెరుపు



**నాలుగేళ్లలో స్థిరమైన కెరీర్.. ప్రభుత్వ, ప్రైవేట్, రెన్యూవబుల్, ఐటీ రంగాల్లో అనంత అవకాశాలు**

**-ఈఈఈతో మీ భవిష్యత్తు విద్యుద్దీక రించండి**



**డా. జె. ఉదయ్ భాస్కర్ M.Tech., Ph.DEEE విభాగాధిపతి (HOD),పవర్ సిస్టమ్స్ & ఆటోమేషన్ నిపుణులు,వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాల,మచిలీపట్టణం**

మచిలీపట్నం రూరల్ ప్రజాభూమి ప్రతినిధి: నేటి విద్యుద్ధీకృత ప్రపంచంలో.. స్మార్ట్ గ్రిడ్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాలు, సోలార్ ప్లాంట్లు, రైల్వేస్, స్టీల్ ప్లాంట్లు, డేటా సెంటర్ల వరకూ... ప్రతిచోటా ఎలక్ట్రికల్ & ఎలక్ట్రానిక్స్ ఇంజనీ రింగ్ (EEE) బీటెక్ నిపుణుల అవసరం అనన్యసామా న్యంగా ఉంది. ఈ నేపథ్యంలో మచిలీపట్నం లోని ప్రతిష్ఠాత్మక యల మంచిలి జనార్ధనరావు - దైతా మధుసూదన శాస్త్రి ఇంజినీరింగ్ కళాశాల (YJR DMSCE) లో 4-సంవత్సరాల B.Tech - EEE ప్రోగ్రామ్ యువతకు పవర్ సెక్టార్, ఆటోమేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ రంగాలలో సరికొత్త కెరీర్ తలుపులు తెరుస్తోంది.

ఈఈఈ బీటెక్ అంటే ఏమిటి? – విద్యుత్ + ఎలక్ట్రానిక్స్ కలయికే మీ కెరీర్ పునాది సాధారణ ఎలక్ట్రికల్ కోర్సులతో పోలిస్తే, ఈఈఈ బీటెక్ ప్రత్యేకమైనది. ఇందులో భారీ విద్యుత్ ఉత్పత్తి (జనరేషన్) నుంచి సూక్ష్మమైన ఎలక్ట్రానిక్ చిప్ మరియు ఆటోమేషన్ వరకు పూర్తి అవగాహన లభిస్తుంది.

ముఖ్యమైన సబ్జెక్టులు : పవర్ సిస్టమ్స్, ఎలక్ట్రికల్ మిషన్లు, పవర్ ఎలక్ట్రానిక్స్, కంట్రోల్ సిస్టమ్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్, రెన్యూవబుల్ ఎనర్జీ, డిజిటల్ సిగ్నల్ ప్రాసెసింగ్.

YJR DMS కళాశాలలో EEE విభాగం ప్రత్యేకతలు డ్యూయల్ ఫోకస్: విద్యుత్ (పవర్) + సిగ్నల్ ప్రాసెసింగ్ (ఎలక్ట్రానిక్స్) + కంట్రోల్ సిస్టమ్స్ కలయిక.

అత్యాధునిక ప్రయోగశాలలు : పవర్ సిస్టమ్స్ ల్యాబ్, ఎలక్ట్రికల్ మెషిన్స్ ల్యాబ్, పీఎల్సీ & స్కాడా (PLC & SCADA) ల్యాబ్, మైక్రోకంట్రో లర్స్ ల్యాబ్.

ఇండస్ట్రీ-రెడి కరికులం: మాట్ల్యాబ్ (MATLAB), సిమ్యులింక్, ఆటోక్యాడ్ ఎలక్ట్రికల్, ఈతర్‌నెట్/ఐపీ బేస్డ్ కంట్రోల్, ఎంబెడెడ్ సిస్టమ్స్ పై శిక్షణ.

ప్రత్యేక సర్టిఫికేషన్లు: క్యాంపస్ లోనే సీమెన్స్ (Siemens), రాక్‌వెల్ ఆటోమేషన్, పీఎల్సీ, వీఎఫ్డీలపై ఇండస్ట్రీ గ్లోబల్ సర్టిఫికేట్లు పొందే అవకాశం.

EEE బీటెక్ ఎందుకు ఎన్నుకోవాలి? కోర్సు వ్యవధి: 4 సంవత్సరాలు (8 సెమిస్టర్లు) – ఇంటర్మీడియట్ (MPC) తర్వాత నేరుగా చేరొచ్చు.

ఉన్నత విద్యకు సువర్ణావకాశం : ఎంటెక్, పీహెచ్‌డీలకు అద్భుతమైన మార్గం. విదేశాల్లోనూ ఈఈఈ నిపుణులకు విపరీతమైన డిమాండ్ ఉంది.

ప్రతిభకు ప్రోత్సాహం : మెరిట్ విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్షిప్లు, ప్రాజెక్ట్ గ్రాంట్లు, మరియు ఉచిత ప్రయోగశాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి.

ఉద్యోగ, కెరీర్ అవకాశాలు – ఇక మీ వంతు నైపుణ్యమేఈఈఈ బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ రంగాలలో భారీ డిమాండ్ ఉంది.

EEEరంగం ఉద్యోగ అవకాశాలు / కంపెనీలు: ప్రభుత్వ రంగం: (PSUs)APEPDCL, TSTRANSCO, APGENCO, NTPC, POWERGRID, SAIL, BHEL, DRDO, ISRO, రైల్వేస్ (JE, ASE, GET పోస్టులు).ప్రైవేట్ రంగం: (కోర్)సీమెన్స్, ష్నైడర్ ఎలక్ట్రిక్, లార్సెన్ & టుబ్రో (L&T), బాష్, హనీవెల్, ఫ్లూక్, టెస్టో.EV & రెన్యూవబుల్ రంగంటాటా మోటార్స్, ఒలా ఎలక్ట్రిక్, సజ్జన్ ఇండియా, సుజ్లాన్, రీన్యూ పవర్, సోలార్ ప్రాజెక్ట్ ఇంజనీ ర్లు.ఐటీ & కోర్ ఇండస్ట్రీ హార్డ్వేర్ ఇంజనీర్, టెస్టింగ్ ఇంజనీర్, కంట్రోల్ ఇంజనీర్, డేటా సెంటర్ పవర్ మేనేజర్.స్వయం ఉపాధిఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ లైసెన్స్, సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్ వ్యాపారం.

విద్యార్థుల సమగ్రాభివృద్ధి – సిద్ధాంతం + ప్రయోగం + పరిశ్రమ ఫౌండేషన్ కోర్సులు: బేసిక్ ఎలక్ట్రికల్, సర్క్యూట్ థియరీ, నెట్‌వర్క్ విశ్లేషణపై బలమైన పునాది.

సాఫ్ట్ స్కిల్స్ & ప్లేస్మెంట్ ప్రిపరేషన్ : ఏప్టిట్యూడ్, గ్రూప్ డిస్కషన్లు, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, ఫేస్-టు-ఫేస్ ఇంటర్వ్యూ ప్రాక్టీస్.

ఇండస్ట్రీ విజిట్లు & ఇంటర్న్షిప్లు: విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్, గండికోట సోలార్, 400కేవీ సబ్‌స్టేషన్, ఎలక్ట్రిక్ వాహన తయారీ యూనిట్ల సందర్శన.

క్యాంపస్ డ్రైవ్లు: ప్రతి సంవత్సరం కోర్ మరియు ఐటీ కంపెనీలు నేరుగా విద్యార్థులను ఎంపిక చేస్తాయి. మా విభాగం నుంచి ఇప్పటికే 85% పైగా విద్యార్థులు ప్లేస్‌మెంట్లు సాధించారు.

విభాగాధిపతి (HOD) మాట

ఈఈఈ బీటెక్ విద్యార్థులు నిరుద్యోగులుగా మిగలడం అంటే ఇప్పటి మార్కెట్లో అసాధ్యం. వారు సబ్-స్టేషన్ల ఇన్చార్జిలుగా, సోలార్ ప్రాజెక్టుల ప్రాజెక్ట్ ఇంజనీర్లుగా, పవర్ ప్లాంట్ల కంట్రోల్ రూమ్ ఆపరేటర్లుగా, ఐటీ కంపెనీల్లో టెస్టింగ్ ఇంజనీర్లుగా విజయవంతమవుతు న్నారు. మా లక్ష్యం – ప్రతి విద్యార్థిని సర్టిఫైడ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా, పరిశ్రమలకు అవసరమైన ఆచరణాత్మక నైపుణ్యాలతో తీర్చిదిద్దడం."

మీ భవిష్యత్తు ఇప్పుడే మెరుపు వేగంగా మార్చుకోండి!

తల్లిదండ్రులారా, విద్యార్థులారా.. ఈఈఈ బీటెక్ కేవలం ఒక డిగ్రీ కాదు. ఇది పవర్ సెక్టార్, ఆటోమేషన్, రెన్యూవబుల్ ఎనర్జీ, రైల్వే, డిఫెన్స్, ఐటీ, మెరైన్, ఏరోస్పేస్ – అనేక రంగాల్లోకి ప్రవేశించడానికి ఒక "గోల్డెన్ టిక్కెట్". వైజేఆర్ డీఎంఎస్ కళాశాలలో ఈ నాలుగేళ్ల ప్రయాణంలో మీరు సాంకేతిక నిపుణుడిగా మారి, స్థిరమైన భవిష్యత్తును నిర్మించుకోండి.

## పామర్తి శ్రీనివాస్ అకాల మరణం తీరని లోటు: కలెక్టర్ డీకే బాలాజి



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా కలెక్టరేట్‌లోని మెజిస్ట్రేట్ విభాగంలో విధులు నిర్వహించిన పామర్తి శ్రీనివాస్ అకాల మరణం జిల్లా యంత్రాంగానికి తీరని లోటని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. శనివారం అకాల మరణం చెందిన శ్రీనివాస్‌కు సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగిన సంతాప సభలో ఆయన నివాళులర్పించారు.సోమ వారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం ప్రారంభానికి ముందు జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవలం 43 ఏళ్ల వయస్సులోనే శ్రీనివాస్ మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింద న్నారు. ఆయన మరణవార్తను మొదట వినగానే నమ్మలేకపో యానని, ఎప్పుడూ చిరునవ్వుతో అందరితో కలిసిమెలిసి ఉండే శ్రీనివాస్ వంటి అధికారి ఇక లేరనే విషయం తీవ్ర వేదన కలిగి స్తోందన్నారు.శ్రీనివాస్ ఎంతో సమర్థుడు, చట్టాలపై విశేష పట్టు కలిగిన అధికారిగా గుర్తింపు పొందారని తెలిపారు. ముఖ్యంగా ఆర్మ్స్ యాక్ట్, లోకాయుక్త, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లకు సంబంధించిన అంశాలను సమర్థవంతంగా నిర్వహించేవా రని కొనియాడారు. ఆంగ్ల భాషపై అద్భుతమైన పట్టు ఉండ టంతో పాటు, పరిపాలనలో అత్యంత సమర్థత, చురుకుదనం ప్రదర్శించేవారని అన్నారు. రెవెన్యూ స్పోర్ట్స్ నిర్వహణలోనూ ఆయన ముందుండి పనిచేశారని గుర్తు చేశారు.జీవితం ఎంతో అనిశ్చితితో కూడుకున్నదని, ఈ ఘటన ప్రతి ఒక్కరికీ ఒక హెచ్చరిక లాంటిదని కలెక్టర్ అన్నారు. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఉద్యోగి క్రమం తప్పకుండా శారీరక వ్యాయామం చేయడం, సమయానికి ఆహారం తీసుకోవడం, తగినంత నీరు తాగడం, ఒత్తిడిని నియంత్రించుకోవడం, రోజూ 6 నుంచి 7 గంటలపాటు నాణ్యమైన నిద్ర పొందడం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లు అలవరచుకోవాలని సూచించారు. శ్రీనివాస్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు.కార్యక్రమంలో ఇంచార్జి డీఆర్ఓ పి పోతురాజు, కేఆర్ఆర్సీ ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, జెడ్పీ సీఈవో డాక్టర్ జే



అరుణ, డిపిఓ ధనలక్ష్మి, కలెక్టరేట్ ఏవో రాధిక, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజాభూమి

ఏలూరు, పశ్చిమగోదావరి **4**

మంగళవారం 30, జూన్ 2026




## పవన్ కళ్యాణ్‌పై వ్యక్తిగత విమర్శలు మానుకోవాలి

### జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు**

ఏలూరులో జరిగిన దళిత క్రైస్తవ శంఖారావం సభలో జై భీమ్ పార్టీ అధ్యక్షుడు జడ శ్రవణ్ కుమార్ పవన్ కళ్యాణ్‌పై చేసిన వ్యాఖ్యలను ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు తీవ్రంగా ఖండించారు.ఏలూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ, ప్రభుత్వంలో భాగస్వామిగా బాధ్యతాయుతంగా పనిచేస్తున్న పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా విమర్శించడం తగదన్నారు.దళితులపై ఎక్కడ అన్యాయం జరిగినా పవన్ కళ్యాణ్ స్పందించారని, కుల వివక్షను వ్యతిరేకిస్తూ అన్ని వర్గాల ఐక్యతకు ఆయన కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ప్రస్తావించాల్సిన వేదికలను వ్యక్తిగత విమర్శలకు ఉపయోగించడం సరికాదని, కులాల పేరుతో రాజకీయ దుష్ప్రచారం చేయకుండా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జనసేన పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

## క్రాంతి కుమార్ ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి: దళిత సేన

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు**



విజయవాడకు చెందిన దళిత యువకుడు, ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర చైర్మన్ పేరు పోగు వెంకటేశ్వరరావు కుమారుడు పేరు పోగు క్రాంతి కుమార్ ఆత్మహత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ డిమాండ్ చేశారు.సోమవారం ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి దేవకి దేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆత్మహత్యకు కారణమైన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు చేయాలని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఈ వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి పంపిస్తామని ఇన్‌చార్జి డీఆర్ఓ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## వంద శాతం పోలియో టీకాలే లక్ష్యం.. ఇంటింటా ప్రత్యేక సర్వే

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**



పల్స్ పోలియో కార్యక్రమంలో వంద శాతం టీకాలు అందేలా చర్యలు చేపట్టినట్లు సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ మంజులాదేవి తెలిపారు. సోమవారం ఇంటిం టి సర్వేలో భాగంగా సగ్గూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గ్రామాల్లో వైద్య సిబ్బం ది ప్రతి ఇంటికి వెళ్లి జననం నుంచి ఐదేళ్లలోపు వయస్సు గల చిన్నారుల ఎడమ చేతి చిటికెన వేలిపై పోలియో గుర్తును పరిశీలించి, ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో ఓరల్ పోలియో చుక్కలు వేయించుకున్నారా లేదా అనే వివరాలను నమోదు చేశారు. టీకా వేయించుకోని చిన్నారులను గుర్తించి వెంటనే ఓరల్ పోలియో చుక్కలు వేయించారు. అలాగే తోటపల్లి గ్రామంలోని హిల్ పేరడైజ్ పాఠశాలతో పాటు వట్టిగుడిపాడు గ్రామంలోని అధిక ప్రమాద ప్రాంతాలైన కోళ్ల ఫారాలు, గేదెల ఫారాలు, గ్రామానికి దూరంగా ఉన్న తోటలు, చెరువుల సమీపంలోని నివాస ప్రాంతాలను కూడా మొబైల్ బృందం సందర్శించి చిన్నారులకు పోలియో చుక్కలు అందించారు. పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పని సరిగా పోలియో టీకాలు వేయించాలని, ఒక్క చిన్నారి కూడా మిగలకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తూ సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రత్యేక ఇంటింటి సర్వే కార్యక్రమం మంగళవారం కూడా కొనసాగుతుందని వారు వెల్లడించారు. ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో డాక్టర్ సంజాప్రియ, ఎస్ మ్ ఎన్ పి వీ శాంతి కుమారి, ఎంపీహెచ్ఎస్ జె జోషి, డి విజయ, బిందు గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలి

### ఆగర్రు సొసైటీ అధ్యక్షుడు డేవిడ్ రాజు

**ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు**



రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా తీసుకున్న స్వల్ప, దీర్ఘకాలికరణాలు గడువు తేదీలోగా చెల్లిస్తేనే అటు రైతుకు, ఇటు సొసైటీకి ప్రయోజనాలు చేకూర్తాయని పాలకొల్లు మండలం ఆగర్రు సొసైటీ అధ్యక్షుడు మేడిది జాన్ డేవిడ్ రాజు అన్నారు. సహకార వారోత్స వాలు ఆయన ప్రారంభించి ఆ సందర్భంగా సోమవారం సొసైటీ అధ్యక్షుడు జాన్ డేవిడ్ రాజు రైతుల సహకార రచ్చబండ కార్యక్రమం నిర్వహించి రైతులతో మాట్లాడారు. రచ్చబండ వద్ద రైతులంతా కలిసి మాట్లాడుకుంటే ఏ బ్యాంకులో ఎంత రుణం లభిస్తుంది లబ్ధి ఎలా చేకూరు తుంది తదితర విషయాలు తెలుస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్వా అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ రాచమల్ల మీరయ్య, డైరెక్టర్లు పెన్మెత్స సూర్యనారాయణ రాజు, పోలినాటి నాగేశ్వరరావు, సీఈఓ కడియం కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

# సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలి

### శాసనసభ్యులు బాలరాజు

**ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి**



వర్షాలు సకాలంలో వర్షించి రైతులు సుభిక్షంగా ఉండాలని పోలవరం శాసనసభ్యులు బాలరాజు వేడుకున్నారు.ఏరువాక పౌర్ణమి సందర్భంగా జీలుగుమిల్లి మండలం బర్రింకలపాడు గ్రామంలోని గోళీల దిబ్బలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి నాగలి పట్టి పొలాన్ని దున్ని, నవధాన్యాలు చల్లి రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చేందుకు ఆధునిక సాంకేతికతను గ్రామీణ స్థాయికి తీసుకెళ్తూ, ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు.ఏరువాక పౌర్ణమి అనేది రైతు జీవితంలో ఎంతో పవిత్రమైన పండుగ అని, భూమాతకు నమస్కరిస్తూ కొత్త వ్యవసాయ సీజన్‌కు శ్రీకారం చుట్టే ఈ సంప్రదాయాన్ని ప్రతి రైతు గౌరవంగా కొనసాగించాలని కోరారు.ప్రకృతి అనుకూలించి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రతి రైతు పొలం పచ్చగా కళకళలాడాలని, రైతు ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పొట్ట రామారావు, ఏఎంసీ డైరెక్టర్ గద్దె సుబ్రమణ్యం, టిడిపి జిల్లా రైతు ఉపాధ్యక్షులు ఉండవెల్లి సోమసుందరం, తాటి ఆకులు గూడెం మాజీ సర్పంచ్ వనమా రాంబాబు,సొసైటీ అధ్యక్షులు సరిపల్లి సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షులు సుంకవల్లి సాయి, టీడీపీ సీనియర్ నాయకులు ఉండవల్లి సోమసుందరం, పిన్నమనేని మధు, టీ.నర్సాపురం మండలం జనసేన నాయకులు పూనెం మాదిత్య, కూటమి నాయకులు బండారు అనిల్ కుమార్, సంకుల రామకృష్ణ,రాయి సుబ్బారావు, రూపా సత్యనారాయణ, శాఖమూడి సాయి, పాలచర్ల మహేష్, గారపాటి శ్రీనివాస్, గుడెల్లి లక్ష్మీనారాయణ, నాలి శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏడి బుజ్జిబాబు, ఏవోలు బాలాజీ, పోశాసారావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు, మామిళ్ళ అప్పారావు, శెట్టి వెంకటేశ్వరరావు, హరికృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘం రాష్ట్ర మహాసభల ప్రచార జాత ప్రారంభం

- **కొమ్మారెడ్డి సత్యనారాయణ మూర్తి,ఉద్దరాజు రామంల స్ఫూర్తితో రైతు ఉద్యమాలు సాగిద్దాం.**
- **జులై 3న హలో రైతన్న- చలో ఏలూరుకు రైతులు తరలిరండి.**

**ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.**

రైతు ఉద్యమ నిర్మాతలు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, ఉద్దరాజు రామం ల స్ఫూర్తితో రైతు ఉద్యమాలను సాగిద్దామని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సీనియర్ నాయకులు వై. కేశవరావు పిలుపునిచ్చారు. సోమవారం ఏలూరులోని పాత బస్టాండ్ సెంటర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నుండి జులై 3,4,5 తేదీల్లో ఏలూరులో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23 మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ప్రచార జాతాను వై.కేశవరావు జండా ఊపి ప్రారంభించారు. ముందుగా పవర్ పేట ఉద్దరాజు రామం భవనం నుండి పాత బస్టాండ్ వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన జాతా ప్రారంభ సభలో వై.కేశవరావు మాట్లాడుతూ 1936లో అఖిల భారత కిసాన్ సభ ఏర్పడిందని చెప్పారు. మొదట ఆంధ్ర రాష్ట్ర రైతు సంఘం, తర్వాత 1954లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏర్పడి నాటి నుండి నేటి వరకు అనేక రైతాంగ ఉద్యమాలను నిర్వహించిందని గుర్తు చేశారు. 1936-37 కాలంలో కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, చలసాని వాసుదేవరావు నాయకత్వంలో చారిత్రాత్మక రైతు రక్షణ యాత్ర జరిగిందని, ఫలితంగా అనేక రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యాయని చెప్పారు. నేడు వ్యవసాయం కార్పొరేటీకరణ చేసేందుకు ప్రభుత్వాలు విధానాలు ఉన్నాయని ఇవి మన రైతాంగానికి తీవ్ర నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా, భారత్ వాణిజ్య ఒప్పందం వలన పాడి పరిశ్రమ, పౌల్ట్రీ పరిశ్రమ దెబ్బ తింటుందని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాలేదని, తక్షణమే మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతు రక్షణ, వ్యవసాయ రంగ పరిరక్షణ కోసం, రైతు మనుగడ కోసం నేటి రైతాంగ ఉద్యమాలకు ప్రాధాన్యత ఉందని, ఇందులో రైతాంగం ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జులై 3న హలో రైతన్న- చలో ఏలూరు కార్యక్రమానికి అన్ని పంటల రైతులు తరలిరావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి. బలరాం మాట్లాడుతూ నేడు రైతుల వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉందని, అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంటల రైతులు కష్టపడి పండించిన పంటలకు స్వామినాథన్ కమిషనర్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50% కలిపి మద్దతు ధరలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 23వ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రాజా రామ్మోహన్ రాయ్, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్.లింగరాజు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎం.నాగమణి, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి పి.మంగరాజు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సూర్యకిరణ్, సిఐటియు నగర నాయకులు పంపన రవికుమార్, ఎం. ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.




# చింతలపూడి హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పి. స్వప్న సస్పెన్షన్

### ఏలూరు జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు

**ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా**




చింతలపూడిలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం (ఐడబ్ల్యూహెచ్సి) హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ (హౌస్ కీపింగ్) పి. స్వప్నను తక్షణమే విధుల్లోంచి సస్పెండ్ చేస్తూ ఏలూరు జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ కె, వెట్రి సెల్వి. ఆదేశాలు జారీ చేశారు.

**నిబంధనల ఉల్లంఘన.. బాధ్యతారాహిత్యం**

ఈ నెల 27వ తేదీ (శనివారం) రాత్రి 8:45 గంటల సమయంలో, సదరు వసతి గృహంలో 7వ తరగతి చదువుతున్న బుల్లా అక్షయ అనే విద్యార్థినిని, ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ స్వప్న తన సొంత నిర్ణయంతో బయటకు పంపించి వేశారు. రాత్రి వేళ అని కూడా చూడకుండా విద్యార్థిని పట్ల అత్యంత బాధ్యతారాహిత్యంగా, కఠినంగా ప్రవర్తించారు. హాస్టల్ సిబ్బంది ద్వారా సమాచారం అందుకున్న విద్యార్థిని తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనతో రాత్రికి రాత్రే హాస్టల్‌కు చేరుకోగా, ఎటువంటి సమాధానం చెప్పకుండానే సదరు అధికారిణి ఆ చిన్నారిని తల్లిదండ్రులతో పంపించివేశారు.

**మీడియా కథనాలతో కదలిక**

ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో, ప్రముఖ న్యూస్ ఛానళ్లలో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ ఉదంతాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించినందుకు మరియు ప్రవర్తనా నియమావళి 1964ను ఉల్లంఘించినందుకు గాను ఏపీసీఎస్ (సీసీఏ) రూల్స్ 1991 లోని సబ్-రూల్ (1) (ఏ) రూల్ 8 ప్రకారం పి. స్వప్నను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**అదనపు బాధ్యతల అప్పగింత**

ప్రస్తుతం ఖాళీ అయిన చింతలపూడి బాలికల వసతి గృహ హౌస్ కీపింగ్ పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ సి ఏ) చింతలపూడి (ఐడబ్ల్యూహెచ్ఓ) (ఏవో) హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె. సునీతకు తక్షణమే అప్పగించారు. ఈ సస్పెన్షన్ ఉత్తర్వులను వెంటనే అమలు చేసి, నివేదిక సమర్పించాల్సిందిగా చింతలపూడి అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

# ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం తల్లిదండ్రుల బాధ్యత


### ఇంటింటి సర్వేలో పాల్గొని పోలియో కార్యక్రమాన్ని పరిశీలించిన డిప్యూటీ డీఎంహెచ్ఓ

**ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి**

పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా ఓరల్ పోలియో చుక్కలు వేయించడం ద్వారా పోలియో రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఏలూరు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ పద్మావతి తెలిపారు. పోలియో నిర్మూలనకు ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించి వైద్యశాఖకు సహకరించాలని ఆమె పిలుపునిచ్చారు. వంద శాతం పల్స్ పోలియో లక్ష్య సాధనలో భాగంగా ఆగిరిపల్లి, ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు డాక్టర్ టీనా, డాక్టర్ మహిత, డాక్టర్ నరేంద్ర కృష్ణ, డాక్టర్ జ్ఞాన సందీప్ తమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్వే మంగళవారం కూడా కొనసాగుతుందని వెల్లడించారు. సోమవారం ఆగిరిపల్లి, ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని వడ్లమాను, ఆగిరిపల్లి, ఈదర, శోభనాపురం గ్రామాల్లో మారుమూల ప్రాంతాలను సందర్శించిన డాక్టర్ పద్మావతి ఐదేళ్లలోపు చిన్నారుల ఎడమ చేతి చిటికెన వేలిపై పోలియో గుర్తును పరిశీలించి, పోలియో చుక్కలు వేయించుకున్నారా లేదా అనే వివరాలను నమోదు చేశారు.

పోలియో వ్యాక్సిన్ వల్ల కలిగే ప్రయోజనాలను తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం ఆగిరిపల్లి, ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి బయటి రోగుల సేవలను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టీనా, డాక్టర్ జ్ఞాన సందీప్, హెచ్.వి. రమణ, ఎన్. భాను, బహుళ ప్రయోజన ఆరోగ్య అధికారి పేరయ్య, హరి శంకర్, బేబీ సరోజిని, మధ్యస్థాయి ఆరోగ్య సేవలందించే ఉమాదేవి, ఆశ కార్యకర్తలు మంగ, జే. పద్మ పాల్గొన్నారు





# ఏరువాక పౌర్ణమి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రైతన్నల పండుగ

### చొదిమెళ్ళలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి)తో కలిసి పాల్గొని, ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి

**ప్రజా భూమి ప్రతినిధి ఏలూరు జిల్లా.**

దేశానికీ వెన్నుముక రైతన్న అని, రైతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి చెప్పారు. ఏలూరు రూరల్ మండలం చొదిమెళ్ళ గ్రామంలో సోమవారం ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి)తో కలిసి ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో కలిసి సాంప్రదాయ పద్ధతిలో వ్యవసాయ పనులకు శ్రీకారం చుట్టే కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రైతన్నలు పండుగ అని, రైతులంతా పంటలకు శ్రీకారం చుట్టే తొలిరోజన్నరు. వ్యవసాయం దేశానికి, రాష్ట్రానికి వెన్నెముక అని, రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సాంప్రదాయ విలువలను కూడా కొనసాగించాలని సూచించారు. . రాష్ట్ర ప్రభుత్వం రైతులు సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రైతులకు ఏమి కావాలన్నా చెయ్యుటకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని అన్నారు. అనంతరం రైతులతో మమేకమై వారి సమస్యలు, సాగు పరిస్థితులుపై జిల్లా కలెక్టరు ఆరా తీశారు. రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నదన్నారు. భూసారం వివరాలను రైతులకు తెలియజేసి, అందుకు తగిన విధంగా ఎరువుల వాడకం చేసేలా 31 వేల భూసార పరీక్షల కార్డులను రైతులకు అందించామన్నారు. గత రెండు సంవత్సరాలలో 681 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేశామని, ధాన్యం అందించిన గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలకు సొమ్ము జమచేశామన్నారు. అన్నదాతా సుఖీభవ, సాగులో యాంత్రీకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, డ్రోన్లు వంటివి రైతులకు సబ్సిడీపై అందిస్తున్నదని , రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్నినో పరిస్థితుల కారణంగా వర్షాలు తక్కువ కురిసే అవకాశం ఉందని, రైతులు వ్యవసాయ శాస్త్రజ్ఞులు, అధికారుల సూచించిన వరి వంగడాలను వేయాలన్నారు. రైతులు, కౌలు రైతులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే వ్యవసాయాధికారులు లేదా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ ఏరువాక పౌర్ణమి అనేది తెలుగు రాష్ట్రాల్లో రైతులు ఎంతో వైభవంగా జరుపుకునే తొలకరి వ్యవసాయ పండుగ అని అన్నారు. జ్యేష్ఠ పౌర్ణమినాడు జరుపుకునే ఈ పండుగతోనే రైతులు కొత్త వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారని అన్నారు. తొలకరి జల్లులు కురిసిన తర్వాత, భూమిని దున్నడానికి సిద్ధం చేయడాన్ని 'ఏరువాక' అంటారని తెలిపారు. పొలంలో మొదటిసారి నాగలిని (ఏరును), వ్యవసాయ పని ముట్లను పూజించి దుక్కి దున్నడం ఈరోజున ప్రారంభిస్తారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి తొలి ప్రాధాన్యతను ఇస్తున్నదని, విత్తు వేసిన దగ్గర నుండి రైతు పండించిన పంటను గిట్టుబాటు ధర కల్పించేవరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ రైతుకు అండగా ఉంటుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతీ రైతుకు ఏటా 20 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందిస్తున్నదన్నారు. పంట రుణాలు, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, సాగు యంత్రాలు సరఫరా, పంటల భీమా, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి రైతు పండించిన పంటను కొనుగోలుచేసి వెంటనే సొమ్మును రైతుకు ఖాతాకు జమచేయడం చేస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో ఏలూరు మేయర్ షేక్ నూర్జహాన్, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎం. పార్థసారధి, వ్యవసాయ శాఖ జెడి యస్.కె. హబీబ్ భాషా, వ్యవసాయ శాఖ అధికారులు అనిల్ కుమార్, సంతోష్, తహసీల్దార్ గాయత్రి, వివిధ శాఖలు అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు, కౌలు రైతులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతాంగ సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి కందుల దుర్గేష్
- రాష్ట్ర రైతాంగానికి ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి కందుల దుర్గేష్
- ప్రకృతి వ్యవసాయం, ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు అడుగులు వేయాలని పిలుపు
- గత ప్రభుత్వ ధాన్యం బకాయిలు చెల్లించడంతో పాటు, సేకరించిన ధాన్యానికి 6-48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే అని మంత్రి దుర్గేష్ వెల్లడి

ప్రజా భూమి ప్రతినిధి-నిడదవోలు

దేశానికి వెన్నెముక రైతు. సమాజానికి అన్నం పెట్టే అన్నదాత సుఖంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుంది" అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతాంగం తమ వార్షిక వ్యవసాయ పనులను అధికారికంగా ప్రారంభించే తొలి పండుగ 'ఏరువాక పౌర్ణమి' సంధర్భంగా రాష్ట్రంలోని అన్నదాతలందరికీ ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా



మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు భూమిని, పశుసంపదను పూజించడం ప్రకృతితో మమేకమవ్వడానికి నిదర్శనమన్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులను అధిగమించి అన్నదాతల ఇళ్లలో పాడిపంటలతో లక్ష్మీదేవి తాండవించాలని, ప్రతి రైతుకు మంచి దిగుబడి రావాలని ఆకాంక్షించారు. "సేద్యం అంటే వ్యాపారం కాదు... కోట్లాది జీవుల ఆకలి తీర్చే ఒక యజ్ఞం!" అని చెబుతూ..ముఖ్యంగా వ్యవసాయాధారిత ప్రాంతమైన నిడదవోలు నియోజకవర్గంలో ఏరువాక వేడుకలను మరింత వైభవంగా జరుపుకోవాలని రైతాంగానికి పిలుపునిచ్చారు.స్థానిక రైతాంగానికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. నాగలి పట్టి రైతన్న అడుగు ముందుకు వేస్తే ప్రకృతి పులకరిస్తుంది. అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన క్రింద రైతన్నకు



ఏటా రూ.20,000 పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నామన్నారు. ఈ ఏడాదికి సంబంధించిన తొలి విడత పెట్టుబడి సాయాన్ని ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ చేశామని గుర్తుచేశారు. అదే విధంగా రైతులు పండించిన పంటను సకాలంలో సేకరించి, కేవలం 6 గంటల నుండి గరిష్టంగా 48 గంటల వ్యవధిలోనే వారి ఖాతాల్లో నగదు జమ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు.రైతన్నకు చేదోడు వాదోడుగా నిలిచే పశువుల సంరక్షణ కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'గోకులాలు' నిర్మించామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసి, రైతులకు చెల్లించకుండా పెట్టిన ధాన్యం బకాయిలను సైతం ప్రస్తుత కూటమి ప్రభుత్వమే బాధ్యతగా చెల్లించి రైతులకు భరోసా ఇచ్చిందన్నారు. "భూమిని కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని, ఇందు కోసం రైతులు రసాయన ఎరువులు తగ్గించి 'ప్రకృతి వ్యవసాయం' వైపు మొగ్గు చూపాలని మంత్రి దుర్గేష్ కోరారు. ప్రభుత్వం అందించే సలహాలు, సూచనలు పాటిస్తూ, ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు సాధించి, సరికొత్త సాగుకు శ్రీకారం చుట్టాలని.. రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.కోట్లు సంపాదించే వాడు కూడా చివరకు తినేది అన్నమే... ఆ అన్నాన్ని ముద్దగా మార్చి మన ప్లేటు వరకు తెచ్చే ఏకైక దేవుడు మన రైతన్న. అన్నదాత సుఖీభవ అనేది కేవలం నినాదం కాదు... కూటమి ప్రభుత్వ విధానం అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

## పౌర్ణమి సందర్భంగా శివాలయాల్లో ప్రత్యేక పూజలు

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



పౌర్ణమి సందర్బంగా సోమవారం శ్రీ శోభనాచల గట్టుపై ఉన్న శ్రీ దుర్గా పార్వతీ సమేత మల్లికార్జున స్వామివారికి, బస్టాండ్ సమీపంలోని శ్రీ గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో మహాన్యాస పూర్వక ఏకవారాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలరసాభిషేకం, అలం కరణ, సహస్ర బిల్వార్చన తదితర ప్రత్యేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు దేవులపల్లి శ్రీనివాసమూర్తి తీర్థప్రసాదాలు భక్తులకు అందజేశారు. ఈ విషయాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి సి.హెచ్. సాయి తెలిపారు.

## పేదలకు కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుంది

ఆత్రేయపురం మండలానికి చెందిన 87మందికి రూ.47,73,853ల విలువైన చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

పేదలకు కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి నిలుస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురంలో సోమవారం వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో ఆత్రేయపురం మండలానికి చెందిన 87మందికి రూ.47,73,853ల విలువైన సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ, ఇన్సూరెన్స్ కవర్ కాని వారికి ఆసుపత్రి ఖర్చులో కొంతభాగాన్ని అందిస్తూ, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఉపశమనం కలిగిస్తుందని పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి కష్టకాలంలో ప్రభుత్వం తోడుగా నిలుస్తోందని తెలిపారు. మంగళవారం రావులపాలెం మండలంలో, బుధవారం ఆలమూరు మండలంలో చెక్కుల పంపిణీ జరుగుతుందని తెలియజేశారు.

# జైల్లో పరిచయం... బయటకు వచ్చాక ముఠా ఏర్పాటు

## తాళ్లపూడిలో వరుస చోరీలకు తెరదీసిన ఐదుగురు అరెస్ట్

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలంలో ఇటీవల దేవాలయాలలో హుండీ చోరీలు, ద్విచక్ర వాహనాల అపహరణ కేసులను తాళ్లపూడి ఎస్సై టి రామకృష్ణ సిబ్బందితో కలిసి ఛేదించారు. ఈ కేసుల్లో అరెస్టైన ఐదుగురు నిందితుల విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. పోలీసుల వివరాల ప్రకారం అరెస్టైన వారిలో అయినవెల్లి వినయ్ కుమార్, అయినవెల్లి అంజి ఇద్దరు అనపర్తికి గ్రామానికి చెందిన చెందిన వారు కాగా వీరిపై ఇప్పటికే మూడు కేసులు నమోదు అయ్యాయని, మరొకరు తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి చెందిన కట్టుంగి దామోదర్ ఇప్పటికే నాలుగు కేసుల అమ్మాయిని మీరుతో పాటుగా కొత్తగా పెద్దేవం గ్రామానికి చెందిన బట్టు సంతోష్, ధర్మవరం గ్రామానికి చెందిన బర్ల గౌతమ్ ఇప్పుడు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. వీరు గతంలో వేర్వేరు చోరీ కేసుల్లో జైలుకు వెళ్లి అక్కడే పరిచయం ఏర్పరుచుకున్నారు. జైలులో ఉన్న సమయంలో దొంగతనాలకు సంబంధించిన పద్ధతులు, పోలీసులకు చిక్కకుండా ఉండే మార్గాలపై చర్చించుకున్నట్లు విచారణలో వెల్లడైంది.జైలు నుంచి విడుదలైన అనంతరం ముగ్గురు కలిసి, ధర్మవరం మరియు పెద్దేవం గ్రామాలకు చెందిన మరో ఇద్దరిని కలుపుకుని ఐదుగురు సభ్యులతో ముఠాగా ఏర్పడ్డారు. అనంతరం తాళ్లపూడి మండలాన్ని లక్ష్యంగా చేసుకుని దేవాలయాల హుండీలు పగులగొట్టి నగదు దోచుకోవడం, నిర్మానుష్య ప్రాంతాల్లో పార్క్ చేసిన ద్విచక్ర వాహనాలను అపహరించడం



ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.ఈ వరుస చోరీలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన ఎస్సై కె. రామకృష్ణ సాంకేతిక ఆధారాలు, గూఢచారి సమాచారంతో నిందితులను గుర్తించి, పోలీసు సిబ్బందితో కలిసి చాకచక్యంగా అరెస్ట్ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై కె. రామకృష్ణ మాట్లాడుతూ, జైలు నుంచి విడుదలైన పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా ఎవరైనా సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, కొత్త వ్యక్తుల కదలికలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.నిందితులను రిమాండ్‌కు తరలించామని, వారి పూర్తి నేర చరిత్రపై మరింత సమాచారం సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టుతో తాళ్లపూడి మండల ప్రజలు ఊపిరి పీల్చుకున్నట్లు స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రక్కిలంక మావుళ్లమ్మ ఆలయంలో
## ఘనంగాపోతురాజు విగ్రహ ప్రతిష్ఠ




ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా పోతురాజు స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు.గ్రామానికి చెందిన కొండూరి మురళీకృష్ణ--కృష్ణవేణి దంపతులు పోతురాజు స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించగా, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఆలయంలో ప్రతి పౌర్ణమి రోజున గ్రామ ఆడపడుచులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది.మావుళ్లమ్మ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్య హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావుళ్లమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ఇటీవల పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులకు 575 మార్కులు సాధించిన గ్రామానికి చెందిన సింహాద్రి ప్రణీత గాయత్రిని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దుశ్శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ప్రతి విద్యార్థి తల్లి దండ్రుల కష్టాన్ని గుర్తించి, వారికి మంచి పేరు తీసుకొచ్చే విధంగా విద్యలో రాణించాలని ఈ సందర్భంగా వక్తలు సూచించారు.కార్యక్రమం ముగింపులో దాతల సహకారంతో పాల్గొన్న మహిళలందరికీ అమ్మవారి ప్రసాదంతో పాటు పసుపు, కుంకుమ, గాజులు, జాకెట్ ముక్కలను ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డుపై జారిన ఇసుక తొలగింపు

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



తాళ్లపూడి మండలంలోని ప్రధాన రహదారిపై ఇసుక లారీల నుంచి జారిపడిన ఇసుకను ఇసుక ర్యాంప్ యాజమాన్యం సిబ్బంది సోమవారం యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ద్విచక్ర వాహనదారులకు ప్రమాదాలు జరగకుండా ఇసు కను పూర్తిగా శుభ్రం చేశారు. రహదారిపై ఇసుక పడినట్లు సమాచారం అందగానే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని, లారీలపై టార్పాలిన్ తప్పనిసరిగా కప్పేలా చర్యలు చేపడుతున్నామని ర్యాంప్ నిర్వాహకులు కొప్పాక కోట్నీస్ తెలిపారు. ఈ చర్యను స్థానికులు, వాహనదారులు అభినందించారు.

## పోచవరంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణపై సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

మండలంలోని పోచవరం గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నంబర్లు 3, 4 పరిధిలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై సోమవారం అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ ఇంటింటి సర్వే ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి అర్హుడిని కొత్త ఓటరుగా నమోదు చేయాలని సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లను వెంటనే తొలగించాలని తెలిపారు. కొత్త ఓటు నమోదుకు ఫారం-6, తొలగింపుకు ఫారం-7, చిరునామా మార్పుకు ఫారం-8 ప్రజలకు అందజేసి పూర్తి చేయిస్తున్నట్లు చెప్పారు.
బీఎల్‌వోలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేసి 100 శాతం స్వచ్ఛమైన ఓటరు జాబితాను రూపొందించాలని ఆమె పిలుపునిచ్చారు. "ఓటు హక్కు ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు. ఒక్క అర్హుడూ జాబితాలో మిస్ కాకూడదు. అదే సమయంలో ఒక్క దొంగ ఓటు కూడా ఉండకూడదు. మీ అందరి సహకారంతో పోచవరం గ్రామాన్ని ఆదర్శంగా నిలబెట్టాలి" అని అన్నారు.ఈ సమావేశంలో మండల ఎన్నికల సూపర్‌వైజర్, బీఎల్‌వోలు, గ్రామ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటితో ముగియనున్న రాజుల కొలుపు జాతర



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం.

ప్రతి మూడు సంవత్సరాలకు ఒక్కసారి వి.ఆర్ పురం మండలం రేఖపల్లి గ్రామంలో ఆదివాసీ నాయకపోడు, కొండరెడ్లు కోయ గిరిజనులు కలిసి సంయుక్తంగా జరుపుకునే జాతర రాజుల కొలుపు జాతర నేడు జరగబోయే నిప్పులగుండంతో ముగియనుంది. ఈ నెల 20 వ తేదిన రాజుల స్వామి వారి పూజారి సారా పాండు రాజు, చిట్టమ్మ,పెద్ద సార్లమ్మా పూజారి అందెల లచ్చిరెడ్డి, కొఠారిగోమ్ము పూజారి తూట్రు పోతిరెడ్డి ప్రధాన పూజారులు, గానచరులు దేవర బాలలు రేఖపల్లి గ్రామ కుల పెద్దలు గ్రామస్థులు ఆలయ కమిటి సభ్యులు రేఖపల్లి యూత్ ఆధ్వర్యంలో ఈ జాతరను ప్రారంభించారు. 25వ తేది రాజులు స్వామి వారు పందిరిలోకి రావటం జరిగినది. 27 శనివారం నాడు తల్లులు పెద్ద సార్లమ్మలు రేఖపల్లి నల్లగుంట చెరువు ఆవరణంలోకి వచ్చి వేలాది మంది భక్తులు మధ్య తల్లులు కొడుకులను కలుసుకోవడం జరిగింది. 28, 29,తేదీ లలో మొక్కుబడులు అనగా వెండి ఆభరణాలు గొడుగులు తీర్థప్రసాదాలు చెల్లెస్తున్న భక్తులు, 29 అనగా సోమవారం ఉదయం 8 గంటలకు సరుగులు కి వెళ్లిన గ్రామస్థులు రేపు అనగా 30వ తారీఖున ఉదయం 8 గంటలకు నిప్పులగుండం తొక్కటం తో జాతర ముగుస్తుంది.

# మనసున్న మారాజు...ఉద్ధరాజు కాశీ విశ్వనాథరాజు

ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు


చరిత్రపుటల్లో కొందరు తమ పేర్లను సాధించిన విజయాలతో రాసుకుంటారు కానీ కాశీ విశ్వనాథ రాజు తను దానగుణంతో సమాజ హృదయం పై శాశ్వత సంతకం చేశారు. యాచించడం మానవ నైజం. లభించిన దాన్ని ఇంట్లో దాచుకోవడం లోకరీతి. కానీ సంపాదించిన ధనాన్ని సమాజ శ్రేయస్సు కోసం తృణ ప్రాయంగా ధారపోయడం విశ్వనాథరాజు గొప్పతనం. అడిగితే ఇచ్చేవాడు దాత కానీ అడగకుండానే ఆర్తుల ఆకలిని సమాజ అవసరాన్ని గుర్తించి కోట్లు కురిపించేవాడు అపర దానకర్ణుడు. దానికి కి నిలువెత్తు రూపమే ఈ కాశీ విశ్వనాథరాజు. రూపాయే పరమావధి గా బతికే కాలంలో రూపాయి విలువ కంటే మనుషులు ముఖాల్లోని చిరునవ్వే మిన్న అని నమ్మిన ఒకే ఒక్కడు వీరు. సంపద అనేది దాచుకోవడానికి కాదు సమాజానికి పంచి ఇవ్వడానికే అని నిరూపించిన మహోన్నత త్యాగమూర్తి. మహాభారతంలో కర్ణుడు చేసిన దానం కథల్లో విన్నాం కానీ ఈ కలియుగంలో కాశీ విశ్వనాథ రాజు దాతృత్వాన్ని కళ్ళారా చూస్తున్నాం. కీర్తి కోసం పాకులాడే లోకంలో కర్మను మాత్రమే నమ్మి, సమాజమే దైవంగా భావించిన ఉద్ధరాజు కాశీ విశ్వనాథ రాజు కేవలం ఒక వ్యక్తి కాదు ఒక తరం మెచ్చిన నిలువెత్తు ఆదర్శం. మనిషి రూపంలో నడయాడే దైవం. ఉద్ధరాజు కాశీ విశ్వనాథ రాజు చేసిన సేవలు, దానాలు అపారమైనవి. 1995 సంవత్సరంలోనే కొవ్వాడ-అన్నవరం ప్రాంతాల్లో పశువుల హాస్పిటల్ భవనం నిర్మాణానికి రూ.2 లక్షలు, స్కూల్ ఫర్నిచర్, ఫ్లోరింగ్, డైనింగ్ హాల్ కోసం మరో రూ.2 లక్షలు, 200 మందికి భోజనాలు చేసే హాల్ నిర్మాణానికి రూ.4 లక్షలు మరియు విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.
లోసరి మంచినీటి సదుపాయం, తుందుర్రు చర్చి నిర్మాణానికి సుమారు రూ.10 లక్షలు, పూసలమర్రు చెరువు ఫెన్సింగ్‌కు రూ.6 లక్షలు, గూట్లపాడు వాటర్ షెడ్‌కు రూ.1.5 లక్షలు, దొంగపిండి స్కూల్ బెంచీలకు

## ఆయన సామాజిక సేవాకార్యక్రమాలు స్ఫూర్తిదాయకం

రూ.2.5 లక్షలు సహాయం చేశారు.గొల్లవాని తిప్ప నుండి లోసరి మీదుగా దొంగపిండి వరకు కాల్వ గట్టు పక్కన 10,000 మొక్కలు నాటించడం, రోడ్ల అభివృద్ధికి రూ.15 లక్షలు, ఆ ప్రాంతం లోని లింక్ రోడ్లు మరియు ఆలయ నిర్మాణాలకు రూ.8 లక్షలు అందించారు. పాలకోడేరు మరియు కుముదవల్లి గ్రామాల్లో డంపింగ్ యార్డ్, తడి-పొడి చెత్త సేకరణ కోసం ట్రాక్టర్ ఏర్పాటు చేయడానికి రూ.21 లక్షలు ఇచ్చారు. పాలకోడేరు స్కూల్‌కు సి ఎస్ ఆర్ నిధుల నుండి రూ.5 లక్షలు, డైనింగ్ హాల్‌కు మరో రూ.5 లక్షలు అందించారు. 1999 కార్గిల్ యుద్ధం సమయంలో స్వయంగా అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి కి రూ.2 లక్షలు అందించడం దేశభక్తికి నిదర్శనం.విజయవాడ వరదలు సమయంలో ప్రజల నుండి రూ.50 లక్షలు సమీకరించి, స్వయంగా మరో రూ.50 లక్షలు జోడించి మొ



త్తం రూ.1 కోటి సహాయం చేయడం విశేషం. తిరుపతి బర్డ్ హాస్పిటల్ నిర్మాణానికి రూ.2.5 కోట్లు, తిరుమల కాటేజ్ నిర్మాణానికి 1990లో రూ.10 లక్షలు అందించారు.ద్వారకా తిరుమల నిత్య అన్నదాన కార్యక్రమ ప్రారంభ సమయంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా రూ.5 లక్షలు అందించారు.వివేకానంద యోగ యూనివర్సిటీకు రూ.25 లక్షలు, భీమవరం వీఆర్వో ఆఫీస్ సంఘానికి రూ.25 లక్షలు, నైమిశారణ్యం దేవాలయ నిర్మాణం మరియు అన్నదానానికి రూ.25 లక్షలు, ముమ్మిడివరం ప్రభుత్వ పాఠశాలకు రూ.25 లక్షలు ఇచ్చారు.2021



ఫిబ్రవరిలో అయోధ్య రామాలయం నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళంగాఅందించారు. భీమవరం పోలీస్క్వార్టర్స్రామాలయానికి రూ.35 లక్షలు, శివరావుపేట రామాలయానికి రూ.5 లక్షలు, అల్లూరి సీతారామ రాజు సాంస్కృతిక కేంద్రానికి రూ.3 లక్షలు అందించారు.భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌కు తన అన్న అయిన ధర్మరాజు గారి పేరుతో తమ ఉమ్మడి ఆస్తి నుంచి 1 ఎకరం స్థలం ఇచ్చారు. దాని విలువ ఇప్పుడు సుమారురూ.50 కోట్లు ఉండొచ్చు. అక్కడ ఇండోర్ స్టేడియం కోసం రూ.25 లక్షలు ఇచ్చారు. భీమవరం లోని కే.జి.ఆర్.ఎల్ కాలేజీ భవన నిర్మాణానికి రూ.50000 సహాయం చేశారు.ఉద్ధరాజు ఆనందరాజు ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లాలోని కాకినాడ సమీపంలోని పెద్దాపురంలో భారతీయ విద్యా భవన్ పేరుతో పాఠశాల కోసం 25 ఎకరాల స్థలంకేటాయించారు. ఆ భూమి విలువ సుమారు రూ.50 కోట్లు అని అక్కడ వారు చెబుతారు. వివేకానంద హెల్త్ మెషిన్ కీ శ్రీ కేదారనాథ్ ధామ్హాస్పిటల్రూ.10లక్షలు,13/7/2024 న ఆంధ్రప్రదేశ్ పులుల సంరక్షణ ఫౌండేషన్ కోసం రూ.5 లక్షలు, అంకాల ఆర్ట్ అకాడమీ స్కూల్ నిర్మాణానికి 24/4/2024 లో ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. ఇలాంటి దానాలు, సేవలు చూస్తే మహాభారతంలోని కర్ణుడు దాన ధర్మాలు గుర్తు కోస్తాయి అనిపిస్తుంది.ఎటువంటి స్వార్థం లేకుండా, ప్రతిఫలం ఆశించకుండా సమాజ సేవ చేయడం నిజంగా అరుదైన గుణం. అందుకే కాశీ విశ్వనాథ రాజు ని "దైవం మానుష రూపేణా" అంటే మనిషి రూపంలో ఉన్న దైవం" అని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

## కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా




ప్రజాభూమి, పుట్లూరు.

పుట్లూరు మండలంలోని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ పుట్లూరు మండల సమితి ఆధ్వర్యంలో మండలం లోని కాలనీల సమస్యలు పరిష్కరించాలనితాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ మండల కార్యదర్శి పెద్దయ్య ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మండల కార్యదర్శి డి, పెద్దయ్య మాట్లాడుతూ! పుట్లూరు మండల కేంద్రంలోని పెద్దమ్మ గుడి, రాముల గుడి, వద్ద ఉన్న సైడ్ కాల్వలో ఉన్న చెత్తను తొలగించాలని, మురికి నీరంతా సైడ్ కాలవలో నిలబడి దుర్వాసన రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ పక్కనే ఎస్సీ కాలనీకి పోవుటకు రస్తా ఉన్నందున కాలనివాసులు వచ్చి పోవుటకు చాలా ఇబ్బంది కలుగుతున్నది. కావున మురికి నీరు నిలబడ కుండ సైడ్ కాల్వలో ఉన్న చెత్తను వెంటనే తొలగించాలన్నారు. అలాగే దళిత( మాల ) కాలనీలో ఒక కుటుంబం 6 కుటుంబాలను ఇబ్బంది పెట్టడం జరుగుతున్నది. సిమెంట్ రోడ్డు పగలకొట్టి రోడ్డుకు అడ్డంగా బండలు పాతి ఇబ్బందులకు గురి చేస్తున్న అలాగే సిమెంట్ రోడ్ లో కరెంటు పోల్ నాటి ఆరు కుటుంబ వాసులను ఇబ్బంది పెడుతున్న వ్యక్తిపై చర్య తీసుకొని ఆ బండలు, కరెంటు పోల్, వెంటనే తొలగించాలని పంచాయతీ సెక్రెటరీ కిఅర్జీ రూపంలో ఇచ్చి వారం కావస్తున్న స్పందించలేదు. అలాగే తక్కల్లపల్లి ఎస్సీ కాలనీలో సైడ్ కాలువలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని అనేకసార్లు ధర్నాల రూపంలో తెలియచేసిన స్పందించలేదు. మళ్లీ వర్షాకాలం రాబోతున్నందున సైడ్ కాలువలు లేనందున ఎక్కడి నీరు అక్కడే నిలిచి నీటి కుంటవలే తయారు కాకముందే తమరు స్పందించి పై సమస్యలు పరిష్కరించాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం చేపట్టడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి బాలు, రాజు, దేవరాజు, దావీదు, రాఘవేంద్ర, నారాయణ, ఓబులేసు, ఓబుళపతి, రమేష్, కుమార్, బాబు, రాజు, రమేష్, లలితమ్మ, శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

## కమ్మ సంఘం ఆధ్వర్యంలో బాలికల వసతి గృహ ప్రారంభోత్సవ కార్యక్రమం: ఎంపీ అంబిక



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం నగరంలోని రామనగర్ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాలికల వసతి గృహ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొనడం



ఆనందంగా అనిపించిందన్నారు. జస్టిస్ చల్లా కొండయ్య చేతుల మీదుగా ఈ వసతి గృహాన్ని సోమవారం ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, హైకోర్టు జస్టిస్ కోదండరామ్, కమ్మ సంఘం అధ్యక్షులు మురుకొండ నాగన్న, కార్యవర్గ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ బాలికల వసతి గృహం జిల్లాలోని పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, పోస్ట్ గ్రాడ్యుయేషన్, వ్యవసాయ, వెటర్నరీ తదితర ఉన్నత విద్యలను అభ్యసించే విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందని నా నమ్మకం. విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇలాంటి సేవా కార్యక్రమాలను చేపట్టడం నిజంగా అభినందనీయం అని అన్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి సహకరించిన కమ్మ సంఘం ప్రతినిధులకు, ముఖ్యంగా హాస్టల్ నిర్మాణం కోసం స్థలాన్ని విరాళంగా అందించిన చల్లా రాజేంద్ర ప్రసాద్ కి నా హృదయపూర్వక అభినందనలు. విద్యకు చేయూతనిచ్చే ప్రతి ప్రయత్నం సమాజాభివృద్ధికి బలమైన పునాది అవుతుందనీ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, లవ్ కుమార్, బంధువుకు రాజా, సత్య రామ్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 1వ తేదీన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం జిల్లా పర్యటన..

**– : ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న భారత రాష్ట్రపతి: జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..**



ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

జులై 01వ తేదీన గౌరవ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అనంతపురం జిల్లా పర్యటనకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత రాష్ట్రపతి జులై 01వ తేదీన బుధవారం ఉదయం 09:30 గంటలకు కర్నాటకలోని బెంగళూరు ఆర్.హాల్ విమానాశ్రయం నుంచి బయలుదేరి హెలిక్యాప్టర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం జిల్లాలోని కేంద్ర విశ్వవిద్యాలయం యొక్క హెలిప్యాడ్ వద్దకు 10.30 గం.లకు చేరుకుంటారు. అనంతరం హెలిప్యాడ్ నుంచి బయలుదేరి ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ యూనివర్సిటీకి రాష్ట్రపతి చేరుకుని, ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. అనంతరం అనంతపురము ఆంధ్రప్రదేశ్ కేంద్ర విశ్వవిద్యాలయం హెలిప్యాడ్ నుండి 12.10 గం.లకు బయలుదేరి బెంగళూరు కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుని న్యూఢిల్లీకి వెళతారని తెలిపారు.

## సినీనటి విజయనిర్మలకు కళాకారుల ఐక్య వేదిక నివాళి

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ప్రముఖ సినీనటి విజయనిర్మలకు స్థానిక కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నివాళు లర్పించారు. విజయ్ నిర్మల ఆరవ వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షులు పూలతోట శివకుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విజయనిర్మల బాల్యం నుండి అందించిన కళాసేవను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాకారుల గోపాలకృష్ణ, ఐక్యవేదిక కళాకారులు నారాయణ, దయానంద్, రామ్మూర్తి, హోలప్ప విశ్రాంత తహసిల్దార్ శివశంకర్, కృష్ణారెడ్డి, ఉదయ్ కుమార్, గంగాధర్, ముస్తఫా, శ్రీధర్ గౌడ్, జి.బి.ఆంజనేయులు, విజయలక్ష్మి, రామలక్ష్మి రామసూజల, సంపూర్ణ, లావణ్య, ధనమ్మ ,తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఏటా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాలు నిర్వహించి, ఎద్దులతో వ్యవసాయం చేసే రైతులకు వ్యవసాయ పనిముట్లు అందించాలి

**--ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం డిమాండ్.**





ప్రజాభూమి,పుట్లూరు.

ప్రతి సంవత్సరం ప్రభుత్వం అధికారికంగా ఏరువాక కార్యక్రమాలను నిర్వహించి, ఎద్దుల ద్వారా వ్యవసాయం చేస్తున్న ప్రతి రైతు కుటుంబానికి ఉచితంగా నాగలి, గొర్రు, ఇతర వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ పరికరాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా పుట్లూరు మండలం చింతకుంట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఏరువాక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీటి రామాంజనేయులు మాట్లాడుతూ, వ్యవసాయం మన దేశానికి వెన్నెముక అని, రైతు సంక్షేమమే రాష్ట్ర అభివృద్ధికి పునాది అని అన్నారు. ఎద్దుల ద్వారా సాంప్రదాయ వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించి, వ్యవసాయ పరికరాలు, విత్తనాలు, ఎరువులు, అవసరమైన సహాయాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గౌరవ అధ్యక్షులు బుసగాని చిన్ని కృష్ణుడు యాదవ్, మండల అధ్యక్షులు ఎన్. గోపాలకృష్ణ, మండల కార్యదర్శి సత్తార్ గోపాల్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, అనంతపురం జిల్లాలో అత్యధిక మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. అయితే వరుసగా కరవు, అకాల వర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు, పెరుగుతున్న సాగు ఖర్చులు, గిట్టుబాటు ధరల లేకపోవడం వంటి సమస్యలతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే రైతులకు అన్ని పంటలకు చట్టబద్ధమైన గిట్టుబాటు ధర కల్పించాలని, పంట నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో నష్ట పరిహారం అందించాలని, కౌలు రైతులను అధికారికంగా గుర్తించి అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రైతుల ఆత్మహత్యలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, కౌలు రైతులు, గ్రామ పెద్దలు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం నాయకులు, పూలరంగడు, టి వీరయ్య, జి. ఆంజనేయులు, కే చిన్నహూషేన్, అంకె రాము, సత్తార్ రమణయ్య, రైతులు వెంకట్రాముడు, నరసింహులు, ఆది, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోలియో రహిత సమాజమే లక్ష్యం జాయింట్ కలెక్టర్

**నెహ్రూ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే**





ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

పోలియో రహిత సమాజమే లక్ష్యంగా సమాజంలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి విష్ణు పిలుపునిచ్చారు. ఆదివారం కమలానగర్ లోని రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పాల్గొని కొంతమంది చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పోలియో రహిత సమాజ నిర్మాణమే లక్ష్యమని ఇందుకోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. పిల్లలకు వేయించే ఈ రెండు చుక్కలు వారిని పోలియో బారిన పడకుండా జీవితాంతం రక్షిస్తాయన్నారు. పిల్లల ఆరోగ్యాన్ని కాపాడే ప్రతి అడుగు... ఆరోగ్యవంతమైన భారతదేశానికి బలమైన పునాది. 'పోలియో' ఆదివారం అనంతపురంలోని కోర్టు రోడ్డులో ఉన్న నెహ్రూ మునిసిపల్ కార్పొరేషన్ పాఠశాలలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, స్థానిక అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ తో కలిసి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఈ.బి. దేవితో కలిసి చిన్నారులకు చుక్కలు వేసి ప్రారంభించడం జరిగింది. 0 నుండి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ప్రతి తల్లిదండ్రుల బాధ్యత. ప్రభుత్వం రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, నివాస ప్రాంతాలతో పాటు అనేక కేంద్రాల్లో ఉచితంగా పల్స్ పోలియో చుక్కలు అందుబాటులో ఉంచింది. ఈ రెండు చుక్కలు చిన్నారులను పోలియో వంటి అంగవైకల్యానికి దూరంగా ఉంచి వారి భవిష్యత్తును సురక్షితంగా మారుస్తాయి. ఎంతటి పనులు ఉన్నా ఈరోజే మీ 5 సంవత్సరాల లోపు పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించి, వారి ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు మనమంతా తోడ్పడదాం. ఈ కార్యక్రమంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జశ్వంతరావు, ఎంహెచ్‌వో సునీత, జిల్లా ఇమ్యునైజేషన్ ఇన్‌చార్జ్ డాక్టర్ ప్రసన్న భారతి, డెమో నాగరాజు, హెచ్ఈఓ గంగాధర్, ఏఎస్ఓ ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, అధికారులు, వెంకటేశ్వర్ రెడ్డి, బంధువుకు రాజా, లవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోలు పోసి నిప్పంటించిన వ్యక్తికి పదేళ్ల జైలుశిక్ష

ప్రజాభూమి, హిందూపురం టౌన్

సిగరెట్ తాగుతున్న విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతానన్న వ్యక్తిపై పెట్రోలు పోసి నిప్పంటించిన కేసులో ముద్దాయికి 10 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ హిందూపురం అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి వి.వెంకటేశ్వరరావు సోమవారం తీర్పు చెప్పారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అమరాపురం మండలం కె.శివరంలో 2023 జూలై 11వ తేదీన మహంతేష్ అనే వ్యక్తి బస్టాండ్ సర్కిల్ లో సిగరెట్ తాగుతుండగా ఆ విషయాన్ని చూసిన కె.రంగనాథ్ సిగరెట్ తాగుతున్న విషయాన్ని తల్లిదండ్రులకు చెబుతానని పేర్కొన్నారు. దీంతో తీవ్ర ఆగ్రహావేశాలకు గురైన మహంతేష్ సమీపంలోని దుకాణంలో పెట్రోల్ కొనుగోలు చేసుకోవచ్చు రంగనాథ్ పై పోసి నిప్పంటించారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు మంటలు ఆర్పి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే రంగనాథను చికిత్స నిమిత్తం కర్ణాటక సిరా ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు సూచన మేరకు హిందూపురం ప్రభుత్వాసు పత్రిక తరలించారు. అయితే పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కుటుంబ సభ్యులు బెంగళూరు విక్టోరియా ఆసుపత్రికి తరలించారు. రంగనాథ్ అక్కడ చికిత్స పొందుతూ 2023 జూలై 17వ తేదీన మృతి చెందారు. ఈ విషయమై అప్పట్లో హతుడి అక్క రాధమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై బి.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తులో భాగంగా మహంతేష్ ను అరెస్టు చేశారు. 307 ఐపిసి సెక్షన్ కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. సంబంధిత కేసు విచారణకు రాగా పూర్వపరాలను పరిశీలించిన న్యాయమూర్తి వి.వెంకటేశ్వరరావు ముద్దాయి మహంతేష్ కు పదేళ్ల జైలుశిక్ష, రూ.10 వేల జరిమాన విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించిన పక్షంలో మరో మూడు నెలలు సాధారణ జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ఈ కేసులో 13 మంది సాక్షులను న్యాయమూర్తి విచారించారు. ప్రాసిక్యూషన్ తరపున సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనంత గోపాలకృష్ణ వాదించారు.

## విద్యాసంస్థల వాహనాల సామర్థ్యంపై తనిఖీలు నిర్వహించాలి

**-ఆర్టీఏ అధికారులకు విన్నవించిన పిడిఎస్ యూ**




ప్రజాభూమి, హిందూపురం టౌన్

విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని అన్ని పాఠశాల బస్సులపై క్రమం తప్పకుండా రవాణా శాఖ తనిఖీలు చేపట్టాలని పిడిఎస్ యూ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆర్టీవో కరుణాసాగర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బాబావలి మాట్లాడుతూ, సీటింగ్ సామర్థ్యాన్ని మించి విద్యార్థులను తరలిస్తున్న కార్పొరేట్ ప్రైవేట్ స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఓవర్‌లోడింగ్‌కు పాల్పడే విద్యాసంస్థలపై జరిమానాలు విధించి, అవసరమైతే బస్సుల అనుమతులను రద్దు చేయాలన్నారు. హిందూపురం డివిజన్ వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ల ప్రైవేట్ స్కూల్ బస్సులను పూర్తిస్థాయిలో ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలని, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలకు చెందిన అన్ని స్కూల్ బస్సులపై రవాణా శాఖ అధికారులు క్రమం తప్పకుండా ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించాలని కోరారు. బ్రేకులు, టైర్లు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, అత్యవసర ద్వారాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, సీసీ కెమెరాలు తదితర భద్రతా ప్రమాణాలు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించాలన్నారు. అలాగే స్కూల్ బస్సుల్లో సీటింగ్ సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలించడం వల్ల ప్రమాదాల సమయంలో తీవ్ర ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉంది. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఇటువంటి విద్యాసంస్థలపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న బస్సులపై జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాటి అనుమతులను సైతం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగేంద్ర, అనుదీప్, లక్ష్మీపతి, నందీష్, యుశ్వంత్, అభివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఏరువాక పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న: ఎంపీ అంబిక




ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం

అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట గ్రామంలోని సోమవారం వ్యవసాయ పరిశోధన స్థానం ఏ ఆర్ ఎస్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఏరువాక పౌర్ణమి వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ. మన రైతన్నలే దేశానికి వెన్నెముక. రైతుల సంక్షేమం, ఆర్థికాభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన లక్ష్యం. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రకృతి వ్యవసాయం, ఆరుతడి పంటలు, అంతర పంటల సాగు వంటి శాస్త్రీయ విధానాలను రైతులు అవలంబించాలని సూచించారు. ఇటీవల రైతుల ఖాతాల్లో అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు జమ చేయడం, 90 శాతం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలను అందించడం వంటి కార్యక్రమాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి అన్నారు. అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో పి ఎం డి డి కే వై పథకం కింద అనంతపురం జిల్లా దేశంలోని ఎంపికైన 100 జిల్లాల్లో చోటు దక్కడం మన రైతులకు మరింత ప్రయోజనం చేకూర్చనుంది అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా కాడి ఎద్దులకు పూజలు నిర్వహించి, సంప్రదాయ పద్ధతిలో విత్తనాలు విత్తే కార్యక్రమం లో పాల్గొన్నారు. రైతులు పండుగ స్ఫూర్తితో పాటు ఆధునిక వ్యవసాయ సాంకేతికతను కూడా అందిపుచ్చుకుని సమృద్ధిగా పంటలు పండించాలని ఆకాంక్షిస్తున్నాన్నారు. అందరికీ ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు! రైతన్న సంతోషమే రాష్ట్రాభివృద్ధికి పునాది అన్నారు. ఈ కార్యక్రమంలో బుక్కరాయ సముద్రం ఎంపీపీ దాసరి సునీత, జిల్లా ఉద్యాన శాఖ అధికారి శ్రీమతి ఉమాదేవి, నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ శ్రీమతి అనురాధ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కేశన్న, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, ఓబులపతి, పొడరాల రవీంద్ర, శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు, బహుళార్థ విస్తరణ అధికారులు, జిల్లా రైతులు, ఇతర అధికారులు వెంకటేశ్వర్ రెడ్డి, లవ్ కుమార్, బంధువుకు రాజా పాల్గొన్నారు.



## గ్రామస్థాయి నుండి పార్టీని పటిష్టం చేయడమే లక్ష్యం

**-హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు చిల్లపల్లి శ్రీనివాసరావు**



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పార్టీని గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ స్థాయి వరకు మరింత పటిష్టంగా నిర్మించి, నిబద్ధతతో పనిచేసే నాయకులకు తగిన బాధ్యతలు అప్పగించడమే జనసేన పార్టీ లక్ష్యమని హిందూపురం పార్లమెంట్ పరిశీలకులు చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా హిందూపురం పార్లమెంట్ పరిధిలో నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం సోమవారం పట్టణంలోని కె.వి.ఆర్ ఫంక్షన్ హాల్ లో జరిగింది. చిల్లపల్లి శ్రీనివాసరావు నేతృత్వంలోని 28 మంది సభ్యుల కమిటీ నాయకులు, జనసైనికుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే సామర్థ్యం, సేవా దృక్పథం, క్రమశిక్షణ కలిగిన నాయకులను గుర్తించి వారికి పార్టీ కమిటీల్లో తగిన బాధ్యతలు కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్ స్థాయిల్లో పార్టీని మరింత బలోపేతం చేసే లక్ష్యంతో దరఖాస్తులను సేకరిస్తున్నామని, వాటిని పరిశీలించి పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలనే ఉద్దేశంతో పెద్ద సంఖ్యలో నాయకులు, జనసైనికులు ఉత్సాహంగా పాల్గొని దరఖాస్తులు సమర్పించారు. జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం కీలక ఘట్టంగా నిలుస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూపురం నియోజకవర్గ ఇన్చార్జ్ ఆకుల ఉమేష్ తో పాటు మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల ఇన్చార్జిలు, ఆయా నియోజకవర్గాల నాయకులు పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్ట్ గుడిమె బాల స్వామికి “నంది”అవార్డు

## - అవార్డుల కంటే “అక్షరమే” నా ఆయుధం :గుడిమె బాలస్వామి



ప్రజాభూమి పోరుమామిళ్ల :
నిరంతరం ప్రజాసమస్యలపైగళమె త్తుతూ, సమాజంలో జరుగుతున్న అన్యాయాలను తన కలం ద్వారా ఎండగడుతున్న కడపజిల్లా'జ్యోతి' దినపత్రిక స్టాఫ్ రిపోర్టర్ గుడిమె బాలస్వామికి అరుదైన,అత్యున్నత గౌరవందక్కింది. జర్నలిజంరంగంలో ఆయన చేసిన విశేష కృషికి, నిస్వార్థసేవలకుగాను జాతీయస్థాయిలో 'ఉత్తమ జర్నలిస్ట్' విభాగం లో ఆయన ప్రతిష్టాత్మకమైన పురస్కారాన్ని జాతీయస్థాయి స్వర్ణనంది అవార్డు కైవసం చేసుకున్నారు. ఒకప్రాంతీయ పత్రికలో, అందులోనూ ఒక జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్ గా పనిచేస్తూ మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఎండి శిరీషారెడ్డి, సినీ హీరోలు,డైరెక్టర్ లు ప్రసన్న కుమార్,దన ధన్ రాజ్, శివ ప్రసాద్ చేతులమీదుగా జాతీయస్థాయి లో అవార్డును అందుకున్నారు. ఇది కడపజిల్లాతో పాటు యావత్ తెలుగు పాత్రికేయ లోకానికే గర్వకారణంగా నిలిచింది. సామాన్యుడి పక్షాన నిలిచిన కలం: జర్నలిజం వృత్తినికేవలంఒకఉద్యో గంగా కాకుండా, ఒకసామాజిక బాధ్యతగాస్వీకరించారు. బాలస్వామి. దశాబ్దాలుగా జర్న లిజం వృత్తి లో నిబద్ధతతో పనిచేస్తూ, తనకలం ద్వారా ఎంతో మందికిన్యాయం చేకూర్చారు. కడపజిల్లాలోనిశ్రీ అవధూత కాశినాయన మండలం అమగంపల్లె అనే మారుమూలపల్లెలో పుట్టి పెరిగిజిల్లాస్టాఫ్ రిపో ర్టర్ వరకుఎదిగారు. ప్రతిసమస్యను వెలుగులోకి తీసుకురావడంలో ముందు వరుసలోనిలుస్తారు. కేవలం వార్తలు రాయడమే కాకుండా, ఆ వార్త వెనుక ఉన్న వాస్తవాలను, సామాన్యుడి ఆవేదనను అధికారు ల దృష్టికి తీసుకెళ్లడంలో ఆయ న శైలి అద్వితీయ అవార్డులకంటే అక్షరమే నా ఆయుధం-గుడిమెబాలస్వామి జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు: సాధారణంగా జాతీయ స్థాయిపురస్కారాలు మెట్రో నగరాలకు చెంది న ఆంగ్ల లేదా జాతీయ మీడియా ప్రతినిధులకు దక్కుతుంటాయి అన్న అపోహను గుడిమె బాలస్వా మి పటాపంచలు చేశారు. గ్రామీణజర్నలిజంలో ఉన్నశక్తిని, వాస్తవాలను నిర్భయంగాచెప్పే తెగువను జాతీయ స్థాయి జ్యూరీ సభ్యులుప్రత్యేకంగాగుర్తించారు.సమాజంలో అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసంఆయనచేసినరిపోర్టింగ్,తీసు కువచ్చిన సామాజిక మార్పును ప్రశంసిస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమజర్నలిస్ట్- నందిఅవార్డు”ను ప్రకటించారు. బాలస్వామికి జాతీయ అవార్డు రావడం పట్లఉమ్మడి కడపజిల్లా వ్యాప్తంగా హర్షాతిరేకాలువ్యక్తమవుతున్నాయి. కడప జిల్లాజిల్లాకు చెందిన ప్రజాప్రతినిధు లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆయనకు ఫోన్ చేసి ప్రత్యేకంగాశుభా కాంక్షలు తెలియ జేశారు ఎన్నో ఏళ్లుగా ప్రజా పక్షం వహించిన రిపోర్టర్కు తగిన గుర్తింపు లభించిందని రైతు సంఘాలు, విద్యార్థి సంఘాల నేత లు హర్షం వ్యక్తం చేశారు. తోటి పాత్రికేయ మిత్రులు, కడప ప్రెస్ క్లబ్ సభ్యులు ఈ అవార్డు తమ అందరికీ దక్కిన గౌరవంగా భావిస్తూ ఆనందంవ్యక్తం చేశారు.

# జల్ జీవన్ మిషన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

## - ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

## - బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్



ప్రజాభూమి, వేంపల్లె
ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గాలి హరిప్రసాద్ కోరారు. సోమవారం స్థానిక పట్టణంలో గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంలో రూ.480 కోట్ల వ్యయంతో 600 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా గ్రామీణ ప్రజలకు ఇంటి వద్దకే స్వచ్ఛమైన తాగునీరు అందుతూ జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని అన్నారు. గతంలో తాగునీటి కోసం మహిళలు, చిన్నారులు ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం పైపుల ద్వారా ఇంటి ముంగిటకే నీరు అందే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ప్రతి అర్హత కుటుంబానికి తాగునీటి కనెక్షన్ అందేలా పనులను వేగంగా, నాణ్యతతో పూర్తి చేయాలని కోరారు. గ్రామీణ ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రత, అభివృద్ధికి జల్ జీవన్ మిషన్ కీలకమైన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్పలత నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబోయిన రవి యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకులు ముద్ది శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సహకార వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

## -సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథ నాయుడు పిలుపు



ప్రజాభూమి, సిద్ధవటం: ప్రత్యేక సహకార వారోత్సవాలను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సింగిల్ విండో అధ్యక్షుడు దారపునేని దశరథ నాయుడు కోరారు. సిద్ధవటం కో-ఆపరేటివ్ సహకార బ్యాంకులో సోమవారం నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వారం రోజుల పాటు జరిగే సహకార వారోత్సవాల్లో భాగంగా మొక్కలు నాటడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన వైద్య శిబిరాలు, ఆర్థిక విజ్ఞానం, సుస్థిర సహజ అభివృద్ధి, సభ్యులకు సాంకేతిక శిక్షణ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్లాస్టిక్ నిర్మూలన, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తామని పేర్కొన్నారు. అనంతరం కో-ఆపరేటివ్ బ్యాంకు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ బాలిరెడ్డి, ఎస్బీఎల్ సీఓ శ్రీధర్, సీనియర్ ఇన్స్పెక్టర్ అమీర్ సాహెబ్, సీఓ సుకూర్ భాష, రైతులు పాల్గొన్నారు.

# దొంగతనం కేసులో ఏడాది జైలు శిక్ష



ప్రజాభూమి,పులివెందుల
దొంగతనం కేసులో ఒక వ్యక్తికి ఏడాది పాటు జైలు శిక్ష వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ సోమవారం జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ చంద్రశేఖర్ రెడ్డి తీర్పునిచ్చారు. గత సంవత్సరం జూన్ 8న సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరు గ్రామంలో ఏనుగుల రామ లక్షుమ్మ ఇంటి తాళం పగలకొట్టి 4 తులాల బంగారు, గొలుసు రెండు తులాల కమ్మలు దొంగలించారని అప్పట్లో రామలక్ష్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పులివెందుల మండలం ఈ కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్లపు దివాకర్ అనే వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి మూడు లక్షల రూపాయలు స్వాధీనం చేసుకొని కోర్టు ముందు హాజరు పరిచారు. విచారణలో నేరం రుజువు కావడంతో సోమవారం న్యాయమూర్తి చంద్రశేఖర్ రెడ్డి ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడిం చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ తరపున సమర్థ వంతంగా వాదనలు వినిపించిన అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మధుసూదన ఆచారి, ప్రస్తుత సింహాద్రిపురం ఎస్ఐ డాక్టర్ నాయక్ , అలాగే కేసును పర్యవేక్షించిన పులివెందుల రూరల్ సీఐ శాంతి లాల్,సాక్షులను కోర్టులో సకాలంలో హాజరు పరిచి ముద్దాయికి శిక్ష పడేందుకు కృషి చేసిన కోర్టు కానిస్టేబుల్ కిషోర్ బాబు లను కడప జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అభినందించారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలి



ప్రజాభూమి ప్రతినిధి,విజయవాడ:
విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం సాయంత్రం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతిపై ఏఈఆర్వోలు, బీఎల్వోలతో ఏకేటిపి స్కూల్ సత్యనారాయణపురం లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్లో భాగంగా అర్హులైన ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా అదే స్థాయిలో వేగవంతం చేయాలని సూచించారు. విజయవాడ నగర పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన ఏఈఆర్వోలు, బీఎల్వోలు ఒకే కేంద్రంలో సమన్వయంతో డిజిటలైజేషన్ చేపట్టడం ద్వారా పనుల వేగం మరింత పెరుగుతుందని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలు, సందేహాలను అధికారులు పరస్పరం చర్చించుకుని వెంటనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విధానం ద్వారా పనుల్లో ఏకరూపతతో పాటు వేగం కూడా పెరుగుతుందన్నారు. అదేవిధంగా ఎన్నికల విధులకు సంబంధించిన అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిజిటలైజేషన్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఏదైనా సందేహం తలెత్తిన వెంటనే ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవడం ద్వారా డిజిటలైజేషన్ను నిర్ణీత గడువులోగా పూర్తి చేయవచ్చని కమిషనర్ ధ్యానచంద్ర పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ శకుంతల, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, ఏ ఈ ఆర్ వో రాంబాబు, ఎలక్షన్ డిటి యస్. సురేష్ కుమార్, బిఎల్వోలు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ

## - రైతన్న చిరునవ్వే తమ లక్ష్యం

## - టిడిపి మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె
మండలంలోని బక్కన్నగారిపల్లె, కత్తులూరు గ్రామాలలో జాతీయ ఆహార నూనె గింజల మిషన్ (ఎన్ఎంఈఓ-ఓఎన్) పథకం ఆధ్వర్యంలో రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి మండల పరిశీలకులు రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయ పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతన్న చిరునవ్వే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, టిడిపి మండల కన్వీనర్ రామముని రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు పసుపులేటి వీరభద్ర పట్టణ అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు నామా వేమకుమార్, టౌన్ క్లస్టర్ ఇంచార్జ్ మహమ్మద్, సుధాకర్ రెడ్డి, జబిబుల్లా, రాజా నాయక్, గణేష్ నాయక్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# భవన నిర్మాణం కొరకు విరాళాలు అందజేత



ప్రజాభూమి,పులివెందుల
స్నేహిత అమృత హస్తం సేవాసమితి నూతన భవన నిర్మాణం కోసం పలువురు దాతలు తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వేముల ఏఎస్ఐ చంద్రశేఖర్ రావు (స్వామి) కుమార్తె, అల్లుడు సుజనా- దీక్షిత్ దంపతులు రూ.10,000 లు , పెద్ద జూటూరు గ్రామానికి చెందిన ఉపాధ్యా యులు వేణుగోపాల్ రెడ్డి రూ.10,000లు, సిరి ఫిజియో థెరపీ డాక్టర్ రమణారెడ్డి 10 వేలు,వార్డు మాజీ కౌన్సిలర్ భార్గవి రెడ్డి రూ.5,000లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు నిర్మాణంలో ఉన్న సేవాసమితి భవనాన్ని సందర్శించి తమ విరాళాలను అందించారు. ఈ సందర్భంగా సేవాసమితి అధ్యక్షులు మొమ్మెల రాజు మాట్లాడుతూ, భవన నిర్మాణ పనులకు సహకరిస్తున్న ప్రతి దాతకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవా కార్యక్రమాల నిర్వహణకు ఈ భవనం ఎంతో ఉపయోగపడు తుందని పేర్కొన్నారు. దాతల సహకారంతో భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, మరిన్ని సేవాభావం కలిగిన దాతలు ముందుకు వచ్చి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విరాళాలు అందజేసిన దాతలకు సేవాసమితి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్ర మం లో సేవాసమితి సభ్యులు శ్రీ రాజా కళా నిలయం మాస్టర్ రాజా, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జీవిరెడ్డిని కలిసిన టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి



ప్రజాభూమి, వేంపల్లె
ఏపీ మాజీ ఫైబర్ నెట్ చైర్మన్, ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, సీనియర్ న్యాయవాది జీవిరెడ్డిని టీఎన్ఎస్ఎఫ్ కడప జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి సోమవారం హైదరాబాద్లోని ఆయన ఛాంబర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సామాజిక, రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించారు. అలాగే భవిష్యత్ రాజకీయ ప్రస్థానం, యువత పాత్ర వంటి పలు అంశాలపై అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం చర్చిస్తూ ముందుకు సాగాలని ఈ సందర్భంగా ప్రస్తావించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆవుగుట్ట ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం

## హోమాలు నిర్వహించిన వేద పండితులు

## భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం



ప్రజాభూమి,పులివెందుల
పులివెందుల మండలం పరిధిలోని నల్లగొండ వారి పల్లె గ్రామ సమీపంలో నూతనముగా నిర్మించిన ఆవుగుట్ట ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని సోమవారం గ్రామ ప్రజలు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ ఆవుగుట్ట ఆంజనేయ స్వామి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి అహోబిలం పీఠాధిపతి రమేష్ స్వామి, గండి ఆంజనేయ స్వామి అర్చకులు రాజా స్వామి ఆవుగుట్ట ఆంజనేయస్వామిని ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామిని దర్శించుకుని కాయ కర్పూరం సమర్పించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. వేద పండితులు హోమాలు నిర్వహించి నిర్వహణ చే హోమ పూజా కార్యక్రమాలు చేయించారు. అనంతరంమధ్యాహ్నం 12 గంటల నుండి అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు విరివిగా పాల్గొన్నారు. భక్తులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన షెడ్లలో తాళాల భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.



# సిద్ధవటం ప్రభుత్వ ఆసుపత్రికి గైనకాలజిస్ట్ నియామకానికి విజ్ఞప్తి



ప్రజాభూమి, సిద్ధవటం: ఆంధ్రప్రదేశ్ బీజేపీ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న “జనతా వారధి” కార్యక్రమంలో భాగంగా సోమవారం కడప జిల్లా కలెక్టరేట్లో నిర్వహించిన గ్రీవెన్స్ సెల్లో సిద్ధవటం మండలానికి చెందిన బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధవటం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వ ఆసుపత్రి)లో ఖాళీగా ఉన్న గైనకాలజిస్ట్ పోస్టును భర్తీ చేయాలని జిల్లా కలెక్టర్ను కోరారు. సిద్ధవటం, అట్లూరు, ఒంటిమిట్ట మండలాల పరిధిలోని పీహెచ్సీల నుంచి గర్భిణీలు స్కానింగ్, ప్రసవాల కోసం ఈ ఆసుపత్రికి వస్తున్నప్పటికీ గైనకాలజిస్ట్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కలెక్టర్కు వివరించారు. స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు సమస్యను తెలియజేయగా, త్వరలోనే గైనకాలజిస్ట్ను నియమిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు శ్రీమతి పద్మావతి, కడప జిల్లా జనతా వారధి కన్వీనర్ జీ.ఎస్టీ లక్ష్మణరావు, సిద్ధవటం మండల బీజేపీ సీనియర్ నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి కాకర్ల భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈత సరదా యువకుడు ప్రాణం తీసింది

## - శోకసంద్రంలో కుటుంబం



ప్రజాభూమి, సిద్ధవటం: సరదాగా ఈతకు వెళ్లిన ఓ యువకుడు పెన్నా నదిలో మృతి చెందిన ఘటన సిద్ధవటం మండలం లింగంపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. కడప నగరం నుంచి వచ్చిన గంగాధర్, మహేంద్ర, సోమశేఖర్, వెంకటేష్, నాగేంద్ర బాబు, వెంకటసుబ్బయ్య, జగదీష్ అనే యువకులు ఆదివారం పెన్నా నది తీరానికి వెళ్లి ఈత కొడుతుండగా వారిలో గుంటూరు జిల్లా చెరువుపల్లె గ్రామానికి చెందిన జగదీష్ (26) ఊబిలో చిక్కుకుని నీటిలో కొట్టుకుపోయాడు. స్నేహితులు గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం జగదీష్ మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్కు తరలించారు. మృతుడు గత ఏడాది నుంచి కడప నగరంలోని భాగ్యనగర్ కాలనీలో ఓలో ఎలక్ట్రిక్ బైక్ షోరూమ్లో మెకానిక్గా పనిచేస్తున్నాడు. కుమారుడు మృతి చెందిన విషయం తెలుసుకున్న తండ్రి గోపి కన్నీరుమున్నీరయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఫోన్ చేసినా స్పందించకపోవడంతో, తిరిగి సాయంత్రం ఫోన్ చేయగా తన కుమారుడు పెన్నా నదిలో కొట్టుకుపోయినట్లు ఇతర యువకులు సమాచారం ఇచ్చారని తెలిపారు. ఈ ఘటనపై మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిద్ధవటం ఎస్సై హారిక తెలిపారు. పోలీసులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు.

# 30 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

## కొండమాచుపల్లి ఎస్ఎన్వైఎస్ పాఠశాలలో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం.. - గురువులకు ఘన సన్మానం



ప్రజాభూమి, ఒంటిమిట్ట: మండలంలోని కొండమాచుపల్లి గ్రామంలో ఎస్ఎన్వైఎస్ ఉన్నత పాఠశాలలో 1996--97 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు 30 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చిన్ననాటి స్నేహాలు, పాఠశాల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందంగా గడిపారు. ప్రార్థనా గీతంతో ప్రారంభమైన కార్యక్రమంలో తమకు విద్యాబోధన చేసిన పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. జీవితాన్ని తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకున్న విలువలు, క్రమశిక్షణ జీవితాంతం ఉపయోగపడతాయని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ జీవిత అనుభవాలను పంచుకుంటూ స్నేహబంధాలను మరింత బలోపేతం చేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి చేయూత పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పూర్వ విద్యార్థులు నిర్ణయించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు, విద్యా ప్రోత్సాహక కార్యక్రమాలకు సహాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. చివరగా జ్ఞాపికలు అందించుకుని ఫొటోలు తీసుకుంటూ మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకున్నారు.

# బాసట చిల్డ్రన్ హోమ్ లో రేవంత్ జన్మదిన వేడుకలు..

## విద్యార్థులకు అల్పాహారం, అన్నదానం



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలోని మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థకు చెందిన సభ్యుడు పాలూరు మల్లికార్జున తనయుడు రేవంత్ కుమార్ జన్మ దినం సందర్భంగా సంస్థ ఆధ్వర్యం లో కడప శంకరాపురంలోని బాసట చిల్డ్రన్ హోమ్ లోని పిల్లలకు ఉదయం అల్పాహారం రాత్రివేళ భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మనఊరికోసం స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ పాలూరు రేవంత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యుల సహకారంతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రేవంత్ ఇలాంటివి మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకుంటూ సమాజ సేవలో ముందుండాలని ఆకాంక్షించారు. మనఊరికోసం స్వచ్ఛంద సేవా సంస్థ తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# బద్వేల్ నియోజకవర్గం రైతాంగానికి ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్పర్సన్ నారిశెట్టి సుప్రజ




ప్రజాభూమి పోరుమామిళ్ల :
తొలకరి జల్లులతో భూమాత పరవశించి, రైతు ఆశలకు కొత్త ఊపిరి పోసే పవిత్ర పర్వదినవే ఏరువాక పౌర్ణమి. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ఈ శుభదినాన నాగలికి పూజలు చేసి, భూమాతను ఆరాధిస్తూ కొత్త వ్యవసాయ పనులకు శ్రీకారం చుడతారు. అన్నదాత చెమట చుక్కలే దేశ సౌభాగ్యానికి, ఆర్థిక ప్రగతికి నిజమైన పునాది. ఈ ఏరువాక పౌర్ణమి సందర్భంగా రైతు సోదరులందరికీ పండుగ శుభాకాంక్షలు. ప్రతి పొలం పచ్చని పంటలతో కళకళలాడాలని, ప్రతి రైతు కుటుంబం ఆనందం, ఐశ్వర్యం, సిరిసంపదలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. భూమాతకు నమస్కారంఅన్నదాతకు అభివందనం. ఏరువాక పౌర్ణమి శుభాకాంక్షలు

## సమాచార పౌర సంబంధాల శాఖ పనిచేస్తుందా ?

ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
ముఖ్యమంత్రి పర్యటనపై కూడా ఎటువంటి సమాచారం లేకుండా నిమ్మకు నీరుతున్నట్లు నెల్లూరు జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ వ్యవహరిస్తోంది. మూడు రోజుల నుండి జిల్లా పర్యటనపై జాయింట్ కలెక్టర్ ఎమ్మెల్యేలు పర్యటనలు చేస్తూ హెలిపాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆ సమాచారాన్ని స్థానిక పాత్రికేయులకు సమాచార శాఖ అధికారులు అందించకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి అలాగే ఆదివారం నాడు జరిగిన పల్స్ పోలియో గురించి కూడా ఎటువంటి ముందస్తు సమాచారాన్ని కూడా ఆ శాఖ అధికారులు ఇక్కడ పాత్రికేయులు అందించకపోవడంతో వారే ఆ సమాచారం సేకరించుకోవాల్సి వచ్చింది అలాగే జూలై 1న గూడూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటించనున్న నేపథ్యంలో మూడు రోజుల నుండి హడావిడి కనిపిస్తున్నప్పటికీ ఆ శాఖ అధికారులు మాత్రం ఎటువంటి సమాచారాన్ని ప్రజలకు గాని పాత్రికేయులు గాని అందించకపోవడం వారి పనితీరుకు అర్థం పడుతుందని చెప్పవచ్చు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని స్థానిక పాత్రికేయులు అందించి ప్రజలకు చేరవేసే విధంగా చూడాల్సిన సమాచారం పౌర సంబంధాల శాఖ నెల్లూరు జిల్లా అధికారులు అసలు పట్టించుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకొని ముఖ్యమంత్రి పర్యటన వివరాలను అలాగే పాత్రికేయుల అవసరమైన పాసులను అందించేందుకు చేసిన ఏర్పాట్లను తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను వారు కోరుతున్నారు. కలెక్టర్ జెసి ఆర్డిఓ పర్యటనలు గాని ఏ విషయాన్నీ కూడా పత్రికల వారికి సమాచారం అందించకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యమైన అధికారులు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారుల పర్యటనల గురించి ఎప్పటికప్పుడు ముందస్తు సమాచారం ఇవ్వడంలో ఆ శాఖ ఉదాసీను వైఖరి పట్ల గూడూరు లోని స్థానిక పాత్రికేయులు నిరసన వ్యక్తం చేశారు.

## మోహినీ అవతారంలో పల్లకిపై దివ్య విహారం
## భక్తులను అనుగ్రహించిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి



ప్రజా భూమి ప్రతినిధి, వడమాలపేట
తిరుమల తిరుపతి దేవస్థానం అనుబంధ ఆలయమైనఅప్పలాయగుంటలో వైభవంగా జరుగుతున్న శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామివారు మోహినీ అవతారంలో పల్లకిపై విహరిస్తూ భక్తులకు దివ్య మంగళ దర్శనం ప్రసాదించారు. స్వామివారి మనోహర రూపాన్ని దర్శించిన భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.
గోవింద నామస్మరణతో మారుమోగిన మాడవీధులు : ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పల్లకీ వాహనసేవలో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ, గోవింద నామస్మరణల మధ్య స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, అర్చకులు, శ్రీవారి సేవకులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం కలెక్టరేట్లో, (పి జి,ఆర్,ఎస్)నిర్వహణ కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి రేణిగుంట.
సోమవారం కలెక్టరేట్ లోని పి జి ఆర్ ఎస్ హాల్ నందు నిర్వహించిన ప్రజా సమస్యల పరిస్కార వేదిక ( పి జి,ఆర్,ఎస్) కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారులు నుంచి అర్జీలను, స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్లు రోస్మండ్, శంకర్ నాయక్, భరత్ నాయక్ , డి ఆర్ ఓ నరసింహులు..

## రాములవారి మందిర కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న తలపా దామోదరం రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి:
శ్రీకాళహస్తి రూరల్
మండలంలోని, జగ్గరాజు పల్లి పంచాయతీ, జగ్గరాజుపల్లి గ్రామం నందు నూతనంగా నిర్మింపబడిన రాములు వారి మందిర కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న శ్రీకాళహస్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త తలపా దామోదరం రెడ్డి. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్ర రెడ్డి, శ్రీకాళహస్తి మండల యువజన అధ్యక్షులుయానాది నవీన్ కుమార్, శ్రీకాళహస్తి పట్టణ యువజన అధ్యక్షులు ఆంటోనీ, శశి,సురేష్,మహేష్, లక్ష్మయ్య, మాస్,అరుణ్, గ్రామ పెద్దలు,ప్రజలు పాల్గొన్నారు.

## రాష్ట్రముఖ్యమంత్రి పాల్గొనున్న, సభ వేదిక ఏర్పాట్లను, పర్యవేక్షిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధులు కోడూరు.
జూలై 02 న రైల్వే కోడూరు నియోజకవర్గం ఓబుల వారిపల్లె ముక్కావారి పల్లి సమీపంలో ముఖ్యమంత్రి ,నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ , మరియు కేంద్ర మంత్రులు పాల్గొననున్న సభావేదిక ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి కార్యక్రమాల కో .ఆర్డినేటర్ శ్రీ పెందుర్తి వెంకటేష్ (రైల్వే కోడూరు) శాసనసభ సభ్యుడు అరవ శ్రీధర్ జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ , ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, తదితరులు పాల్గొన్నారు.



## జడ్పిటిసిగా అందరి మన్ననలతో పాలన సాగించిన యామిని రెడ్డి

### -వైసీపీ నాయకుల సమక్షంలో ఘనంగా యామిని రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,
రాజకీయ అనుభవం లేకుండా విద్యావంతురాలు గృహిణిగా ఉన్న ఊటుకూరు యామిని రెడ్డి తన భర్త వైయస్ జగనన్న సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఊటుకూరు మహేంద్ర రెడ్డి చొరవతో రాజకీయాల్లో ప్రవేశించి గూడూరు జడ్పిటిసిగా గెలుపొందిన యామిని రెడ్డి అందరి నాయకుల పాలన సాగించారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గూడూరు నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి మేరీగ మురళీధర్ కొనియాడారు. గూడూరు జడ్పిటిసి గా పదవీకాలం మూడు నెలల్లో పూర్తికానున్న సందర్భంలో ఎంపీటీసీ లకు సర్పంచులకు ,నాయకులకు, ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం, అదే విధంగా యామిని రెడ్డి జన్మదిన వేడుకలను గూడూరులోని వనజాకృష్ణ కళ్యాణ మండపంలో వైసీపీ నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీతో పాటు సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, నియోజకవర్గ వైసిపి సీనియర్ నాయకులు చేవూరు. విజయమోహన్ రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మెట్ట రాధాకృష్ణారెడ్డి,పట్టణ, దూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి నాశిన నాగులు, మహిళా నేతలు తదిత రులు పాల్గొని మాట్లాడుతూ గూడూరు జడ్పిటిసిగా వైసీపీ నుండి ఎన్నికై న రెండు సంవత్సరాలకే వైసీపీ ప్రభుత్వం మారినా కూడా అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు లొంగకుండా అభివృద్ధి, సంక్షేమం అనే లక్ష్యంగా నిధులు మంజూరు చేస్తూ ముందుకు వెళ్లారని అతని ఆడారు. జిల్లాలోని అందరి నాయకు మన్ననలతో జడ్పిటిసి గా తన వంతు కృషి చేసిందని తెలిపారు. మరో మూడు నెలల్లో పదవి ముగుస్తుందని, తరువాత కూడా ప్రజల్లో ఉండే అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ పటిష్టతకు, ప్రజా సంక్షేమానికి కృషి చేయ నున్నట్లు తెలిపారు. అనంతరం వైసీపీ నాయకులు సమక్షంలో యామిని రెడ్డి,మహేంద్ర రెడ్డిలు జన్మదిన భారీ కేకు కట్ చేశాడు. అనంతరం నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు సర్పంచ్ లు యామినిరెడ్డితో పాటు వైఎస్సా కృషీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, జగనన్న సేవా సమితి వ్యవస్థానక అధ్యక్షుడు ఊటుగూరు మహేం. ద్రరెడ్డిలను సత్కరించి పుష్పగుచ్చాలు అందజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో నాగిశెట్టి శారద, మాజీ కౌన్సిలర్ ఇమళ్ల సుకన్య, మాజీ సర్పంచ్ లు వెంకటమ్మ, శీనయ్య, రాజేష్, గోపాల్, నన్ను రాజశేఖర్, సుబ్బానాయుడు, పలువురు నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

### నాడు నారా లోకేష్ హామీ- జేసీఐ సహకారంతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో
## ఆధునిక ఇండోర్ బాక్సింగ్ హాల్ ఏర్పాటు

### -నేడు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన శాప్ చైర్మన్ రవి నాయుడు



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు తిరుపతిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి బాక్సింగ్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో భాగంగా, జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) తిరుపతి వారి ఆర్థిక సహకారంతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధునిక ఇండోర్ బాక్సింగ్ హాల్‌ను సోమవారం అధికారికంగా క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో శాప్ చైర్మన్ రవి నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం ఇండోర్ బాక్సింగ్ హాల్‌ను పరిశీలించి, అక్కడ అందుబాటులో ఉన్న శిక్షణ సదుపాయాలు, రింగ్ ఏర్పాటు, ట్రైనింగ్ ఏరియా, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను సమీక్షించారు. ఈ సందర్భంగా శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, తిరుపతి ప్రాంత యువతలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఇండోర్ బాక్సింగ్ హాల్ ఏర్పాటు కావడం ద్వారా వర్షాకాలం, ఎండాకాలం వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా క్రీడాకారులు సంవత్సరం పొడవునా నిరంతర శిక్షణ పొందే అవకాశం కలుగుతుందని చెప్పారు. అలాగే, ఈ సదుపాయం కేవలం శిక్షణ కేంద్రంగా మాత్రమే కాకుండా, రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి క్రీడాకారులను తీర్చిదిద్దే కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక శిక్షణ సదుపాయాలు, నైపుణ్య కోచ్‌ల మార్గదర్శకత్వం ద్వారా తిరుపతి ప్రాంత యువ బాక్సర్లు మరింత ప్రతిభను చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ తిరుపతి ప్రతినిధులు డాక్టర్ ఎన్.బి. హర్షవర్ధన్ రెడ్డి, హర్ష సాయి, టీవై చైతన్య తేజ, వీ దిలీప్ కుమార్, ఎన్ దిలీప్ రెడ్డి, శంకర్, ముని లక్ష్మీ, గౌతమ్, శాప్ బోర్డు సభ్యురాలు రజిని, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ తోటా వాసు, తిరుపతి జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి శశిధర్, బాక్సింగ్ కోచ్‌లు, క్రీడాకారులు, క్రీడా సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు తిరుపతికి సిపిఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు




ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
సిపిఐ(ఎం) పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బీవీ రాఘవులు మంగళవారం (జూన్ 30) తిరుపతికి రానున్నారని సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సిపిఎం సీనియర్ నాయకులు దివంగత కామ్రేడ్ అవనిగడ్డ వీర వర్మ 84వ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తారని పేర్కొన్నారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10.00 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సులో "నేటి భారతం ఎదుర్కొంటున్న సవాళ్లు" అనే సమకాలీన అంశంపై బీవీ రాఘవులు ప్రధానోపన్యాసం చేయనున్నారని తెలిపారు. ప్రస్తుత దేశ రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితుల నేపథ్యంలో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు మేధావులు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజాస్వామ్యవాదులు, యువజనులు, విద్యార్థులు, కార్మికులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వందవాసి నాగరాజు విజ్ఞప్తి చేశారు.

## ఆర్సీపురంలో పల్స్ పోలియో విజయవంతం
### - ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ చినబాబు



ప్రజా భూమి ప్రతినిధి, రామచంద్రాపురం.
పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రభుత్వాలు చేపట్టిన పల్స్ పోలియో కార్యక్రమం ఆర్సీపురంలో విజయవంతంగా జరిగిందని రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ డైరెక్టర్ ఎం చిన్నబాబు తెలిపారు. ఆదివారం రావిళ్లవారిపల్లెలో ఎంపీడీవో పులిరాం సింగ్, కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని ఆయన. ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 0-5 పిల్లలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా రెండు పోలియో చుక్కలు వేయించాలని కోరారు. మండలంలో 42 పల్స్ పోలియో కేంద్రాలలో వైద్య ఆరోగ్య సిబ్బంది ద్వారా 99% పిల్లలకు పోలియో చుక్కలు వేసామని ఎంపీడీవో పులిరాం సింగ్ తెలిపారు. కమ్మపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 1993 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసి 100 శాతం విజయవంతం చేశామని వైద్యాధికారి డాక్టర్ జావిద్ తెలిపారు. కుప్పం బాదూరు పీహెచ్సీ పరిధిలో 2305 మంది పిల్లలకు గాను 2229 పిల్లలకు పోలియో చుక్కలు వేసి 98 శాతం పూర్తి అయిందని వైద్యాధికారిణి పూర్ణిమ తెలిపారు. పోలియో చుక్కలు వేయించుకోని వారికి రెండవ రోజు ఇంటింటా కార్యక్రమం లో పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో, నీలకంఠ చౌదరి, మునిరత్నం నాయుడు, పాలడుగు చంద్ర, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాతమ్మ జాతరలో అమ్మవారిని దర్శించుకున్న రామిరెడ్డి ధ్వజా రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి
చిట్వేలు
చిట్వేలు మండలం సీఎం రాజుపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీశ్రీ మాతమ్మ జాతర సందర్భంగా గ్రామస్తుల ఆహ్వానం మేరకు స్టేట్ ఎగ్జిక్యూటివ్ సెల్ సభ్యుడు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజా రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిట్వేలు సీనియర్ నాయకుడు ప్రదీప్ రెడ్డితో పాటు పోలి వెంకట శివ, పోలి దినేష్, పోలి వంశీ, పోలి జగదీష్, మైదుకూరు శ్రీహరి, మైదుకూరు నవీన్, రెడ్డిపాకు కుమార్, రెడ్డిపాకు రాజేంద్ర, మన్నూరు వేణు, పోలీసు సుమంత్, తాళ్లపాక శివకుమార్ పాల్గొన్నారు.అలాగే సీనియర్ నాయకులు కొరెడ్డి సిద్దయ్య, హరికృష్ణ రెడ్డి, ఆర్.వి. రమణ, చంద్రశేఖర్, గోపి, మహేష్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, కృష్ణారెడ్డి, ప్రతాప్ రెడ్డి, రమణా రెడ్డి, కోటి, సారమానంపాడు బత్తల సుబ్రహ్మణ్యం, అనంతరాజంపేట మనీ, హరి, ప్రసాద్, లక్ష్మీపతి, కంభం శ్రీనివాసులు రెడ్డి, బైరెడ్డి అనిల్ రెడ్డి, నాగరాజు, శ్రీనాథ్, సాయి, మహమ్మద్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జాతర వేడుకలను విజయవంతం చేశారు.

## పోలియో కేంద్రాన్ని సందర్శించిన తహసీల్దార్, లక్ష్మీనారాయణ
### టీడీపీ మండల అధ్యక్షుడు, చెంచు రామానాయుడు



ప్రజాభూమి ప్రతినిధి బుచ్చినాయుడు కండ్రిగ
తిరుపతి జిల్లా బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో మొత్తం 3,791 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాల్సి ఉండగా, తొలి రోజు 3,641 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. మిగిలిన చిన్నారులకు సోమవారం, మంగళవారం రోజుల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు తీసుకోకుండా మిగలకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బి.ఎన్. కండ్రిగ మండల కేంద్రంలోని పోలియో చుక్కల కేంద్రాన్ని తహసీల్దార్ లక్ష్మీనారాయణ సందర్శించి కార్యక్రమం నిర్వహణను పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్య రక్షణ కోసం చేపడుతున్న చర్యలను అభినందించి, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందేలా అధికారులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెంచు రామానాయుడు పోలియో కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేశారు. పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఆయన కోరారు. మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు కూడా కార్యక్రమంలో పాల్గొని చిన్నారులకు స్వయంగా పోలియో చుక్కలు వేసి ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు వెట్టి గజేంద్రయ్య దంపతులకు ఘన సత్కారం

ప్రజా భూమి ప్రతినిధి కే వి బి పురం
కె.వి.బి.పురం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన వెట్టి గజేంద్రయ్య దంపతులను శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గజేంద్రయ్య దంపతులకు శేష వస్త్రం కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ... వెట్టి గజేంద్రయ్య దళిత కుటుంబంలో జన్మించి, ఎంతో శ్రమించి ఎం.ఏ, బి.ఈడి, బి.ఎల్ వంటి ఉన్నత చదువులు పూర్తి చేశారని కొనియాడారు. ఉపాధ్యాయుడిగా ఆ ప్రాంతంలో ఎంతో మందికి విద్యాబుద్ధులు నేర్పి, అందరితో కుటుంబ సభ్యుడిగా కలిసిపోయారని, 'రాజేంద్రన్న' గా పిలవబడే ఆయన సేవలు విలువకట్టలేనివని ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేసిన తరుణంలో, ఇప్పటివరకు విద్యార్థులకే పరిమితమైన ఆయన సేవలను ఇకపై సమాజానికి అందించాలని కోరారు. గజేంద్రయ్య గారు క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చి, ప్రజా సేవలో మమేకం కావాలని ఆయన ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ లక్ష్మీపతి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ రామాంజుల నాయుడు, మునిస్వామి యాదవ్, ఫజల్, ఏలుమలై, తిరుపాల్, వెంకట కృష్ణయ్య, పాఠశాల ఉపాధ్యాయులు మరియు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



# స్వామి రెడ్డి పల్లి లో అత్యంత వైభవంగా" ఏరువాకపౌర్ణమి" కార్యక్రమం..!

## -రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని..






ప్రజాభూమి ప్రతినిధి, చంద్రగిరి:
చంద్రగిరి నియోజకవర్గం, పాకాల మండలం, సామిరెడ్డి వల్లి పంచాయతీలో అత్యంత వైభవంగా జరిగిన 'ఏరువాక పౌర్ణమి' మహోత్సవ కార్యక్రమానికి చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణానికి చేరుకున్న ఎమ్మెల్యే కి అధికారులు, కూటమి నాయకులు ఘనస్వాగతం పలికారు. నియోజకవర్గ యువత బాణాసంచా కాలున్నా, మహిళలు సాంప్రదాయబద్ధంగా హారతులు ఇచ్చి ఆహ్వానించారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా గ్రామంలోని వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం, రైతులతో కలిసి పొలంలో నాగలి పట్టి దుక్కి దున్ని ఏరువాకను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలు, ఎరువులు, పనిముట్లు మరియు వ్యవసాయ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సామిరెడ్డిపల్లి పరిధిలోని రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. నవ్యాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధిలో ముందుండి ప్రోత్సహిస్తోందని ఎమ్మెల్యే నాని కొనియాడారు. ముఖ్యంగా ప్రభుత్వం రైతాంగం, పారిశ్రామిక రంగం, ఐటీ రంగాన్ని ఎల్లప్పుడూ సమానంగా ప్రోత్సహిస్తుందని.. రైతుల వల్ల సమాజానికి సుఖం, పారిశ్రామికీకరణ వల్ల ఆర్థిక వృద్ధి, ఐటీ రంగం వల్ల యువతకు భవిష్యత్తు ఎదుగుదల లభిస్తాయని స్పష్టం చేశారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా కూటమి ప్రభుత్వం పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని, రాష్ట్రం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం మామిడి రైతులను విశేషంగా ఆదుకుంటూ వస్తోందని గుర్తుచేశారు. ఇటీవల జరిగిన రెండేళ్ల విజయోత్సవ సభలో మామిడి రైతులు ముఖ్యమంత్రిని ఆదుకోవాలని అడగడంతో, రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులను కూడా పక్కనపెట్టి కిలోకు 4 రూపాయల చొప్పున మొత్తం 180 కోట్ల రూపాయలను అడిగిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు శాంక్షన్ చేశారన్నారు. ఈ నిధుల ద్వారా మన చంద్రగిరి నియోజకవర్గంలోని సుమారు 26 వేల మంది మామిడి రైతులకు 17 కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూరిందని హర్షం వ్యక్తం చేశారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రైతులకు ఏటా 20 వేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందించడం జరుగుతోందని.. కేవలం మాటలు చెప్పే పాత ప్రభుత్వాలు పోయి, నేడు కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమర్థ నాయకత్వంలో, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలతో రైతు పక్షపాత ప్రభుత్వం ముందుకు సాగుతోందని కొనియాడారు. రైతులను ఇబ్బంది పెట్టే ప్రభుత్వాలకు మనుగడ ఉండదని, కాబట్టి అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ రైతులకు సహకరిస్తూ వారికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. 'రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది.. రాష్ట్రం బాగుంటే నేను కూడా బాగుంటాను' అని ఆయన వ్యాఖ్యానించారు. నియోజకవర్గంలోని సాగునీటి, తాగునీటి సమస్యల శాశ్వత పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను ఎమ్మెల్యే వివరించారు. పదిపట్ల బైలు నుండి కల్యాణి డ్యామ్‌కు, కొటాల చెరువుకు నీటిని తరలించే ప్రాజెక్టుకు ఇప్పటికే నిధులు మంజూరై, పనులు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. అలాగే పదిపట్ల బైలు నుండి రామసముద్రం చెరువుకు కూడా సాగునీటిని తీసుకువచ్చేలా నిధుల అంచనాలను సిద్ధం చేశామని, త్వరలోనే ఆ నిధులు కూడా మంజూరై పనులు పూర్తవుతాయని స్పష్టం చేశారు. దీనివల్ల భూగర్భ జలమట్టం మరియు భూమిలో తేమ శాతం గణనీయంగా పెరిగి, చుట్టుపక్కల గ్రామాలకు నీటి కొరత తీరుతుందని.. తద్వారా రైతులు కేవలం వర్షాల మీదనే ఆధారపడకుండా ఏడాది పొడవునా పంటలు పండించుకునే సువర్ణ అవకాశం లభిస్తుందని రైతులకు వివరించారు.
లికూటమి నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే నాని ఒక ముఖ్యమైన విజ్ఞప్తి చేశారు.
రోజురోజుకూ చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి చెందుతుండటం చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, వారి అనుకూల పత్రికలు నిత్యం అవాస్తవాలు రాస్తూనే ఉంటాయని, వాటిని ఎవరూ పట్టించుకోవాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. మన మొదటి ప్రాధాన్యత ఎప్పుడూ అభివృద్ధి వైపే ఉండాలని, మనం ఎక్కడా తప్పు చేయడం లేదు కాబట్టి ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఒకవేళ క్షేత్రస్థాయిలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాన్ని అస్సలు ఆలస్యం చేయకుండా, వెంటనే స్పందించి పరిష్కరించే విధంగా అడుగులు వేయాలని సూచించారు. రెండు రోజుల క్రితం పాకాల మండలంలో జరిగిన ఒక వివాదాన్ని ప్రతిపక్షాలు ఏ విధంగా మసిపూసి మారేడు కాయ చేసి, ప్రజలను నమ్మించాలని చూశాయో కూటమి శ్రేణులంతా గమనించాలని కోరారు. ఆరోజు ఆ సమస్య తలెత్తినప్పుడే మనవాళ్లు ముందుగా తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే బాగుండేదన్నారు. ప్రతిపక్ష నేతలకు ఎలాంటి అవగాహన లేదని, వారు కేవలం అధికారులను బ్లాక్‌మెయిల్ చేస్తూ, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు. దానికి నిదర్శనమే ముద్దలపల్లిలో జరిగిన సంఘటన అని.. ఆరోజు మద్యం మత్తులో, గంజాయి తాగి కొందరు వివాదాన్ని సృష్టిస్తే, ఆ అరాచక శక్తులను ప్రతిపక్ష పార్టీ వెనకేసుకు వచ్చే దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని ధ్వజమెత్తారు. కాబట్టి ఎక్కడ ఏ సమస్య వచ్చినా కూటమి నాయకులు తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలబడాలని ఆదేశించారు. ప్రస్తుతం పాకాల మండలంలో ఉన్న అధికారులు ఎంతో నిబద్ధతతో, మంచిగా పనిచేస్తున్నారని, వారిని ఎలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా నాయకులంతా అధికారులతో సమన్వయంతో కలిసి ముందుకు సాగాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో అధికారులను జూమ్ కాన్ఫరెన్స్‌ల ద్వారా ఇళ్లకే పిలిపించుకుని ఎలా రకరకాలుగా వేధించి, ఇబ్బంది పెట్టారో ఆ చేదు నిజాలు అధికారులకు కూడా బాగా తెలుసన్నారు. మనం అలా కాకుండా అన్ని వర్గాలను, రంగాలను కలుపుకొని ముందుకు సాగితే వంద శాతం విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పాకాల మండల సమగ్ర ప్రగతి కొరకు రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసి రావాలని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు తాను ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రకటించారు. సామిరెడ్డిపల్లిలో జరిగిన ఈ మహోత్సవంలో జిల్లా ఉన్నతాధికారులు, వ్యవసాయ అనుబంధ శాఖల సిబ్బంది, నియోజకవర్గ రైతాంగం, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు మరియు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వినుత కోటా ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకున్న జనసేన ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి



ప్రజా భూమి ప్రతినిధి శ్రీ కాళహస్తి
జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ తాళ్లూరి, జనసేన పార్టీ శ్రీకాళహస్తి మాజీ ఇంచార్జ్ వినుత కోటా, చంద్రబాబు కోటాను హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి ఇటీవల వినుత కోటాకు జరిగిన ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఘటనకు దారితీసిన పరిస్థితులు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. బాధితురాలి వాదనను పూర్తిగా విన్న రామ్ తాళ్లూరి, జరిగిన ఘటనపై పార్టీ అత్యంత సీరియస్‌గా స్పందిస్తోందని పేర్కొన్నారు. జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని వివరాలను సేకరించి పార్టీ అధిష్ఠానానికి నివేదిక అందజేస్తామని, అనంతరం పార్టీ విధానాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకునే దిశగా ముందుకు సాగుతామని వెల్లడించారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎలాంటి పరిస్థితుల్లోనూ క్రమశిక్షణను పాటించాలని, పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలకు తావు లేకుండా వ్యవహరించాలని సూచించారు. పార్టీ ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా జనసేన అధిష్ఠానం కట్టుబడి ఉందని, వాస్తవాల ఆధారంగా నిర్ణయాలు తీసుకుంటామని రామ్ తాళ్లూరి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వినుత కోటా తనకు జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను రామ్ తాళ్లూరికి వివరించగా, చంద్రబాబు కోటా కూడా సంఘటనకు సంబంధించిన పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

# నిస్వార్థ సేవకు మారుపేరు కోటేశ్వరబాబు

## - విద్యార్థులకు విద్యాసామగ్రీ పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి :శ్రీకాళహస్తి టౌన్
నిస్వార్థ సేవకు మారుపేరు డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు అని ప్రధానోపాధ్యాయులు వై. సుబ్రహ్మణ్యం కొనియాడారు. సత్యవేడు నియోజకవర్గం, బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని గొవిందప్ప నాయుడు కండ్రిగ ప్రభుత్వ పాఠశాలలోని 80 మంది విద్యార్థులకు ప్రముఖ సంఘ సేవకులు, ఆంధ్రశ్రీ అవార్డు గ్రహీత, సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ యల్లంపాటి కోటేశ్వరబాబు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ పాఠశాలలోని ఒకటి నుంచి ఐదు తరగతుల విద్యార్థులకు నోటుపుస్తకాలు, పలకలు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి అందించారు. గతేడాది విద్యాసంవత్సరం కూడా ప్రధానోపాధ్యాయులు విజ్ఞప్తి మేరకు పంపిణీ చేశారు. ఈ విద్యా సంవత్సరం కూడా ఏడాదికి సరిపడా పుస్తకాలను అందించి ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ జర్నలిజాన్ని వృత్తిగా కాకుండా సామాజిక బాధ్యతగా భావించే మృదు స్వభావి కోటేశ్వరబాబు లాంటి వారు అరుదుగా ఉంటారని తెలిపారు. సమాజ సేవ పట్ల నిబద్ధతతో ప్రతియేటా శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేయడం పట్ల అభినందించారు. అనంతరం కోటేశ్వరబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టపడి చదవాలని కోరారు. విద్యను మించిన ఆస్తి ఇంకోకటి లేదన్నారు. ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని స్పష్టం చేశారు. ప్రతి విద్యార్థి ఉత్తమ ప్రతిభతో రాణించి తల్లిదండ్రులకు, గురువులకు, పాఠశాలకు, ఊరికి మంచి పేరు తీసుకురావాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చలముని, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# హరితోదయంతో పచ్చదనం వైపు శ్రీచైతన్య విద్యార్థుల అడుగులు




ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి టౌన్
పచ్చని భవిష్యత్తు నిర్మాణమే లక్ష్యంగా శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు 'హరితోదయం' పేరుతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. ప్రతినెలా నిర్వహించే స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 'హరితోదయ' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని విద్యార్థులకు పరిచయం చేశారు. ఇందులో భాగంగా ఉపాధ్యాయులు ప్రతిరోజూ విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ప్రాణవాయువును అందించే చెట్లను సంరక్షించడం,నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడడం,ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించడం,డస్ట్ బిన్స్ వినియోగాన్ని అలవాటు చేసుకోవడం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా మొక్కలు నాటారు. విద్యార్థులు చేతుల్లో పర్యావరణ నినాదాలతో కూడిన ప్లకార్డులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ ఎ.రూపాదేవి మాట్లాడుతూ, ప్రకృతిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత. నేటి చిన్నారులే రేపటి పర్యావరణ రక్షకులు. ఇలాంటి కార్యక్రమాలు వారిలో బాధ్యతను పెంచుతాయి అని అన్నారు. ఎ.జి.ఎం సురేష్ మాట్లాడుతూ, ప్రకృతిని ప్రేమిద్దాం భవిష్యత్తును భద్రపరచుకుందాం. ప్లాస్టిక్‌కు దూరంగా ఉంటే ప్రకృతికి దగ్గరవుతాం అనే సందేశాన్ని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో డీన్ త్రివేణి, ఇన్‌చార్జులు శ్రీహరి,కల్పనతో పాటు ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అవధూత మాసపత్రిక 11వ వార్షికోత్సవము సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న బొజ్జల బృందమ్మ...



ప్రజా భూమి ప్రతినిధి
శ్రీకాళహస్తి రూరల్
మండలంలోని ఊరందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు ఆధ్యాత్మిక అవధూత మాశపత్రిక వారిచే జన చర్య పుస్తకం డైరీలు, విద్యాసామగ్రిని బొజ్జల బృందమ్మ చేతుల మీదగా అందించడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమం సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ పదవ తరగతి అనేది కీలకమైన దశ అని ఇక్కడ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. అంతేకాకుండా ఈ పాఠశాలోని విద్యార్థులకు అవసరమైన క్రీడా యూనిట్లును,పాఠశాల మరమ్మత్తులను స్థానిక ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి తెలియజేసి బాగు చేయిస్తానని హామీ ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయుడైన ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది 1200 మంది పదో తరగతి విద్యార్థులకు డైరీలు విద్యాసామగ్రి కిట్స్ ను అందించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రాజకుమారి ఇతర ఉపాధ్యాయ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పార్వతీదేవి ఒడిలో శయనించిన శివయ్యను ఎప్పుడైనా దర్శించారా?

## సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయ విశేషాలు




ప్రజా భూమి ప్రతినిధి నాగలాపురం
ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలో ఉన్న సురుటుపల్లి శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయం దేశంలోనే అత్యంత విశిష్టమైన శైవక్షేత్రాల్లో ఒకటి. సాధారణంగా శివాలయాల్లో పరమశివుడు లింగరూపంలో దర్శనమిస్తాడు. అయితే ఈ క్షేత్రంలో మాత్రం పరమశివుడు పార్వతీదేవి ఒడిలో తలపెట్టుకుని శయన భంగిమలో భక్తులకు దర్శనమివ్వడం ఈ ఆలయ అపూర్వ ప్రత్యేకత.

### క్షీరసాగర మథనంతో అనుబంధం

దేవతలు, దానవులు అమృతం కోసం క్షీరసాగరాన్ని మథిస్తున్న సమయంలో ప్రపంచాన్ని దహించే హాలాహల విషం వెలువడింది. లోకాల రక్షణ కోసం పరమశివుడు ఆ విషాన్ని మింగగా, అది శరీరమంతా వ్యాపించకుండా పార్వతీదేవి ఆయన గొంతును బిగిగా పట్టుకుంది. దీంతో శివుని కంఠం నీలిరంగులోకి మారి నీలకంఠుడిగా ప్రసిద్ధి చెందాడు. విష ప్రభావంతో తీవ్ర అలసటకు గురైన పరమశివుడు కైలాసానికి వెళ్తూ మార్గమధ్యంలో ఈ ప్రాంతంలో పార్వతీదేవి ఒడిలో తలపెట్టి విశ్రాంతి తీసుకున్నాడని స్థల పురాణం చెబుతోంది. అందుకే ఇక్కడి స్వామివారిని పల్లికొండేశ్వరుడు అని పిలుస్తారు.

### సురుటుపల్లి పేరుకు కారణం

పరమశివుడు శయనించిన వార్త తెలుసుకున్న బ్రహ్మ, మహావిష్ణువు, నారదుడు, దేవతలందరూ ఇక్కడికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారని పురాణాలు చెబుతున్నాయి. సురులు ఒకేచోట చేరిన ప్రాంతం కావడంతో దీనిని మొదట "సురులపల్లి" అని పిలిచేవారు. కాలక్రమేణా అది ''సురుటుపల్లి''గా మారిందని చెబుతారు. తమిళంలో "సురుట్ట" అంటే అలసట లేదా మైకం, "పల్లి" అంటే విశ్రాంతి అనే అర్థం కూడా ఉంది.

### ఆలయ ప్రత్యేకతలు

గర్భగుడిలో సుమారు 12 అడుగుల పొడవుతో శయన భంగిమలో ఉన్న పల్లికొండేశ్వర స్వామివారు పార్వతీదేవి ఒడిలో తలపెట్టి దర్శనమిస్తారు. పక్కనే బ్రహ్మ, విష్ణువు, సూర్యుడు, చంద్రుడు, నారదుడు, భృగు మహర్షి తదితర దేవతామూర్తులు స్వామివారిని దర్శిస్తున్నట్లుగా శిల్పాలు చెక్కబడి ఉంటాయి. ఈ ఆలయంలో శయనమూర్తికి సాధారణ అభిషేకాలు చేయరు. ప్రతి పదిహేను రోజులకు ఒకసారి ప్రదోష సమయంలో తమిళనాడు నుంచి తెచ్చే ప్రత్యేక చందన తైలంతో స్వామివారికి లేపనం చేస్తారు. విషతాపాన్ని శాంతింపజేసే సంకేతంగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. ఆలయ ప్రాంగణంలో వాల్మీకి మహర్షి ప్రతిష్ఠించినట్లు విశ్వసించే వాల్మీకేశ్వర స్వామి శివలింగం కూడా ఉంది. అమ్మవారిని మరకతాంబిక లేదా అముదాంబికగా భక్తులు ఆరాధిస్తారు. ఇక్కడ దక్షిణామూర్తి గౌరీదేవితో కలిసి దాంపత్య దక్షిణామూర్తిగా దర్శనమివ్వడం మరో విశేషం. దాంపత్య జీవితంలో సమస్యలు ఉన్నవారు ఇక్కడ ప్రత్యేక పూజలు చేస్తే శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

### ప్రదోష పూజలకు విశేష ప్రాధాన్యం

హాలాహల విష ప్రభావం నుంచి కోలుకున్న పరమశివుడు ప్రదోష వేళ దేవతలకు దర్శనమిచ్చాడని పురాణాలు చెబుతున్నాయి. అందువల్ల ప్రతి ప్రదోష పూజకు ఇక్కడ ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా శని ప్రదోషం రోజున వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

### చారిత్రక నేపథ్యం

ఈ ఆలయం విజయనగర సామ్రాజ్య స్థాపకులు హరిహరరాయులు, బుక్కరాయుల కాలంలో నిర్మించబడినట్లు శాసనాలు తెలియజేస్తున్నాయి. అనంతరం శ్రీకాళహస్తి సంస్థానాధీశులు ఆలయాన్ని అభివృద్ధి చేసి జీర్ణోద్ధరణ చేపట్టారు. పార్వతీదేవి ఒడిలో శయనించిన పరమశివుడిని దర్శించగలిగే ప్రపంచంలోని అరుదైన శైవక్షేత్రంగా సురుటుపల్లి పల్లికొండేశ్వర స్వామి ఆలయం భక్తుల విశ్వాసానికి, ఆధ్యాత్మిక వైభవానికి చిరస్మరణీయ చిహ్నంగా నిలిచింది.

# డ్వాక్రా సంఘాల పనితీరుపై సమగ్ర సమీక్ష చేపట్టాలి

## - బీజేపీ జనతా వారధి బృందం



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి
ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం ఏర్పాటైన డ్వాక్రా (ఎస్‌హెచ్‌జీ) సంఘాల పనితీరు, మహిళా సాధికారత, సెర్ప్, మెప్మా సంస్థల ఆడిట్ల పారదర్శకతపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించి అవసరమైన సంస్కరణలు చేపట్టాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేసింది. బీజేపీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా సంఘాల మహిళలను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకున్న అనంతరం తిరుపతి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ మాట్లాడుతూ, మహిళల సాధికారత లక్ష్యంగా ఏర్పడిన డ్వాక్రా వ్యవస్థ ప్రస్తుతం తన అసలు ఉద్దేశ్యానికి భిన్నంగా కేవలం రుణాల పంపిణీ వ్యవస్థగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల స్వయం ఉపాధి, ఆదాయ వృద్ధి కోసం ఇవ్వాల్సిన రుణాలు ఎక్కువగా వైద్య ఖర్చులు, విద్య, వివాహాలు, పాత అప్పుల చెల్లింపులకే వినియోగించబడుతున్నాయని తెలిపారు. బ్యాంకులు, మైక్రో ఫైనాన్స్ సంస్థలు, ప్రైవేట్ అప్పులు కలిసి మహిళలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాయని పేర్కొన్నారు. రుణాల మంజూరులో ఆలస్యం, అనవసర పత్రాలు, బలవంతపు బీమాలు, అదనపు డిపాజిట్లు, ఆర్‌పీల ద్వారా శాతం వసూళ్లు వంటి అంశాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పొదుపులు, వడ్డీలు, అంతర్గత రుణాల లెక్కలపై సభ్యులకు సరైన అవగాహన లేకపోవడంతో అవకతవకలకు అవకాశం ఏర్పడుతోందన్నారు. అలాగే చిన్న వ్యాపారాలకు మార్కెట్, బ్రాండింగ్, మార్కెటింగ్, ఈ-కామర్స్ మద్దతు లేకపోవడంతో మహిళలు ఆశించిన స్థాయిలో అభివృద్ధి సాధించలేకపోతున్నారని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా సంఘాలపై స్వతంత్ర సామాజిక ఆడిట్ నిర్వహించాలని, ప్రతి సంఘానికి డిజిటల్ అకౌంటింగ్ వ్యవస్థ, పారదర్శక డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలని, రుణాల మంజూరులో జరిగే అన్ని డిడక్షన్లు, బీమా, ఇతర చార్జీల వివరాలను లిఖితపూర్వకంగా సభ్యులకు అందజేయడం తప్పనిసరి చేయాలని కోరారు. బలవంతపు బీమాలు, అనధికార కమీషన్లు, శాతం వసూళ్లపై ప్రత్యేక విచారణ చేపట్టాలని, పొదుపు ఆధారిత డ్వాక్రా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. అదేవిధంగా మహిళలకు మార్కెట్ లింకేజీలు, బ్రాండింగ్, ఈ-కామర్స్, డిజిటల్ లిటరసీ, ఫైనాన్షియల్ లిటరసీ, వ్యవస్థాపక నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కీలక నిర్ణయం ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రతి మండలంలో "డ్వాక్రా సమస్యల నమోదు -- పరిష్కార సహాయ కేంద్రాలు" ఏర్పాటు చేసి, మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులు, సమస్యలు, సూచనలను సేకరించి దశలవారీగా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం నిరంతరంగా పోరాడాలని జనతా వారధి బృందం నిర్ణయించింది. అలాగే మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాలు, ఆర్థిక నిర్వహణ, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని తీర్మానించింది. కేంద్ర ప్రభుత్వం మహిళా సాధికారత, స్వయం సమృద్ధి లక్ష్యంతో తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నప్పటికీ, వాటి అసలు ఉద్దేశ్యం నెరవేరేలా సెర్ప్, మెప్మా సంస్థలు పారదర్శకంగా పనిచేయాలని సామంచి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి బృంద సభ్యులు డాక్టర్ నరేష్ బాబు, అనూష రామకృష్ణ, ప్రేమ్ కుమార్, రెడ్డి బాబు పాల్గొన్నారు.

# రాష్ట్ర సమాచార కమిషన్ను ఆశ్రయించిన ఐరాల మండల భూ బాధితుడు యుగంధర్ రెడ్డి



ప్రజాభూమి ప్రతినిధి ఐరాల
ఐరాల మండలం, మొరుంపల్లి రెవిన్యూ గ్రామ లెక్క దాఖలాలో సర్వే నెంబర్ 243, విస్తీర్ణం - 1.49 సెంట్లు పట్టా భూమి పై వారసత్వ హక్కు కలిగి ఉన్నారు. సదరు సర్వే నెంబరులో ఐరాల రెవిన్యూ అధికారులు రికార్డులను తారుమారు చేసి కన్నమ్మను కనకమ్మగా చిత్రీకరించారని బాధితుడి ఆరోపణ. కనకమ్మ కుమారుడైన నర్సింహా రెడ్డి పేరిట మ్యుటేషన్ (పట్టాదారు పాస్ బుక్) కు సంబంధించిన పూర్తి ఫైల్ ఆధారాలను కోరుతూ యుగంధర్ రెడ్డి సమాచార హక్కు చట్టం ద్వారా ధరఖాస్తు చేసిన వైనం. స. హ. చట్టం ధరఖాస్తుకు అసంపూర్తి సమాచారం ఇచ్చినందున సమాచార హక్కు చట్టం సామాజిక కార్యకర్త కొణతం చంద్రశేఖర్ తో కలిసి నేడు రెండవసారి మంగళగిరిలోని రాష్ట్ర సమాచార కమిషన్ కు హాజరైన భూ బాధితుడు.

ప్రజాభూమి



## బాల్యవివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, హెల్ప్‌లైన్ నంబర్లు, శక్తి యాప్‌పై అవగాహన



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు శక్తి బృందాలు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహిళా పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ వెంకటేష్, ఈగల్ టీం సిబ్బంది చిత్తూరు పట్టణంలోని డీఈఓ కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్యవివాహం చట్టవిరుద్ధమని, 18 సంవత్సరాలు నిండకముందే బాలికలకు వివాహం చేయడం నేరమని వివరించారు. చిన్న వయసులో వివాహం వల్ల చదువుకు అంతరాయం కలగడంతో పాటు ఆరోగ్య సమస్యలు, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం ఉంటుందని తెలిపారు. విద్యను కొనసాగించి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని విద్యార్థినులకు సూచించారు. పోక్సో చట్టం ప్రకారం 18 సంవత్సరాల లోపు పిల్లలపై లైంగిక వేధింపులు, దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని, అలాంటి సంఘటనలు ఎదురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 ఎమర్జెన్సీ నంబర్, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌ను వినియోగించాలని అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన శక్తి యాప్ ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థినులతో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. అత్యవసర సమయంలో యాప్‌లోని ఎూూ బటన్ నొక్కగానే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం చేరుతుందని, అలాగే కుటుంబ సభ్యులకు కూడా సమాచారం వెళ్లే విధంగా ఈ యాప్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈగల్ టీం హెడ్ కానిస్టేబుల్ గిరి, పాఠశాల ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ గణేష్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నగరపాలక సంస్థకు 28వినతులు

### -కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి



ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 28 వినతులు వచ్చాయని కమిషనర్ (ఎఫ్.ఏ.సి) శారదా దేవి తెలిపారు. సోమవారం తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో



కార్యాలయంకు నేరుగా వచ్చి 22 మంది వినతులు సమర్పించగా, ఆరు మంది ఫోన్ ద్వారా తమ సమస్యలు తెలిపారు. మునిరెడ్డి నగర్ లోని మా ఇంటి పక్కన వారు ఎటువంటి నెట్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారు ఇబ్బందిగా ఉంది, నీటి పన్ను ఎక్కువగా వస్తోంది పరిష్కరించాలని, శివజ్యోతి నగర్‌లో వేగ నిరోధకాలు ఏర్పాటు చేయాలని, సుబ్బారెడ్డి నగర్, శివజ్యోతి నగర్ లో త్రాగునీరు, మురుగునీరు కలసి పోతున్నాయి పరిష్కరించాలని, డ్రైనేజి కాలువలు శుభ్రం చేయాలని, ఈట్ స్ట్రీట్ నందు అక్రమంగా మాంసాహారం విక్రాయిస్తున్నారు పరిష్కరించాలని, జి.ఎస్.కే. టవర్స్ పార్కింగ్ స్థలంలో అక్రమంగా నిర్మించిన గదులు తొలగించాలని, కోటకొమ్మల వీధిలో విద్యుత్ దీపాలు పెంచాలని, ఐ.ఎస్.మహల్ వద్ద గల తుడా అపార్ట్మెంట్ నందు కామన్ ఏరియాలో గుడి నిర్మాణన్ని ఆపాలని, న్యూ ఇందిరా నగర్ లో మురుగునీటి ప్రవాహం వలన ఇబ్బందిగా ఉంది పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ అధికారులు సేతుమాదవ్, రవి, సర్వేయర్లు కోటేశ్వరరావు, గురువా రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, వెటర్నరీ ఆఫీసర్ గుణశేఖర్, డి.ఈ.లు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలం పెద్దల చెరువు ఎస్టి కాలనీ లోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో ,సోమవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అంగన్వాడి విద్యార్థులకు పలక, బలపంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జూలియన్ రాజు మాట్లాడుతూ గత 35 సంవత్సరాలుగా మండలంలోని గిరిజన కాలనీలలో, చదువుతున్న విద్యార్థులకు,తనవంతు సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఈవినింగ్ స్టడీ సెంటర్లు, నిర్వహించినట్లు గుర్తు చేశారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతోపాటు , తమవంతు సహాయంగా సేవ, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఇచ్చిన వాటిని సద్వినియోగం చేసుకొని, ముందుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు చంద్రవర్ధిని, విద్యా కమిటీ చైర్మన్ అపర్ణ,ఉపాధ్యాయులు చంద్రశేఖర్ నాయుడు, రాజ శేఖర్ నాయుడు, అంగన్వాడి టీచర్ గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన నాయకుడు గరికపాటి చంద్రకు పరామర్శ

### - త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో కొనసాగాలని ఆకాంక్షించిన నరేంద్ర దండి

ప్రజాభూమి ప్రతినిధి: శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి జనసేన నాయకుడు గరికపాటి చంద్ర దీర్ఘకాలంగా వేధిస్తున్న మోకాళ్ల నొప్పులకు చికిత్స పొందుతూ స్విమ్స్ తిరుపతిలో ఆయుర్వేద వైద్యం తీసుకుంటున్న విషయం తెలుసుకుని పరామర్శించడం జరిగింది. వైద్యుల సూచనల మేరకు ఆయుర్వేద ఔషధాలు, ఫిజియోథెరపీ,



మసాజ్ థెరపీ ద్వారా ఆరోగ్యంలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తున్నట్లు తెలిసింది. సంపూర్ణ ఆరోగ్య సాధన కోసం మరో వారం రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స కొనసాగించాల్సి ఉందని వైద్యులు సూచించినట్లు వివరించారు. ఆయుర్వేద వైద్యంపై విశ్వాసం ఉంచి ఆరోగ్య పునరుద్ధరణ దిశగా సానుకూల నిర్ణయం తీసుకున్న గరికపాటి చంద్ర ని అభినందించాను. ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని, అదే అంకితభావంతో జనసేన పార్టీ సిద్ధాంతాల కోసం, ప్రజాసేవ కోసం మరింత ఉత్సాహంతో తిరిగి కార్యాచరణలో పాల్గొనాలని ఆకాంక్షించాను. ఈ పరామర్శ కార్యక్రమంలో శ్రీకాళహస్తి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు జనసేన సీనియర్ నాయకులు దండి రాఘవయ్య , అలాగే లక్ష్మణ్, నవీన్, బొక్కిసం వెంకట్రామయ్య తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

## స్వమాక్స్ 26వ మహాజన సభ సమావేశము..!







ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి:

స్వర్ణముఖి మహిళా పరస్పర సహకార సంఘం లిమిటెడ్. (స్వమాక్స్) 26వ మహాజన సభ ను కార్యాలయం ఆవరణములో అధ్యక్షురాలు పి. శివకుమారి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో చంద్రగిరి మండల జడ్పిటిసి చిల్లకూరి యుగంధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ ఈ సందర్భంగా సీఈవో సంగీతం విశ్వనాథం సంఘం 2025 - 26 సంవత్సర నివేదికను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సంఘం 12 మండలాలలో 442 గ్రామాలలో 11070 సభ్యులుగా వున్నారని, మరియు ఆర్థిక అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా 354 గ్రామాలలో 2124 కుటుంబాలకు వివిధ అవసరాల నిమిత్తం 14,70,77,000/- రూపాయలు రుణ సహాయాన్ని అందించడం జరిగిందని సభ్యులకు చదివి వినిపించారు. తదుపరి ఆమోదించడం జరిగినది. తరువాత సభ్యులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయులు టి. చంద్రముని మాట్లాడుతూ సభ్యుల తమ పిల్లలకు నాణ్యమైన విద్య, ఉన్నత విద్య కొరకు ప్రధానంగా తల్లిదండ్రులు కృషి చేయవలసిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. పిల్లలు పదవ తరగతి ఉత్తీర్ణులైన వారు కాలేజీ చదువులు వేరుగా చూడాలి. తదుపరి సహకార శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ ఈ సహకార సంఘం జిల్లాలో ప్రథమంగా సక్రమంగా జరుగుతున్నదని తెలిపినారు. ఈ కార్యక్రమంలో 183 మంది పదవ తరగతిలో ఉత్తీర్ణులైన బాలబాలికలకు ప్రోత్సాహక బహుమతులుగా 3 లక్షల 50 వేల రూపాయలు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పావని, షర్మిల, ఫరీదా, హైమావతి, లక్ష్మీ, జగదీశ్వరి మరియు సిబ్బంది పి. సుబ్రమణ్యం ఎస్.రామనాథరెడ్డి, ఎమ్.రవి, అంజి, యశోద, ఉమ, కౌసల్య, మీన, హరి, లోకేష్, సుమారు 600 మంది సభ్యులు, బాలబాలికలు పాల్గొన్నారు.

## విద్యా సంస్థల ఆవరణలో సిసి కెమెరాలు అమర్చుకోవాలి.!

### - కరడుగట్టిన గ్యాంగ్ చొరబడే అవకాశం:సిఐ సురేష్ కుమార్..



ప్రజాభూమి ప్రతినిధి,చంద్రగిరి.

చంద్రగిరి మండల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల ఆవరణలో సదరు యాజమాన్యం సిసి కెమెరాలు అమర్చు కోవాలి అని సిఐ సురేష్ కుమార్ తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు నిఘా వర్గాలకు లభిం చిన సమాచారం మేరకు మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ చెందిన కూరవ,ధాన్,చెడ్డీ గ్యాంగ్ లు రాష్ట్రంలోకి చొరబడి 2025లో అనం తపురం, కడప జిల్లాల్లో 2026లో దువ్వాడ, రాజమండ్రి, ఏలూరు, తిరుపతి జిల్లాల్లోని నారా యణవనం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇంజనీరింగ్ కళాశాలలోకి రాత్రి వేళల్లో గ్యాంగ్ ప్రవేశించి నగదు నిల్వ వుంచిన లాకర్లను పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు సమాచారం అందినది. ప్రస్తుతం విద్యార్థుల అడ్మిషన్లు జరుగుతున్న తరుణంలో కళాశాలలను లక్ష్యంగా చేసుకొంటున్నందున చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కళాశాలల ప్రిన్సిపాల్స్, కరస్పాండెంట్లు, అడ్మినిస్ట్రేటివ్ అధికా రులు మరియు భద్రతా సిబ్బందితో సమావేశమై పోలీసు వారి సూ చనలు పాటించాలని కోరుతు న్నాము. 1.కార్యాలయ లాకర్లలో రాత్రి వేళల్లో నగదు నిల్వ ఉంచ వద్దు. 2.రోజూ వారీ వసూళ్లను అదే రోజున బ్యాంకులో జమ చేయాలి. 3.కళాశాల ప్రాంగణంలో 24 గంటలు పనిచేసే విధంగా సిసి కెమెరాలు అమర్చుకోవాలి. కనీసం 30 రోజుల నిడివి ఫుటేజ్ భద్రపరు చుకోవాలి. 4.రైల్వే ట్రాక్లు, రైల్వే స్టేషన్లు మరియు ఒంటరి ప్రాంతాలకు చేరువలోని కళాశాలలు వెనుక భాగంలో ఫ్లడ్ లైట్స్ మరియు అదనంగా సిసి కెమెరాలు అమర్చుకోవాలి. 5.రాత్రి వేళల్లో భద్రతా సిబ్బంది ద్వారా తరచూ గస్తీ నిర్వహించి, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి అని తెలిపారు.

## ఇద్దరి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన ఇద్దరి హత్య కేసులో నిందితుడు బండి కేశవులుకు 9వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. రెండు హత్యలకు గాను జీవిత ఖైదుతో పాటు ఒక్కో హత్యకు రూ.1,000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో మూడు నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. చిత్తూరు మండలం నయనిచెరువు పంచాయతీ పరిధిలోని చెన్నసముద్రం గ్రామానికి చెందిన పల్లెబోయన శేఖర్, లక్ష్మీపతి యాదవ్‌ను 20-10-2018 రాత్రి చెరకు తోటలో కత్తితో గొంతు కోసి బండి కేశవులు హత్య చేశాడు. తన కుమార్తెను శేఖర్ లైంగికంగా వేధిస్తున్నాడనే కక్షతో శేఖర్‌ను హత్య చేయగా, విషయం బయటకు రాకుండా ఉండేందుకు లక్ష్మీపతిని కూడా హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శాస్త్రీయ ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణ అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ న్యాయస్థానం జీవిత ఖైదు విధించింది. ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన దర్యాప్తు అధికారులు, ప్రభుత్వ అభియోగ న్యాయవాది, కోర్టు సిబ్బంది, కోర్టు మానిటరింగ్ సెల్ అధికారులను జిల్లా ఎస్పీ తుషార్ డూడి అభినందించారు.

## భాగవత సప్తాహంలో పాల్గొన్న తులసిరెడ్డి

ప్రజాభూమి, వేంపల్లె

వీరపునాయునిపల్లి మండలం, సంగాలపల్లె గ్రామంలోని శివకృష్ణ గోశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న భాగవత సప్తాహ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి, రైల్వే కాంట్రాక్టర్ కుమ్మితి సుబ్బరామిరెడ్డి, ఆయన సతీమణి పద్మావతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పులివెందుల భాగవత భక్త సమాజం, శివకృష్ణ గోశాల వ్యవస్థాపకులు కల్లూరి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి జూలై 1 వరకు భాగవత సప్తాహం కొనసాగుతోంది. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఆధునిక మానవుడు సౌకర్యాలు ఉన్నప్పటికీ అశాంతితో జీవిస్తున్నాడని, భాగవత సప్తాహం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మనసుకు ప్రశాంతతను అందిస్తాయని అన్నారు. రామాయణం, మహాభారతం, మహాభాగవతం భారతీయ సంస్కృతికి ప్రతీకలని పేర్కొన్నారు. భాగవతం మోక్ష శాస్త్రమని, శ్రీమన్నారాయణుని దశావతారాల లీలావైభవమే మహాభాగవతమని తెలిపారు. వ్యాస మహర్షి సంస్కృతంలో రచించిన మహాభాగవతాన్ని బమ్మెర పోతనామాత్యులు తెలుగులో ఆంధ్రీకరించారని వివరించారు. శివకృష్ణ గోశాలలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కల్లూరి రాజశేఖర్ రెడ్డి, పులివెందుల భాగవత భక్త సమాజాన్ని తులసిరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్న శివారెడ్డి, గొందిపల్లి నారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, యాగంటి బాలకృష్ణారెడ్డి, ప్రకాష్ రెడ్డి, రంగనాథ్, గంగిరెడ్డి, నీలకంఠారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి జిల్లా పర్యటనను విజయవంతం చేయండి

### - నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన చిల్లకూరు మండలం, పొన్నపరవారిపాలెం లో పర్యటించే అవకాశం ఉంది. ఈ సందర్భంగా అధికారులందరు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. జులై 1న రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు రానున్న సందర్భంగా..సోమవారం చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎస్పి అజిత వేజెండ్ల, జేసి మొగిలి వెంకటేశ్వర్లు..లతో కలసి ఏర్పాట్లపై కలెక్టర్ హిమాన్షు శుక్లా పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి జిల్లా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ప్రోటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్ ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య పనులు పక్కాగా వుండాలని, అలాగే త్రాగు నీటి కొరత లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ప్రణాళిక బద్ధంగా ఏర్పాట్లను పూర్తిచేసి విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

నూతన ఆర్టీసీ బస్సు సర్వీసు ప్రారంభం : అంతకుముందు పున్నపువారిపాలెం, ఓడూరు, రెట్టపల్లి గ్రామాలకు ఆర్టీసీ బస్సు నూతన సర్వీసును గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం సునీల్ కుమార్ తో కలసి జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఆర్డీవో అరుణ కుమారి, డిఆర్డీఏ, మెప్మా పిడీలు నాగరాజ కుమారి, కిరణ్ కుమార్, డిపివో వసుమతి, పౌర సరఫరాల శాఖ డీఎం అర్జున రావు, డిఎస్ఓ పుల్లయ్య, డీఎస్పీ గిరిధర్, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### సహకార వారోత్సవాలలో భాగంగా

## మొక్కలు నాటిన తంగేళ్లపాలెం పీఏసీఎస్





ప్రజా భూమి ప్రతినిధి :తొట్టంబేడు

సహకార వారోత్సవాల్లో భాగంగా సహకారం ద్వారా సమృద్ధినినాదంతో తొట్టంబేడు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.తిరుపతి జిల్లా సహకార శాఖ ఆదేశాల మేరకు సంఘ కార్యాలయ ప్రాంగణంలో ఈ కార్యక్రమం చేపట్టారు.సంఘ అధ్యక్షులు బీమాల భాస్కర్ ముదిరాజ్, సహకార శాఖ అధికారి, సంఘ సీఈవో పి.చిరంజీవిరెడ్డి, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం సంయుక్తంగా మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో సంఘ ఉద్యోగులు, స్థానిక రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని పలు రకాల మొక్కలను నాటారు.హరితహారం పెంపునకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని సంఘ అధ్యక్షులు భాస్కర్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. సహకార సంఘాలు కేవలం ఆర్థిక సేవలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యత కలిగిన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సీఈవో చిరంజీవిరెడ్డి తెలిపారు.సహకార రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు బాలసుబ్రమణ్యం, రైతులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రేణిగుంటమండలంలో 95 శాతం, పల్స్ పోలియో విజయవంతం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట మండలంలో 95% పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించినట్లు రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ తేజస్విని తెలిపారు. పోలియో ఆదివారం నాడు రేణిగుంట మండలంలో 8388 మంది అర్హులైన 0-5సంవత్సరాల వయస్సుగల పిల్లలకు గాను 7989 మందికి పోలియో చుక్కలు వేయడం జరిగింది.95.24% లక్ష్యం సాధించామని, మిగిలిన పిల్లలకు 29, 30 వ తేదీలలో ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేయడం జరుగుతోందని డాక్టర్ తేజస్విని తెలిపారు.

## ఏడు కోట్లతో విందూరు రోడ్డు మరమ్మతు పనులకు శంకుస్థాపన



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఎన్నికలకు ముందు పర్యటనకు వచ్చినప్పుడు విందూరు రోడ్డు అద్వా నంగా ఉందని ప్రజలు తెలియజేశారని కూటమి ప్రభుత్వం వస్తే రోడ్డు నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చామని ఇచ్చిన హామీ మేరకు ఏడు కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునిల్ కుమార్ వెల్లడించారు. గూడూరు మండలం విందూరు గ్రామానికి నూతన రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక మధు రెడ్డి కాలనీ వద్ద ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ శంకుస్థాపన చేశారు స్థానిక నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ విందూరు రోడ్డు అద్వాన స్థితిలో ఉందని గత వైసీపీ ప్రభుత్వంలో తట్ట మట్టి కూడా వేయలేదని గుర్తు చేశారు ఎన్నికలకు ముందు ప్రచారానికి వచ్చినప్పుడు రోడ్డు నిర్మాణం గురించి ప్రజలు తెలియజేశారని కూటమి ప్రభుత్వంవస్తే రోడ్డు వేస్తామని హామీ ఇచ్చామని అన్నారు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణం



ప్రారంభిస్తున్నామని ఈ చుట్టుపక్కల గ్రామాల వారందరికీ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అభివృద్ధిని చూసి మాట్లాడాలని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ ,బిల్లు చెంచురామయ్య ,మట్టం శ్రావణి, రహీం,మల్లికార్జున్ రెడ్డి,వెంకటేశ్వరరాజు ,శ్రీదేవి భారతి తదితరులు పాల్గొన్నారు

# తిరుచానూరు రంగనాథం వీధిలో తీవ్ర ట్రాఫిక్ సమస్యలు

## - నిత్యం ఇబ్బందులు పడుతున్న భక్తులు, స్థానికులు

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

తిరుచానూరులోని రంగనాథం వీధిలో రోజు రోజుకూ ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చుతోంది. నిత్యం భారీ సంఖ్యలో అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు, స్థానికులు, వాహనదారులు, ప్రజాప్రతినిధులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా సెలవు రోజులు, శుక్రవారం, పండుగలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. ఇటీవల అమ్మవారి తెప్పోత్సవాల సందర్భంగా భద్రతా చర్యల్లో భాగంగా కొన్ని ప్రాం తాల్లో గేట్లు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడి ట్రాఫిక్ మరింత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయ మార్గాలు సరిపోకపోవడం, ఇరుకైన వీధుల్లో వాహనాలు నిలిపివేయడం



వల్ల తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. గత శుక్రవారం జిల్లా కలెక్టర్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించేందుకు శంకర్ నాయుడు కాలనీకి వెళ్తున్న సమయంలో కూడా రంగనాథం వీధిలో కొంతసేపు ట్రాఫిక్‌లో చిక్కుకోవాల్సి వచ్చింది. దీంతో ఈ సమస్య తీవ్రత మరోసారి వెలుగులోకి వచ్చింది. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్క్ చేయడంతో రహదారి వెడల్పు తగ్గిపోతోంది. దీనికి తోడు ఆటోలు, కార్లు, ద్విచక్ర వాహనాలు ఒకేసారి రావడం వల్ల ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కూడా సవాలుగా మారుతోంది. స్థానికులు, భక్తులు, వ్యాపారులు మాట్లాడుతూ, తిరుచానూరులో మాస్టర్ ప్లాన్ రోడ్లు అభివృద్ధి చేసినప్పటికీ, భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారిందని పేర్కొంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ), తిరుచానూరు పంచాయతీ, సంబంధిత అధికారులు కలిసి ఆలయానికి సమీపంలో విశాలమైన పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నిర్వహణకు శాశ్వత కార్యాచరణ రూపొందించాలని కోరుతున్నారు. అదేవిధంగా రద్దీ సమయాల్లో అదనపు ట్రాఫిక్ సిబ్బందిని నియమించడం, వన్‌వే విధానాన్ని సమర్థంగా అమలు చేయడం, అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడం వంటి చర్యలు చేపడితే సమస్యకు కొంత మేర పరిష్కారం లభిస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# స్పందన అర్జీకి... 'స్పందన' కరువు

- 90 రోజులు గడిచినా తిరుచానూరు ట్రాఫిక్,పార్కింగ్ సమస్యకు పరిష్కారం శూన్యం
- పరిష్కరించాం' అంటూ మెసేజ్... క్షేత్రస్థాయిలో మరింత తీవ్రత
- టీటీడీ--జిల్లా యంత్రాంగం తక్షణమే ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలి
- అమ్మవారి భక్తుడు,సీనియర్ జర్నలిస్టు మునిరామ్ రెడ్డి డిమాండ్

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన అర్జీలకు నిజమైన స్పందన కనిపించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 90 రోజుల్లో పరిష్కరించాల్సిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించకుండానే "సమస్య పరిష్కరించబడింది" అంటూ సందేశాలు పంపడం ప్రజలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఈ ఏడాది మార్చి 23న తిరుచానూరులో నెలకొన్న పార్కింగ్, ట్రాఫిక్ సమస్యపై స్థానిక అమ్మవారి భక్తుడు, సీనియర్ జర్నలిస్టు మునిరామ్ రెడ్డి జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. అయితే జూన్ 27న సమస్య పరిష్కారమైందంటూ ప్రభుత్వ నుంచి మెసేజ్ వచ్చినప్పటికీ, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ఉందని ఆయన తెలిపారు. సోమవారం మరోసారి సమస్యకు సంబంధించిన ఫొటోలు, పూర్తి వివరాలను అధికారులకు అందజేస్తూ, ప్రస్తుతం ట్రాఫిక్ సమస్య గతం కంటే మరింత తీవ్రంగా మారిందని తెలుపుతూ మరోసారి అర్జీ ఇవ్వడం జరిగింది. పార్కింగ్ స్థలాలు,సి.సి కెమెరాలు ఏర్పాటు చేసిన తరువాత టెండర్ నిర్వహిస్తామని చెప్పిన అధికారుల మాటలు కార్యరూపం దాల్చలేదు. ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయకపోవడంతో మాడా వీధులు, ప్రధాన రహదారులన్నీ వాహనాలతో నిండిపోతున్నాయని, దీంతో వేలాది మంది భక్తులు, స్థానికులు ప్రతిరోజూ గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఇటీవల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం సందర్భంగా రంగనాథం వీధి మీదుగా,శంకర్ నాయుడు కాలనీ



కి వెళ్లిన జిల్లా కలెక్టర్ సైతం ట్రాఫిక్ సమస్యను ప్రత్యక్షంగా ఎదుర్కొనడం గమనార్హం. వివిఐపి లు వచ్చినప్పుడు మాత్రమే హడావిడి చేసే పోలీసులు ,ఆ తరువాత చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తాజాగా సోమవారం ఉదయం కూడా రంగనాథం వీధిలో యధాతథంగా ట్రాఫిక్ జామ్ తో ప్రజలు, భక్తులు తీవ్రంగా అవస్తలు పడ్డారు. దీనిపై స్థానిక అమ్మవారి భక్తుడు, సీనియర్ జర్నలిస్టు మునిరామ్ రెడ్డి వెళ్ళి పోటోలు,వీడియోలు తీసి విచారించగా, తెప్పోత్సవాలు సందర్భంగా కొన్ని రోజులుగా గేట్లు మూసివేయడం వలనే ట్రాఫిక్ సమస్య వచ్చిందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. వరుస సెలవులు నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు, వివిఐపీ లు పోటెత్తుతున్నారు. దీనికి టిటిడి అధికారులు తాత్కాలిక ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు కూడా చేయలేకపోతున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తం అవుతుంది. మాస్టర్ ప్లాన్ రోడ్లు భవిష్యత్తులో అమలులోకి వచ్చినా, అప్పటి వరకు తాత్కాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఖాళీ స్థలాలు, టీటీడీకి చెందిన స్థలాలను గుర్తించి తాత్కాలిక పార్కింగ్ ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గే అవకాశముందని పెద్ద ఎత్తున స్థానికులు సూచనలు చేస్తున్నారు. నవజీవన్ ఆశ్రమం ఎదురుగా ఉన్న మల్లంగుంట చెరువు ప్రాంతం లేదా స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలోని ప్రభుత్వ భూములను పార్కింగ్ కోసం వినియోగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై టీటీడీ, జిల్లా యంత్రాంగం తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు, భక్తుల తరపున మునిరామ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

**"స్పందన"లో కాదు... క్షేత్రస్థాయిలో కనిపించాలి స్పందన**

ప్రజలు కోరేది కేవలం ఫైళ్లలో సమస్యలు మూసివేయడం కాదని, ప్రజలకు క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపాలని స్థానికులు ముని రామ్ రెడ్డి స్పష్టం చేస్తున్నారు. తిరుచానూరుకు ప్రతిరోజూ వేలాదిగా వచ్చే భక్తుల సౌకర్యం దృష్ట్యా ట్రాఫిక్, పార్కింగ్ సమస్యకు శాశ్వత లేదా కనీసం తాత్కాలిక పరిష్కారం చూపాల్సిన బాధ్యత టీటీడీ, జిల్లా యంత్రాంగంపై ఉందని,భక్తుల ద్వారా కోట్లాది రూపాయలు ఆదాయం వస్తున్నా పట్టించుకోకపోవడం బాధాకరం అని అమ్మవారి భక్తుడు మునిరామ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# గృహాల పక్కనే గ్రావెల్ మట్టి క్వారీలు,చెన్నేరిలో గ్రామస్తుల నిరసన



## చోద్యం చూస్తున్న ప్రభుత్వ అధికారులు

ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు

సత్యవేడు మండలం చెన్నేరి గ్రామంలో నివాస గృహాలకు అతి సమీపంలో, గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన జగనన్న ఇంటి పట్టాల పక్కనే కంకర క్వారీల పేరిట ఎర్ర మట్టి తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం కంకర క్వారీలకు సంబంధించిన లారీలను గ్రామస్తులు అడ్డుకుని నిరసన తెలిపారు. తమ ఇళ్లకు, ఇంటి పట్టాలకు ఎలాంటి నష్టం కలగకుండా క్వారీలను నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. గ్రామస్తుల నిరసనతో స్పందించిన నిర్వాహకులు, కంకర తవ్వకాల వల్ల ఏర్పడిన గుంతలను పూడ్చివేసి సరిచేస్తున్నట్లు సమాచారం. అయితే, క్వారీ అనుమతులు ఒకరి పేరుపై ఉండగా, తవ్వకాలు నిర్వహణ మరొకరు చేస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. అలాగే సత్యవేడు మండలంలో ఒక ప్రాంతానికి అనుమతులు తీసుకుని, మరో ప్రాంతంలో తవ్వకాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో కూడా నివాసము ఉంటున్న గృహాల వద్ద రాత్రిపూట తవ్వకాలు జరపడంతో భారీ స్థాయిలో గ్రామస్తులందరం నిరసనను తెలపడంతో అప్పటిలో ప్రభుత్వ పోలీస్ అధికారులు, రెవిన్యూ అధికారులు నేరుగా క్వారీ నడుస్తున్న ప్రాంతానికి వచ్చి సందర్శించి మా ఇండ్ల సమీపంలో ఉన్నటువంటి పెద్ద పెద్ద గుంతలను మూడు రోజులపాటు పూచివేసి ఆ ప్రాంతమంతా స్థలాన్ని వదిలివేసి మరొక ప్రాంతంలో క్వారీలను నడపడం జరిగింది. అప్పటిలో కొంతమంది ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ల సహకారం ఇప్పటికి మరువలేమంటూ ఆ గృహాల్లో నివసిస్తున్న గ్రామస్తులు వాపోయారు. స్థానిక అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు క్వారీల నిర్వహణపై తగిన పర్యవేక్షణ చేపట్టడం లేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# అట్టహాసంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు

- 300 కేజీల భారీ కేక్ కట్.. తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- 20వేల మందికిపైగా పసందైన వంటకాలతో భోజనాలు పంపిణీ
- శుభాకాంక్షలు తెలిపిన భూమన, నారాయణస్వామి, సిపాయి, విజయానంద రెడ్డి

ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి రూరల్

తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామం సోమవారం పండుగ వాతావరణాన్ని తలపించింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచే చెవిరెడ్డి నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు పెద్దఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. దీంతో చెవిరెడ్డి నివాసం జనసంద్రంగా మారింది. చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మోహిత్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు వెలసి పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. తుమ్మలగుంటలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి చెవిరెడ్డి నివాసం వరకు సందడి నెలకొంది. నివాసాన్ని ప్రత్యేక పుష్పాలంకరణతో అలంకరించగా, నాయకులు, కార్యకర్తల కోసం ప్రత్యేక భోజన స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం అల్పాహారం నుంచి మధ్యాహ్నం, రాత్రి భోజనాల వరకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆతిథ్యం అందించారు. రకరకాల వంటకాలతో చెవిరెడ్డి కుటుంబ సభ్యులు స్వయంగా భోజనం వడ్డించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయంగా పలుకరిస్తూ అన్ని ఏర్పాట్లను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు.



**భూమన చేతుల మీదుగా కేక్ కటింగ్**

జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భూమన కరుణారెడ్డి తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి చేరుకుని మోహిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. చెవిరెడ్డి కుటుంబ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం భూమన చేతుల మీదుగా మోహిత్ రెడ్డి 300 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. కేక్‌పై మోహిత్ రెడ్డి చిత్రాన్ని అందంగా రూపొందించిన చంద్రగిరి బీఎన్ఆర్ బేకరీ నిర్వాహకులను భూమన అభినందించారు. వేడుకలకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి భూమన ఇంటికి వెళ్లి ఆశీస్సులు తీసుకుని వచ్చారు.

**మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి శుభాకాంక్షలు**

అంతకుముందే మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చెవిరెడ్డి నివాసానికి చేరుకుని మోహిత్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు జిల్లా, నియోజకవర్గ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, వేలాది మంది కార్యకర్తలు, అభిమానులు హాజరై మోహిత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. తుమ్మల గుంట గ్రామం రోజంతా జన్మదిన వేడుకల సందడితో కళకళలాడింది.

**నాలుగు క్షేత్రాల నుంచి వేద పండితులు**

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదినాన ఆయనకు అన్ని శుభాలు జరగాలని కోరుతూ రామచంద్రాపురం మండలం సి.రామాపురంకు చెందిన వైసీపీ నేత కె.పవన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నాలుగు క్షేత్రాల నుంచి వేదపండితులు తరలివచ్చారు. మహానంది, శ్రీకాళహస్తి, కాణిపాకం, తిరుత్తణి ఆలయాల నుంచి వేద పండితులు ప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాలను తీసుకువచ్చి వేద ఆశీర్వచనం చేశారు. సుమారు అర్ధగంట వరకు వేద ఆశీర్వచనం జరగడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**పసందైన వంటకాలు..**

చెవిరెడ్డి మోహిత్ రెడ్డి జన్మదిన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు అందరికీ పసందైన వంటకాలతో భోజనాలు పంపిణీ చేశారు. ఉదయం 7 నుంచి నిరంతరాయంగా 16 గంటల పాటు అల్పాహారం, భోజనాలను పంపిణీ చేయడంతో వందలాది మంది తరలి వచ్చారు. చంద్రగిరి, తిరుపతి శ్రీకాళహస్తి నియోజకవర్గాల నుంచి కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు రావడంతో సుమారు 20వేల మందికిపైగా భోజనాలను సిద్ధం చేశారు. చెవిరెడ్ మోహిత్ రెడ్డిని కలిసి తమ వెంట తెచ్చిన జ్ఞాపికలు, బోకేలు, శాలువలతో సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో 56 ఫిర్యాదుల స్వీకరణ

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) ఎస్. షాను ఆధ్వర్యంలో సోమవారం జిల్లా ఏఆర్ పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి మొత్తం 56 ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదులను ఆలస్యం లేకుండా చట్టపరంగా విచారించి, నిర్ణీత గడువులో పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితుల సమక్షంలోనే వీడియో కాన్ఫరెన్స్, సెల్ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సూచనలు జారీ చేశారు. అందిన ఫిర్యాదుల్లో బైక్ దొంగతనం--1, చీటింగ్--3, కుటుంబ తగాదాలు--8, వేధింపులు--8, ఇంటి తగాదాలు--2, భర్త వేధింపులు--1, భూ తగాదాలు--9, మిస్సింగ్ కేసులు--2, డబ్బు తగాదాలు--5, చిన్న తగాదాలు--2, పోలీసు సేవలకు సంబంధించినవి--7, ఆస్తి తగాదాలు--6, బెదిరింపులు--2 ఉన్నాయి.



# సి, ఆర్ ,ఎస్ ఉద్యోగి కిల్లి రవి ఆత్మహత్యకేసులో, మహిళ అరెస్ట్

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

రేణిగుంట పట్టణంలో ఇటీవల కాలంలో రైల్వే ఉద్యోగి అయిన కిల్లి రవి ఆత్మహత్య చేసుకున్న కేసు దర్యాప్తు సమయంలో మృతుడు వద్ద దొరికిన సూసైడ్ నోట్, పోస్ట్ మార్టరం నివేదిక , సేకరించిన ఆధారాలు, సాక్షుల వాంగ్మూలాలు మరియు ఇతర లభ్యమైన సమాచారాన్ని ఆధారంగా చేసుకొని కేసులో,ముద్దాయి అయిన ఎస్. ఉషారాణి (35 సంవత్సరాలు), మంగళం, తిరుపతి నివాసిని, సోమవారం 29-06-2026 ఉదయం రేణిగుంట మండలం, కరకంబాడి బస్టాండ్ సమీపంలో రేణిగుంట పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అయిన్. శ్రీనివాసులు అదుపులోకి తీసుకొని చట్ట ప్రకారం అరెస్టు చేశారు. విచారణలో భాగంగా ఆమె నుండి సంబంధిత అంశాలపై వివరాలు సేకరించామన్నారు. అనంతరం చట్టపరమైన బంధనలను పాటిస్తూ, ఆమెను గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తామని. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తులో ఉన్నట్టు తెలిపారు.




# నవంబర్ 12,13 తేదీల్లో విశాఖలో ప్రతిష్టాత్మకంగా భాగస్వామ్య సదస్సు

## సీఐఐ భాగస్వామ్య సదస్సు-2026 సన్నాహక సమావేశంలో సీఎం చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి,అమరావతి:

విశాఖ భాగస్వామ్య సదస్సు గతానికి భిన్నంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈసారి ప్రాంతీయ స్థాయిలో కూడా సదస్సులు నిర్వహించాలని సూచించారు. నవంబర్ నెలలో నిర్వహించే 31వ సీఐఐ సదస్సుపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్షించారు. నవంబర్ 12, 13వ తేదీల్లో విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రాంతీయ స్థాయిలో భాగస్వామ్య సదస్సులు నిర్వహించే అంశంపై చర్చించారు. 31వ పార్టనర్షిప్ సమ్మిట్ నిర్వహించనున్నారు. ఈ సదస్సులో భాగంగా ఎంఓయూలు కుదుర్చుకోవడం, మినిస్టీరియల్ సెషన్స్, ప్లీనరీ, కంట్రీ సెషన్స్, బీ2బీ, బీ2జీ సమావేశాలతో రెండు రోజుల భాగస్వామ్య సదస్సు నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీల ప్రతినిధులు, కేంద్ర మంత్రులు, వివిధ దేశాలకు చెందిన డెలిగేట్స్‌ను ఆహ్వానించాలని సీఎం సూచించారు. భాగస్వామ్య సదస్సు నిర్వహణకు సంబంధించి వివిధ రాష్ట్రాలకు చెందిన సీఎంలకు లేఖలు రాయాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. విశాఖ భాగస్వామ్య సదస్సుకు సంబంధించి దేశ విదేశాల్లో పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని సీఎం చెప్పారు. ఈ మేరకు జూలై నుంచి సెప్టెంబర్ వరకు దేశవిదేశాల్లో రోడ్ షోలు చేపట్టాలని ఆదేశించారు. దీంట్లో భాగంగా ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, కోయంబత్తూర్, అహ్మదాబాద్, హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో సీఐఐ పార్టనర్ షిప్ సదస్సులకు సంబంధించి రోడ్ షోలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. అలాగే ప్రధాన భాగస్వామ్య సదస్సుకంటే ముందుగానే విశాఖ, రాజమండ్రి లేదా కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతి నగరాల్లో ప్రాంతీయ భాగస్వామ్య సమావేశాలు నిర్వహించాలని సూచించారు. అంతే కాకుండా.. ఈ సదస్సుల్లో ఎంఓయూలు కుదర్చుకునే అంశంపై అధికారులు ఎలాంటి ప్రణాళికలు చేపట్టారని ముఖ్యమంత్రి అడిగారు. ఏయే ప్రాంతాల్లో ఏయే రంగాలకు చెందిన పరిశ్రమలు స్థాపించేందుకు అవకాశం ఉంటుందో బేరీజు వేసుకుని.. ఆ మేరకు ఆయా ప్రాంతీయ సదస్సుల్లో ఎంఓయూలు కుదుర్చుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."భాగస్వామ్య



సదస్సులు అంటే కేవలం పెట్టుబడులు రాబట్టడం, ఎంఓయూలు కుదుర్చుకోవడం అనే భావన పోవాలి. భాగస్వామ్య సదస్సుల్లో వివిధ కీలక అంశాల మీద చర్చ జరగాలి. ఎన్ని పెట్టుబడులు వస్తున్నాయి... ఎన్ని ఎంఓయూలు కుదుర్చుకున్నామనే దానికంటే నాలెడ్జ్ షేరింగ్ ఎంత వరకు చేసుకోగలుగుతున్నామనేది ముఖ్యం. అందుకే విశాఖలో జరగబోయే 31వ భాగస్వామ్య సదస్సులో జరిగే కార్యక్రమాలపై ప్రజలు చర్చించుకోవాలి. వినూత్నంగా ఆయా రంగాలను ఏ విధంగా అభివృద్ధి సాధించాలనే ఆలోచనలు రేకెత్తించాలి. టెక్నాలజీ సహా వివిధ అంశాల గురించి అందరూ మాట్లాడుతున్నారు. కానీ ఆయా రంగాల్లో ఛాంపియన్ గా నిలిచిన వాళ్లే గ్లోబల్ లీడర్లుగా ఎదుగుతున్నారు. ఫ్యూచరిస్టిక్ రంగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ప్రముఖ యూనివర్శిటీలకు చెందిన నిపుణులు భాగస్వామ్య సదస్సుకు వచ్చేలా చూడాలి. సీఐఐ గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్‌ను అమరావతిలో ఏర్పాటు చేసుకోబోతున్నాం. విశాఖలో జరగబోయే పార్టనర్ షిప్ సమ్మిట్లో పబ్లిక్ పాలసీలపై కీలక చర్చలు జరగాలి. వ్యాపారాలు, పెట్టుబడులు వంటి అంశాలతో పాటు ఆయా రంగాల్లో సవాళ్లు ఎదురైతే వాటిని ఎలా అధిగమించాలనే అంశంపై రకరకాల చర్చలు జరగాలి. వ్యవసాయం, ఉద్యానరంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ, ఆధ్యాత్మికత, స్ట్రెస్ ఫ్రీ వర్క్ వంటి అంశాలపై చర్చించాలి."అని ముఖ్యమంత్రి సూచించారు. ప్రభుత్వం చేస్తున్న కృషి.. పడుతున్న కష్టం ప్రజలకు అర్థమవుతుంది. ఈ సదస్సుల్లో జెన్ జీ భాగస్వామ్యం ఉండేలా చూడాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ సన్నాహక సమీక్ష సమావేశానికి మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, పొంగూరు నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మంగినపూడి బీచ్‌కు పర్యాటక శోభ

**వినాయక చవితి వేడుకలతో బందరుకు నూతన వైభవం**

**అన్ని రకాల సదుపాయాలు కల్పించి తీర్చిదిద్దుతాం**

**ప్రజలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం**

**అసోసియేషన్ల ప్రతినిధుల సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర**





మచిలీపట్నం/ ప్రజా భూమి ప్రతినిధి

చారిత్రాత్మక బందరు చరిత్రను ప్రపంచానికి చాటిచెప్పడంతో పాటు, మంగినపూడి బీచ్‌కు సరికొత్త పర్యాటక శోభ తెచ్చేలా ఈ ఏడాది వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిద్దామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు.మచిలీపట్నం ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్‌లో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ ఛైర్మన్ బండి రామకృష్ణ మరియు ఇతర పురప్రముఖులతో కలిసి వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులతో మంత్రి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. మంగినపూడి బీచ్ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించబోయే ఈ ఉత్సవాలపై అందరి సలహాలు, సూచనలు స్వీకరించారు. ఉత్సవాల ప్రత్యేకతలు & ప్రణాళికలు:63 అడుగుల భారీ వినాయకుడు: వినాయక చవితి సందర్భంగా మంగినపూడి బీచ్ వద్ద 63 అడుగుల భారీ గణనాథుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు.నమూనా ఆలయాల సందడి: ఆధ్యాత్మిక భావన పెంపొందేలా దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన అయోధ్య, తిరుమల, శ్రీశైలం, కాణిపాకం, ఇంద్రకీలాద్రి, సింహాచలం దేవాలయాల నమూనా ఆలయాలను ఇక్కడ ప్రతిష్టించనున్నారు.స్థానిక యువతకు ఉపాధి: నవరాత్రుల సమయంలో బీచ్ వద్ద వివిధ రకాల స్టాల్స్ ఏర్పాటు చేయడం ద్వారా స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అభివృద్ధి పథంలో మంగినపూడి బీచ్:"మంగినపూడి బీచ్ అభివృద్ధికి ఇప్పటికే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశాం. పర్యాటకులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఏపీఎండీసీ (APMDC) ఆధ్వ ర్యం లో అత్యాధునిక మరుగుదొడ్లు, కాఫీ కేఫ్‌ల ను ఏర్పాటు చేస్తున్నాం. వీటి నిర్వహణ బాధ్యత ల ను కూడా కాఫీ కేఫ్ నిర్వాహకులకే అప్పగిస్తాం."

మసులా బేపార్క్ కమిటీ: బీచ్‌ను మరింతగా అభివృద్ధి చేసేం దుకు ప్రత్యేకంగా 'మసులా బేపార్క్ కమిటీ'ని ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. మరింత స్థలాన్ని సేకరించి పర్యాటకులకు అన్ని రకాల వసతులు కల్పిస్తామన్నారు. రాష్ట్రస్థాయి ఆకర్షణగా బందరు: గతంలో నిర్వహించిన 'మసులా బీచ్ ఫెస్ట్' తరహాలోనే, ఇప్పుడు నిర్వహించబోయే వినాయ క చవితి ఉత్సవాల ద్వారా ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తాన్ని ఆకర్షించేలా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.ఈ మహోత్కార్యక్రమానికి బందరు ప్రజలు, ప్రజాప్రతినిధులు, అన్ని రంగాల అసోసియేషన్ల ప్రతినిధులు నడుం బిగించి, సమన్వయంతో విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు.



## మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా కమిటీ.(citu) మున్సిపల్ రంగంలో ప్రైవేటీకరణ ఆపాలి, 2026 ఏప్రిల్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు శాశ్వత స్వభావం కలిగి విధులు నిర్వహిస్తున్న కార్మికులందని పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రమణ్యం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఉద్యోగులు కార్మికులు పట్టణ ప్రజలకు నష్టదాయకమైన ప్రైవేటీకరణను వ్యతిరేకించలని అని కోరుతూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించి,అనంతరం కలెక్టర్ కి వినతిపత్రం అందించడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పౌష్టికాహారం పొందాలంటే అందుకు అవసరమైన జీతభత్యాలు కార్మికులకు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వాన్నిది. పరిసరాలు శుభ్రంగా ఉండాలి అంటే అందుకు అవసరమైన సేవలు అందిస్తున్న మున్సిపల్ కార్మికులు బాగోగులు ప్రభుత్వం పట్టించుకోవాలి. కేంద్ర, రాష్ట్రంలో అధికారాల్లో ఉన్న బిజెపి తెలుగుదేశం కూటమి ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ, ప్రైవేటు సంస్థలకు పెద్దపేట వేస్తున్నాయి. ప్రభుత్వ ప్రజా సంక్షేమాన్ని  కార్పొరేటర్ సంస్థలకు అప్పగించి మున్సిపల్ కార్మికులు మరియు పట్టణ ప్రజలను కష్టాలపాలు చేసేందుకే ఈ పీపీపీ విధానాన్ని అమలు చేస్తున్నారని, దానికోసమే ఈ ప్రభుత్వం ఈ జీవోలు 673, 975ని తీసుకొచ్చాయని ఆయన అన్నారు. మున్సిపల్ రంగంలో పౌర సేవలు ప్రైవేటు గారించే జీవో నెంబర్ 975ను 673 వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కృష్ణా జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు ఎస్. రత్న కరుణ, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు శిరం శెట్టి దుర్గాప్రసాద్, సిఐటియు మచిలీపట్నం మండల కన్వీనర్ సిహెచ్ జయరావు, మచిలీపట్నం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నజీర్, జూటూరి శ్రీనివాసరావు, చలం వీరమ్మ, వెంకటలక్ష్మి, వజీర్ గుర్రం మధుబాబు, తాడిశెట్టి వీర శ్రీనివాసరావు, ముద్దాల రవి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైతు రాజైతే.. రాజ్యం సుభిక్షమవుతుంది

**బుద్దాలపాలెం ఏరువాక కార్య క్రమంలో గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

**రాష్ట్రంలో వ్యవసాయం పరిరక్షణకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసింది**

**రూ.58 వేల కోట్లతో చారిత్రాత్మక వ్యవసాయ బడ్జెట్ ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచింది**

**వచ్చే ఏడాది నాటికి పోలవరం పనులు పూర్తి చేసి రైతాంగానికి అంకితం చేస్తాం**



**పంట అమ్ముకున్న 24 గంటల్లోనే నేరుగా రైతు ఖాతాల్లోకి నగదు జమ అవుతుంది**

మచిలీపట్నం రూరల్/ ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో రైతాంగ సంక్షేమానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నం రూరల్ మండలం బుద్దాలపాలెంలో ఘనంగా నిర్వహించిన ఏరువాక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో కలిసి భూదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వయంగా వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి దుక్కి దున్ని, విత్తనాలు చల్లారు. రైతులకు సబ్సిడీ ఎరువులు, విత్తనాల బస్తాలను పంపిణీ చేశారు.మంత్రి మాట్లాడుతూ, బుద్దాలపాలెం గ్రామానికి రహదారి నిర్మాణ పనులు మంజూరయ్యాయని, త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మంచినీటి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఇంటికీ కుళాయి అందుబాటులోకి తెస్తామన్నారు. బందరు పోర్టును శరవేగంగా పూర్తి చేసి స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, పర్యాటకాన్ని సైతం భారీగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు."గతంలో పండిన పంటను అమ్ముకునేందుకు దిక్కులేని పరిస్థితి ఉండేది. కానీ నేడు, రైతులకు అండగా నిలుస్తూ పంట అమ్ముకున్న 24 గంటల్లోనే వారి ఖాతాల్లో నిధులు జమ చేస్తున్నాం."వ్యవసాయ రంగానికి స్వర్ణయుగంరైతుని, వ్యవసాయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.58 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టామని, వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబు నాయుడిదేనని కొనియాడారు. ఉచిత భూసార పరీక్షలు, అధికారుల ద్వారా సరైన సలహాలు, సూచనలు అందిస్తున్నామన్నారు. బందరు నియోజకవర్గంలో రూ.3 కోట్లతో సాగునీటి కాలువలను అభివృద్ధి చేశామని వివరించారు.సంక్షేమం - అభివృద్ధికి సమ ప్రాధాన్యంకూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం 63 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నామని, రెండేళ్లలో రూ.65 వేల కోట్లు నేరుగా పంపిణీ చేశామని చెప్పారు. 'తల్లికి వందనం' పథకం కింద ఇంట్లో ఎంతమంది పిల్లలున్నా అందరికీ వర్తింపజేస్తూ జూలై 15న అమలు చేయబోతున్నట్లు ప్రకటించారు. 'అన్నదాత సుఖీభవ' ద్వారా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తున్నామని, కేంద్రం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు జోడించి ఇస్తోందని స్పష్టం చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ విజయవంతంగా సాగుతోందన్నారు.

గతంలో గుంతలమయమైన రోడ్లను నేడు అద్భుతంగా పునర్నిర్మించామని పేర్కొన్నారు. అభివృద్ధిని అడ్డుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారురాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా నడిపిస్తుంటే, జగన్ రెడ్డి ఓర్వలేక రోజుకో కుట్రకు తెరలేపుతున్నారని మంత్రి మండిపడ్డారు. విజయవాడ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తక్షణమే స్పందించి సిట్ (SIT) ఏర్పాటు చేశారని, సీఐని సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. ఇటువంటి ఘోరమైన ఘటనలకు కులం రంగు పూయడం దుర్మార్గమన్నారు. కులం, మతం, ప్రాంతం పేరిట ప్రజల మధ్య చిచ్చు పెట్టే వైసీపీ నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.గతంలో గుజరాత్ లాంటి రాష్ట్రాల్లో స్థిరమైన ప్రభుత్వాలు ఉండటం వల్లే అభివృద్ధి సాధ్యమైందని, అదే స్ఫూర్తితో ఏపీని దేశంలోనే అగ్రస్థానంలో నిలుపుతామని మంత్రి కొల్లు రవీంద్ర ధీమా వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్, తెలుగుదేశం ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని దుర్గాప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు వ్యవసాయ శాఖ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి: కలెక్టర్ డీకే బాలాజి



మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరిం చారు. ఈ మేరకు ఆయన ఇంచార్జి డిఆర్ఓ పి పోతురాజు, కేఆర్ఆర్సీ ఎస్డిసి పి నీలకంఠేశ్వరరెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావుతో కలసి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన అర్జీదారుల సమస్యలను ఎంతో ఓపిగ్గా ఆలకించి, తక్షణ పరిష్కారం సాధ్యమైన వాటిపై సంబంధిత అధికారులతో అక్కడికక్కడే మాట్లాడి పరిష్కరించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, తమ వద్దకు వచ్చిన ప్రతి వినతిని అధికారులు నిశితంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అర్జీలలో కొన్ని:మచిలీపట్నంలోని చింతకుంటపాలెం గ్రామానికి చెందిన చట్టి నర్సమ్మ తాను అనాథనని, స్థానిక బెరాకా మినిస్ట్రీస్ వసతి గృహంలో ఉంటూ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశానని, ప్రస్తుతం ఎంసెట్ పరీక్షలు రాసినందున ఉన్నత విద్యలో ప్రవేశానికి ఆదాయ ధ్రువీకరణ పత్రం అవసరమైందని కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే తనకు రేషన్ కార్డు కూడా మంజూరు చేయాలని కోరారు.దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ మచిలీపట్నం దక్షిణ మండల తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడి, ఆమెకు తక్షణమే ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని ఆదేశించారు. అలాగే రేషన్ కార్డు మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సూచించారు.* పెదపారుపూడి మండలం దూళ్ళవానిగూడెంలోని ఎంపీపీ పాఠశాల ప్రస్తుతం సీఎస్ఐ చర్చి భవనంలో నిర్వహిస్తుండగా, ఆ భవనాన్ని ఖాళీ చేయాలని చర్చి యాజమాన్యం కోరడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్థులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉన్నందున అక్కడే పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేయగా, ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పెనమలూరు మండలం, కానూరులో ఉంటున్న పాకిస్థాన్ పౌరురాలు వహీదున్నిసా బేగం భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో, కేంద్ర హోంశాఖ సూచనల మేరకు రూ.10 వేలు రిజిస్ట్రేషన్ ఫీజును ఎస్‌బీఐ ద్వారా ట్రెజరీ చలానా రూపంలో ఎలా చెల్లించాలో స్పష్టత లేదని జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఫీజు చెల్లింపుకు సంబంధించిన విధానంపై తగిన మార్గదర్శకాలు అందించి, భారత పౌరసత్వ ప్రక్రియ పూర్తి చేసుకునేందుకు సహకరించాలని ఆమె కోరారు.కార్యక్రమంలో జెడ్పీ సీఈవో డాక్టర్ జె అరుణ, డిపిఓ ధనలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ లోకేశ్వరావు, డ్రైనేజీ శాఖ ఈఈ కిరణ్, డ్వామా పీడీ ఎన్ శివప్రసాద్ యాదవ్, ఎల్డిఎం రవీంద్రారెడ్డి, మత్స్య శాఖ అధికారి అయ్యా నాగరాజా, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్, హౌసింగ్ పీడీ వెంకట్రావు, సర్వే ఏడి లక్ష్మణరావు, పర్యాటక శాఖ అధికారి రామ్ లక్ష్మణరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## జనసేన పదవుల వేట మచిలీపట్నంలో జోరుగా దరఖాస్తుల స్వీకరణ

**వైసీపీ ట్రాప్‌లో పడటానికి కాపులు అమాయకులు కారు**

**-ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఫైర్**

మచిలీపట్నం/ ప్రజాభూమి ప్రతినిధి

జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గంలో కీలక అడుగు పడింది. పార్టీలోని వివిధ విభాగాల పదవులను ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం మచిలీపట్నం ఆర్కే మెస్ పైన గల ఫంక్షన్ హాలులో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జనసేన ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ ఆశావహుల నుంచి స్వయంగా దరఖాస్తులను స్వీకరించారు.షెడ్యూల్ & ముఖ్యాంశాలు:చివరి తేదీ: జూలై 5వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు.తదుపరి ప్రక్రియ: వచ్చిన దరఖాస్తులన్నింటినీ స్క్రీనింగ్ చేసి రాష్ట్ర కమిటీకి పంపనున్నారు.లక్ష్యం: క్షేత్రస్థాయి నుంచి పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేయడం."పవన్ కళ్యాణ్‌పై బురదజల్లితే చూస్తూ ఊరుకోం!"వైసీపీ నాయకుల మాటలు నమ్మి మోసపోయేంత అమాయకులు రాష్ట్రంలోని కాపు సామాజిక వర్గ ప్రజలు కారని ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ స్పష్టం చేశారు. మీడియా సమావేశంలో ఆయన వైసీపీ తీరుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ కామెంట్స్.. 'కీ పాయింట్స్':జనసేన వైపే కాపులు: 2024 సార్వత్రిక ఎన్నికల్లో కాపు ఓటర్లు అత్యధిక సంఖ్యలో జనసేన పార్టీకి అండగా నిలిచారు. ఈ వాస్తవాన్ని జీర్ణించుకోలేకే వైసీపీ కొత్త డ్రామాలకు తెరలేపింది.దూరం చేసే కుట్ర: కాపు సామాజిక వర్గాన్ని జనసేనకు దూరం చేయడమే లక్ష్యంగా వైసీపీ నాయకత్వం కుటిల యత్నాలు చేస్తోంది.అడ్డగోలు విమర్శలు: అసలు ఎలాంటి సంబంధం లేని అంశాలను కూడా జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌కు అంటగట్టి, రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ చూస్తోందని ఆయన మండిపడ్డారు.ఈ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని జనసేన నాయకులు, కార్యకర్తలు, పదవులు ఆశిస్తున్న ఆశావహులు భారీ సంఖ్యలో తరలివచ్చారు ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు బండ్రెడ్డి రామ్, కృష్ణాజిల్లా డిసిఎంఎస్ చైర్మన్ జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, జనసేన సాధకులు పాల్గొన్నారు.



## జూన్ 29 నుండి జూలై 6 వరకు జిల్లాలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలు

**గోడ పత్రికను ఆవిష్కరించిన జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్**




ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకార మంత్రిత్వ శాఖల ఆదేశాల మేరకు, భారత ప్రభుత్వ సహకార మంత్రిత్వ శాఖ 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ కల్యాణ మందిరంలో "అంతర్జాతీయ సహకార దినోత్సవం", "సహకార వారోత్సవాల" గోడ పత్రికను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు (ఆప్కాబ్) మేనేజింగ్ డైరెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. జూన్ 29 నుండి జూలై 6 వరకు జిల్లావ్యాప్తంగా వారం రోజుల పాటు వివిధ రకాల అవగాహన, సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. "సహకారంతో సమృద్ధి - సమగ్ర అభివృద్ధికి పునాది" మరియు "మన గ్రామం - మన సహకారం - మన అభివృద్ధి" అనే నినాదాలతో ఈ వారోత్సవాలు జరుగుతాయని పేర్కొన్నారు.వారోత్సవాల కార్యక్రమాల వివరాలు:జిల్లాలో వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాల పట్టిక ఇలా ఉంది:జూన్ 29 (సోమవారం): సహకార రథం ప్రారంభం.జూన్ 30 (మంగళవారం): మత్స్య రథం నిర్వహణ.జూలై 01 (బుధవారం): ఉచిత ఆరోగ్య శిబిరాల ఏర్పాటు. జూలై 02 (గురువారం): పాడి రథం ప్రదర్శన.జూలై 03 (శుక్రవారం): ఒకేసారి వాడి పారేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ నిషేధం, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రత్యేక అవగాహన సదస్సు. జూలై 04 (శనివారం): ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థులకు "గ్రామీణ పేదరిక నిర్మూలనలో సహకార సంఘాల పాత్ర" అనే అంశంపై వ్యాస రచన పోటీలు.జూలై 05 (ఆదివారం): సర్ఫ్, బ్లీచింగ్ పౌడర్ వినియోగంతో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలు (స్వచ్ఛ భారత్).జూలై 06 (సోమవారం): ముగింపు వేడుకలు - ప్రత్యేక సదస్సు, సభ్యులకు అవగాహన మరియు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల పంపిణీ.పిలుపు:ఈ వారోత్సవాలలో జిల్లాలోని సహకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని చైర్మన్ పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆప్కాబ్ మేనేజింగ్ డైరెక్టర్, జిల్లా సహకార అధికారి (డిసిఓ) కె.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ), ఉమ్మడి కృష్ణా జిల్లాలోని 425 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పాక్స్) చైర్మన్లు, బ్యాంకు అధికారులు, సహకార యూనియన్ జోనల్ మేనేజర్ రంగరాజన్ పాల్గొన్నారు.



## శ్రీవార్త' తెలుగు దినపత్రిక లోగోను ఆవిష్కరించిన మంత్రి కొల్లు రవీంద్ర



**ఎడిటర్ కూరేటి సతీష్‌కు 'ఆర్ఎన్ఐ' సర్టిఫికెట్ అందజేత**

**ప్రజా పక్షాన నిలుస్తూ ఉన్నత శిఖరాలకు చేరాలని మంత్రి ఆకాంక్ష**

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

కృష్ణా జిల్లా కేంద్రంగా నూతనంగా ప్రారంభమైన 'శ్రీవార్త' జాతీయ తెలుగు దినపత్రిక లోగోను రాష్ట్ర గనులు, భూగర్భ మైనింగ్, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం స్థానిక ఆర్&బీ గెస్ట్ హౌస్‌లో ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, సరికొత్తగా పాఠకుల ముందుకు వస్తున్న 'శ్రీవార్త' పత్రిక ప్రజా జీవనాడిగా నిలవాలని ఆకాంక్షిం చారు. ఎప్పటికప్పుడు నూతన వార్తలను, నిష్పక్షపాత విశ్లేషణలను అందిస్తూ, ప్రజా పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాలన్నారు. 'శ్రీవార్త' జాతీయ తెలుగు దినపత్రిక అంచలంచెలుగా ఎదుగుతూ, పత్రికా రంగంలో శిఖరాగ్ర భాగాన నిలిచి అందరి మన్ననలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఎడిటర్‌కు అభినందనలుఈ కార్యక్రమంలో 'శ్రీవార్త' పత్రిక ఎడిటర్ కూరేటి సతీష్‌ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయనకు పత్రికకు సంబంధించిన 'ఆర్ ఎన్ ఐ' (RNI) సర్టిఫికెట్‌ను మంత్రి చేతుల మీదుగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ లోగో ఆవిష్కరణ కార్య క్రమం లో పలువురు ము ఖ్య నాయకులు, పత్రికా సిబ్బంది మరియు ప్రము ఖు లు పాల్గొని 'శ్రీవార్త' యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.




Printed by Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at and published at DOOR NO. 19-4-378, S T V NAGAR, NEAR OLD TVS SHOW ROOM, OPPOSITE TIRUPATHI (URBAN) editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .PRGINo. "APTEL/25/A2316,Phone No. Cell : 9502116677

## ఏలూరులో జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ సమావేశం



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

జనసేన పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఏలూరులోని కొప్పుల వెలమ కళ్యాణ మండపంలో సోమవారం "జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీ" సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు పార్లమెంట్ అబ్జర్వర్, రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఏలూరు జనసేన ఇంచార్జ్ రెడ్డి అప్పలనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జూన్ 29 నుంచి జూలై 3 వరకు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జనసేన కార్యకర్తల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు. పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడం, సమర్థులైన నాయకత్వాన్ని గుర్తించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేరువాక పౌర్ణమి అందరి రైతులలో ఆనందం నింపాలి

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



వేరువాక పౌర్ణమి అందరి రైతు కళ్ళల్లో ఆనందం నింపాలి అని టిడిపి జిల్లా రైతు ఉపాధ్యక్షులు ఉండవలీ స్వామి సుందరం అన్నారు. వర్షాలు సకాలంలో వర్షించి రైతులు సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా జీలుగుమిల్లి మండలం స్వర్ణ వారి గూడెం పంచాయతీలోని పాముల వారి గూడెం లో నిర్వహించారు . ఈ సందర్భంగా రైతులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి డాక్టర్ తో పొలాన్ని దున్ని, నవధాన్యాలు చల్లి రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. వ్యవసాయాన్ని లాభసాటి వృత్తిగా మార్చేందుకు ఆధునిక సాంకేతికతను గ్రామీణ స్థాయికి తీసుకెళ్తూ, ప్రకృతి వ్యవసాయాన్ని కూడా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సూచించారు. ఏరువాక పౌర్ణమి అనేది రైతు జీవితంలో ఎంతో పవిత్రమైన పండుగ అని, భూమాతకు నమస్కరిస్తూ కొత్త వ్యవసాయ సీజన్‌కు శ్రీకారం చుట్టే ఈ సంప్రదాయాన్ని ప్రతి రైతు గౌరవంగా కొనసాగించాలని కోరారు. ప్రకృతి అనుకూలించి ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రతి రైతు పొలం పచ్చగా కళకళలాడాలని, రైతు ఇంట సిరిసంపదలు వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. పంచాయతీ టీడీపీ అధ్యక్షులు వై నారాయణరావు, బిక్కిన వెంకటేశ్వరరావు, బిక్కిన సత్యనారాయణ, పిన్నమనేని నాగేశ్వరరావు, పిన్నమనేని శ్రీనివాసరావు, వై నారాయణ రావు, కలగర కృష్ణ, సత్యనారాయణ, కొఠారి ప్రసాదరావు, ఎంద్రప్రగడ నారాయణరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పరిష్కారంలో అధికార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి.

ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా



ప్రజల సంతృప్తి స్థాయి పెరిగేలా అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేటులోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి నిర్వహించారు. జిల్లా కలెక్టరుతో పాటు ట్రైనీ కలెక్టరు శ్రావణకుమార్ రెడ్డి, ఇంచార్జి డిఆర్వో ఎల్.దేవకీదేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, ఎస్సీ కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలు పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో అధికారులు స్వీకరించిన ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా వ్యవహరించి, అర్జీలు రీఓపెన్ కాకుండా నిర్ణీత గడువు లోపుగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ప్రజా సమస్యలు పరిష్కార వేదికలో అందిన ప్రతి అర్జీని పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. క్షేత్రస్థాయిలో వెళ్ళి లబ్ధిదారులుతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలని సూచించారు. ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్ మరియు రెవెన్యూ క్లినిక్‌లో అందిన అర్జీలుపై శాఖలు వారీగా అధికారులు సమీక్షలు నిర్వహించి, సమస్యలు పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో 274 అర్జీలు వచ్చాయని కలెక్టర్ వెట్రిసెల్వి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వివిధ శాఖలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుకు ఘన స్వాగతం

-రావులపాలెం నుంచి భారీ ర్యాలీ.. కొత్తపేటలో అంబేద్కర్, ఎన్టీఆర్ విగ్రహాలకు నివాళి.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట.

రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుకు కొత్తపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అమలాపురంలో నిర్వహించిన అభినందన సభకు హాజరయ్యేందుకు వస్తున్న సానా సతీష్ బాబును రావులపాలెం కోనసీమ ముఖద్వారం వద్ద కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రావులపాలెం నుంచి కొత్తపేట వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మార్గ మధ్యంలో ప్రజలు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కొత్తపేట బస్‌స్టాండ్ సెంటర్‌కు చేరుకున్న అనంతరం రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబు, మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలిసి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ బాబుకు శుభాకాంక్షలు తెలిపారు.

## పలాసలో జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

### పి.డి.ఎస్.యు.

ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు జిల్లా.




ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక శిక్షణా తరగతులు జూలై 10,11 తేదీల్లో శ్రీకాకుళం జిల్లా పలాసలోని టీకేఆర్ కల్యాణ మండపంలో జరిగే క్లాసులను జయప్రదం చేయాలని కోరుతూ క్లాసులకు సంబంధించిన కరపత్రం శ్రీ సర్. సి.ఆర్. రెడ్డి. డిగ్రీ కళాశాల ముందు ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పి.డి.ఎస్.యు జిల్లా అధ్యక్షుడు కాకినాని మాట్లాడుతూ ఈ రెండు రోజుల శిక్షణా తరగతుల్లో జాతీయ, అంతర్జాతీయ పరిణామాలు,దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య, విద్యా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, విద్యార్థి ఉద్యమాల భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదని ఆయన విమర్శించారు. విద్య,వైద్యం, రైల్వే,రక్షణ వంటి ప్రభుత్వ రంగాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోందని ఆరోపించారు.ఇదే విధానాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తోందని అన్నారు.రాష్ట్రంలో సుమారు రూ.10,700 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఫిబ్రవరిలో రూ.1,200 కోట్లు విడుదల చేస్తామని ప్రకటించి,కేవలం రూ.600 కోట్లు మాత్రమే విడుదల చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు.

రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను కుదించే చర్యలను వెంటనే నిలిపివేయాలని,ఉపాధ్యాయులకు విద్యాబోధనేతర పనులు అప్పగించరాదని నాని కోరారు. యూనివర్సిటీల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించి, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ సూర్యచంద్ర,టీ. ప్రదీప్,ఆర్. మురళి, వి. నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య డిగ్రీ కళాశాలలో గణాంక దినోత్సవం



ప్రజా భూమి ప్రతినిధి-పెదపాడు.

ఆదిత్య డిగ్రీ కళాశాల,సత్రంపాడులో సోమవారం గణాంక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు .ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, గణాంక శాస్త్రం విద్య, పరిశోధన, ప్రభుత్వ ప్రణాళికలు, సామాజిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి విద్యార్థి గణాంకాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని విలువైన సందేశాన్ని అందించారు.అనంతరం గణాంక శాస్త్ర అధ్యాపకులు జి. కుసుమ , ఎం.వి.వి.ఎన్. ధనలక్ష్మి గణాంక శాస్త్రం యొక్క ప్రాముఖ్యత, దాని ఉపయోగాలు, ఆధునిక కాలంలో గణాంకాల అవసరాన్ని ఉద్యోగ అవకాశాలు ,విద్యార్థులకు వివరించారు.మూడవ సంవత్సరం ఎ.ఐ.ఆర్. (ఏఐఆర్) విద్యార్థులు "డేటా సైన్స్ , ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో గణాంకాల పాత్ర" అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గణాంకాల ప్రాముఖ్యతను చక్కగా వివరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వి.వి.ఫణి కుమార్, అధ్యాపక బృందం డేటా సైన్స్, ఏ.ఐ.ఆర్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్.టి.రైతులకు ఎనబై శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ

ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు



ముసునూరు మండలం లోపూడి గ్రామంలో ఎడ్లు, నాగలి, గునపం తదితర వ్యవసాయ పనిముట్లకు భూమాతకు పూజ చేసి ఏరువాక కార్యక్రమం ప్రారంభించిన రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి.ఏరువాక పౌర్ణమి రోజున ఖరీఫ్ పంటను శాస్త్రోక్తంగా ప్రారంభించడం రైతులకు ఆనవాయితీగా వస్తున్న రైతు పండుగను శాస్త్రోష్టంగా పవిత్రముగా పూజలు చేసి ఎంతో వైభవంగా ప్రారంభించిన రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారధి మరియు సబ్ కలెక్టర్ బి, వినూత్న, ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ.ఏరువాక పూర్ణిమ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైతాంగానికి అత్యంత పవిత్రమైన వ్యవసాయ పండుగ. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి రోజున ఖరీఫ్ పంటల సాగును శాస్త్రోక్తంగా ప్రారంభించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ఖరీఫ్ సీజన్‌ను ఏరువాక పూర్ణిమతో ప్రారంభించాలని నిర్వహియించిదన్నారు.రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కూటమి ప్రభుత్వం అన్నారు.ఎడ్లు, నాగలి, పార, గునపం తదితర వ్యవసాయ పనిముట్లకు పసుపు, కుంకుమతో పూజ. భూమాతకు పూజ చేసి, నాగలితో దుక్కి దున్నడం గొప్ప ఆచారం అన్నారు.

పురుగు మందులు, రసాయన ఎరువుల వాడకం తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై అవగహన కలిగి ఉండాలని ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని కోరారు.అన్నదాత సుఖీభవ అర్హులైన రైతులకు 2026-27 మొదటి విడత నిధుల విడుదల చేసిన ప్రభుత్వం మాది అన్నారు.విత్తన పంపిణీ 80% సబ్సిడీపై వరి, పత్తి, మిర్చి, పప్పు ధాన్యాల విత్తనాలు పంపిణీ. ఉచిత పంట బీమా ఖరీఫ్ 2026 నమోదు ప్రక్రియ ప్రారంభం అయినది కావున ప్రతీ ఒక్కరూ నమోదు చేసుకోవాలని మంత్రివర్యులు పేర్కొన్నారు. డ్రోన్ స్ప్రేయింగ్ ఉచిత అవగహన డెమో ఇస్తూ. ఉత్తమ రైతు అవార్డులు మండలానికి ముగ్గురు చొప్పున ప్రగతిశీల రైతులకు సన్మానం చేసి రైతులకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వం అన్నారు. దేశానికి రైతే రాజు అని నమ్మి రైతులకు అన్ని విధాలుగా అదుకుంటున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.ఆర్టికల్చర్,ఆక్వారంగం, మామిడి, ప్రత్తి,పుగాకు, వరి, మిర్చి ఇలా వ్యవసాయ అన్ని రంగాలకు రాయితీ ఇచ్చి రైతులను ఆదుకుంటున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు.వ్యవసాయ శాఖ ద్వారా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి, రైతులను పెద్ద ఎత్తున భరోసా ఇస్తున్న ప్రభుత్వం అన్నారు. విత్తనాలు, ఎరువుల, పంట బీమా కల్పిస్తూ- రైతు - దేశానికి వెన్నెముక అని గుర్తుచేసే పండుగ ఈ ఏరువాక పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్కలెక్టరు బి, వినూత్న, తెలుగుదేశం మండల అధ్యక్షులు జి, రఘు,వై,శ్రీనివాసు, వెంకటేశ్వరరావు, రమణ, కూటమి నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు...

### రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజా భూమి ప్రతినిధి-ఏలూరు

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు.ఏలూరులోని చొదిమెళ్లలో నిర్వహించిన ఏరువాక పౌర్ణమి వేడుకల్లో వారు పాల్గొని వ్యవసాయ పనిముట్లకు పూజలు చేసి రైతులకు పంపిణీ చేశారు.అనంతరం ఎడ్లతో పాటు ట్రాక్టర్ల ద్వారా దుక్కి దున్నే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. యూరియా కొరతపై ఆందోళన అవసరం లేదని భరోసా ఇచ్చారు.ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, గత రెండేళ్లుగా అమలు చేస్తున్న పథకాలతో అన్నదాతలకు అండగా నిలుస్తోందన్నారు.భవిష్యత్తులో కూడా రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందించే చర్యలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## నూజివీడులో ఈవారం శానిటేషన్ హీరో జాన్ బాబు



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడు పట్టణ పరిధిలో టౌన్ క్లీన్ అండ్ బ్యూటీఫికేషన్ లో భాగంగా ఈవారం శానిటేషన్ హీరో గా చింత జాన్ బాబు ను ఎంపిక చేశారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం లో చింత జాన్ బాబు కు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న నూతన వస్త్రాలు బహుకరించారు. సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ నూజివీడు పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శానిటేషన్ వర్కర్స్ కృషి అభినందనీయమన్నారు.

## జర్నలిస్టుల సంక్షేమం.. వృత్తి రక్షణే ధ్యేయం


ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి రక్షణే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. వెంకట్రావు అన్నారు. గన్నవరం రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఎపిడబ్ల్యుజెఎఫ్, ఎపిబిజెఎ కృష్ణాజిల్లా మహాసభల్లో ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, మీడియా కమిషన్ ఏర్పాటు, రైల్వే పాసుల పునరుద్ధరణ, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా అమలు, జర్నలిస్టులపై దాడుల నివారణ, పిల్లలకు ఉచిత విద్య వంటి డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో ఎపిడబ్ల్యుజెఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా దొండపాటి ఉదయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా జొన్నా రవిశంకర్, గౌరవాధ్యక్షుడిగా ఉడతా రామకృష్ణ, ఎపిబిజెఎ జిల్లా అధ్యక్షుడిగా జె. వెంకటప్పయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

## బీఎల్‌వోలు బాధ్యతాయుతంగా వ్యవహరించి గడువులోగా సర్వే పూర్తి చేయాలి


ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న సోమవారం ఆగిరిపల్లి మండల అభివృద్ధి కార్యాలయంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు)తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సర్వే ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా, పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి, అర్హుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వర్తించాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ పివిన్వి ప్రసాద్, ఎంపీడీవో అబ్దుల్ సలాం మరియు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## తన సొంత నిధులతో డ్రైనేజ్ సమస్య తీర్చిన కృష్ణారావు పాలెం ఎంపిటిసి చింతగుంట్ల.

ప్రజాభూమి ప్రతినిధి-చాట్రాయి.



చాట్రాయి మండ లం లోని కృష్ణారావు పాలెం గ్రామంలో విజయవాడ సత్తుపల్లి పోవు తారు రోడ్డు (రమణ శ్రీకాంత్ ఇంటి ఎదురు) నందు వర్షపు నీరు నిలిచి తారు రోడ్డు పై పెద్ద గొయ్యి ఏర్పడింది దీనివల్ల వాహనదారులు ఇబ్బంది పడుతున్న సంగతి తెలుసుకున్న కృష్ణారావు పాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు తన సొంత నిధులతో సోమవారంఫోక్లీనర్ సహాయం తో డ్రైనేజీ తీయించి సమస్యని పరిష్కరించారు ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు కృష్ణా రావు పాలెం ఎంపీటీసీ చింతగుంట్ల వెంకటేశ్వరరావు ని పలువురు గ్రామస్తులు అభినం దించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రమణ శ్రీకాంత్, గ్రామస్తులు గుంజి కోటేశ్వర రావు పండు జిన్నా పుచ్చకాయల మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ప్రజాభూమి



# భూ వివాద రహిత గ్రామాలే లక్ష్యం

- 22ఏ జాబితా అర్జీల సత్వర పరిష్కారానికి సమష్టి కృషి
- జిల్లాలో ఇప్పటికే 180 దస్త్రాల పరిష్కారం : కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ

భూ వివాద రహిత గ్రామాల నిర్మాణమే జిల్లా యంత్రాంగం లక్ష్యమని.. 22(ఏ) జాబితాకు సంబంధించి వచ్చిన అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి సత్వర పరిష్కారానికి కృషిచేస్తున్నామని, ఇప్పటికే 180 దస్త్రాలను పరిష్కరించామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి 22ఏ నిషేధిత భూముల జాబితాలో పొరపాటున నమోదు కాబడిన కొందరు పట్టాదారులకు సంబంధించిన ప్రైవేటు భూములను నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు, రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహించినట్లు తెలిపారు. రెవెన్యూ క్లినిక్‌లో వస్తున్న అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సరైన విధివిధానాలు పాటించకుండా 22ఏ జాబితాలో చేర్చిన భూములకు ఆ జాబితా నుంచి ఉపశమనం కలిగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వారు, సీసీఎల్ఏ వారు సమీక్ష నిర్వహిస్తున్నారని, వచ్చిన దరఖాస్తులు, పరిష్కరించిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, అందుకు కారణాలను విశ్లేషిస్తున్నట్లు వివరించారు. పరిష్కరించి రిజిస్ట్రేషన్‌కు వీలుకల్పించిన దరఖాస్తుల్లో అయిదు నుంచి 15 ఏళ్ల పాటు సైతం అపరిష్కృతంగా ఉన్నవి కూడా ఉన్నాయన్నారు. దేవాదాయ శాఖకు చెందని భూములు కూడా పొరపాటున 22ఏలో నమోదు కాబడిన సందర్భాలలో దేవాదాయ శాఖ కమిషనర్ వారి నివేదిక ననుసరించి 22ఏ జాబితా నుండి తొలగింపు ప్రక్రియ చేపట్టడం జరిగిందని, అలాగే ఏపీఐఐసీ భూముల విషయంలో కూడా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణ, సంబంధిత పత్రాల ధ్రువీకరణ అనంతరం అర్హమైన కేసులను వీలైనంత త్వరగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. భూ సమస్యల పరిష్కారంలో పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఈ మొత్తం ప్రక్రియలో భాగస్వాములవుతున్న అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. కార్యక్రమానికి హాజరైన రైతులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ, సర్వేతో పాటు కలెక్టరేట్ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు ప్రదానం



ప్రజాభూమి ప్రతినిధి – తాళ్లపూడి

తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామంలో జొన్నలగడ్డ తాతలు శ్రీమతి లక్ష్మి తులసి గార్ల స్మారకార్థం నిర్వహించిన మెమోరియల్ జూనియర్ వాలీబాల్ టోర్నమెంట్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రోత్సాహం అందించడం అభినందనీయమని అన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టూ మెన్ కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బారావు చౌదరి, తాళ్లపూడి మండల టీడీపీ అధ్యక్షులు సిద్దా దుర్గాప్రసాద్, తిగిరిపల్లి గోపి, బోడపాటి గంగరాజు ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్డీవో సరళావతిని మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ సభ్యులు



ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం

రామచంద్రపురం రెవిన్యూ డివిజనల్ అధికారిణి పి.సరళ వతిని ఏపిఎన్‌జిజిఓ అసోసియేషన్ రామచంద్రపురం తాలూకా యూనిట్ అధ్యక్షులు పెట్టా సత్యనారాయణ అధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈమేరకు సోమవారం డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏ. పి. ఎన్.జి.జి.ఓ. అసోసియేషన్ అధ్యక్షులు మాధవరపు వెంకటేశ్వర్లు వివిధ ఉద్యోగుల సమస్యల గురించి వివరించారు. జిల్లా ఉపాధ్యక్షులు చిక్కాల సూర్యారావు, తాలూకా కార్యదర్శి నయనాల శ్రీనివాసరావు, కోశాధికారి మాధవరపు కాశీ విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఇమ్మమ్ షరీఫ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఏ. వి. వి. సత్యనా రాయణ ,సంయుక్త కార్యదర్శి అడపా వెంకట్రావు, అశోక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘశీ అధ్యక్షులు పడాల సత్యప్రసాద్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి అర్జీపైనా ప్రత్యేక దృష్టి పెట్టండి

అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించండి : జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ



ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్–పీజీఆర్ఎస్) ద్వారా అందుతున్న ప్రతి అర్జీపైనా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అర్జీదారులు పూర్తిస్థాయిలో సంతృప్తి చెందేలా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ, అధికారులతో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 147 అర్జీలు అందగా.. వీటిలో రెవిన్యూ 37, పోలీస్ 25, ఎంఏయూడి 16, ఏపీ ఎస్ డబ్ల్యూఆర్ఐఈఎస్ 12, పంచాయతీరాజ్ 11, ఇంకా వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన 46 అర్జీలను స్వీకరించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ తెలిపారు.

## జూలై 1న నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

- సత్యవేడులో హీరో మోటార్స్ జీపీసీకి శంకుస్థాపన చేయనున్న ముఖ్యమంత్రి
- చిల్లకూరులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ చేయనున్న సీఎం



ప్రజాభూమి ప్రతినిధి – అమరావతి

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటార్స్ గ్లోబల్ పార్ట్స్ సెంటర్–జీపీసీకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జూలై 1 తేదీన శంకుస్థాపన చేయనున్నారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని మదనపాలెంలో హీరో మోటార్ కార్ప్స్ నూతనంగా ఏర్పాటు చేయనున్న జీపీసీకు సీఎం భూమిపూజ చేయనున్నారు. హీరో మోటార్స్ కు చెందిన వివిధ తయారీ కేంద్రాలు, డీలర్లకు ద్విచక్ర వాహనాల విడి భాగాలను తయారు చేసి సరఫరా చేసేలా ఆ సంస్థ ఈ సెంటర్ ను ఏర్పాటు చేయనుంది. రూ.750 కోట్ల పెట్టుబడితో హీరో మోటార్ కార్పోరేషన్ ఈ జీపీసీ 2.0ను నిర్మించనుంది. దీని ద్వారా 4 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఇప్పటికే శ్రీసిటీ సమీపంలో హీరో మోటార్స్ సంస్థ ఏర్పాటు చేసిన అధునాతన ద్విచక్ర వాహనాల తయారీ ప్లాంట్ లో ఏడాదికి 1.5 మిలియన్ల వాహనాలను ఉత్పత్తి జరుగుతోంది. దేశ, విదేశాల్లో ఉన్న మోటార్ సైకిళ్లు, స్కూటెక్ లు, ఈవీలకు విడి భాగాలను తయారు చేసేందుకు గానూ ఈ జీపీసీను హీరో మోటార్స్ ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే పీ4 కార్యక్రమంలో మార్గదర్శిగా ఉన్న హీరో మోటార్స్ సంస్థ పలువురికి స్కాలర్ షిప్‌లను ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఈ మేరకు స్వర్ణాంధ్ర ఫౌండేషన్ ద్వారా హీరో మోటార్స్ అందించనున్న బ్రిజ్ మోహన్ లాల్ ముంజల్ పేరుతో హీరోస్ ఆఫ్ టుమారో పేరిట స్కాలర్ షిప్‌లను సీఎం ఆవిష్కరించనున్నారు. ఏపీ పోలీసులు వినియోగించుకునేలా హీరో మోటార్స్ సంస్థ ప్రత్యేకంగా తయారు చేసిన ఎలక్ట్రిక్ మొబిలిటీ వాహనాలను కూడా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందించనున్నారు.

**పేదల సేవలో సీఎం :** నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం, పున్నపువారిపాలెంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల సేవలో కార్యక్రమంలో పాల్గొననున్నారు. దీంట్లో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేయనున్నారు. వృద్ధాప్య, వితంతు సహా వేర్వేరు కేటగిరీలకు చెందిన 62 లక్షల మంది లబ్దిదారులకు రూ.2750 కోట్ల మేర పెన్షన్‌ను అందించనున్నారు. పున్నపువారిపాలెం గ్రామంలో ఓ లబ్దిదారు ఇంటికి వెళ్లనున్న ముఖ్యమంత్రి స్వయంగా పెన్షన్ ను పంపిణీ చేయనున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో సీఎం పాల్గొననున్నారు. రాత్రికి శ్రీసిటీలో ఉన్న అతిథి గృహంలో ముఖ్యమంత్రి బస చేయనున్నారు.

## మైనింగ్ అనుమతుల దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో భూముల పరిశీలన



ప్రజాభూమి ప్రతినిధి – ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలం పోతవరపాడు గ్రామంలో ఎల్ అండ్ టి సంస్థ 5 ఎకరాల 67 సెంట్ల విస్తీర్ణంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతి కోరిన నేపథ్యంలో, సంబంధిత భూమిని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రతిపాదిత మైనింగ్ ప్రాంతంలోని భూమి స్వరూపం, పరిసర పరిస్థితులు, అందుబాటులో ఉన్న వనరులు, స్థానిక పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అవసరమైన అంశాలన్నింటినీ సమగ్రంగా పరిశీలించి తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసిల్దార్ పిఎన్వి ప్రసాద్ ఆర్ ఐ మహమ్మద్ యోనస్ సర్వేయర్ రామకృష్ణ, రజని పాల్గొన్నారు.

## పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్లను వినియోగించుకోవాలి : కలెక్టర్ డీకే బాలాజి

- జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో రేషన్ కార్డులు, ప్రజా పంపిణీ వ్యవస్థ, పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్లపై సమీక్ష

ప్రజాభూమి ప్రతినిధి – మచిలీపట్నం

జిల్లాలో అందుబాటులో ఉన్న పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్లను ప్రతి కుటుంబం తీసుకుని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సురక్షితమైన, సౌకర్యవంతమైన, నిరంతర గ్యాస్ సరఫరా కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్జి) పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, దీనిపై అధికారులు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన వినియోగదారుల ఆహార పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశంలో రేషన్ కార్డుల పంపిణీ, ప్రజా పంపిణీ వ్యవస్థ, పైప్‌లైన్ గ్యాస్ కనెక్షన్ల అమలు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్‌తో కలిసి



వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ ఆయా అంశాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో కొత్త రేషన్ కార్డుల జారీ, కార్డుల విభజన (స్ప్లిట్టింగ్), యూనిట్ల నమోదు, సాంకేతిక సమస్యల వల్ల కార్డుల తొలగింపు వంటి అంశాలపై చర్చించారు. రేషన్ బియ్యం పంపిణీ, క్యూఆర్ కోడ్ ఆధారిత సరఫరా విధానం, అంత్యోదయ పథకం, వృద్ధులు వికలాంగులకు డోర్ డెలివరీ తదితర అంశాలను సమీక్షించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు బియ్యం సకాలంలో చేరేలా రవాణా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్రతినెలా పంపిణీ సమయంలో ఎదురయ్యే సమస్యలను మండలాల వారీగా గుర్తించి రూట్ ఆప్టిమైజేషన్, అవసరమైన చోట అదనపు వాహనాల ఏర్పాటు ద్వారా సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు వంటి ప్రత్యేక వర్గాల లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డోర్ డెలివరీకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో పైప్డ్ నేచురల్ గ్యాస్ (పిఎన్జి) ద్వారా గృహావసరాలకు గ్యాస్ కనెక్షన్ల అమలు పురోగతిని కూడా సమీక్షించారు. ఈ పథకాలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్ బాబు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరాం ప్రసాద్, మున్సిపల్ కమిషనర్లు బాపిరాజు, కొండయ్య, మనోహర్ రావు, నజీర్, సుభాష్ చంద్రబోస్, ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, గిరిజన, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖల అధికారులు ఫణి ధూర్జటి, జీ రమేష్, మార్కెటింగ్ శాఖ ఏడి నిత్యానంద్, డీఈవో యు వి సుబ్బారావు, మెగా సంస్థ ప్రతినిధులు ఫణి కుమార్, పత్రికా ప్రతినిధులు పి జాషువా, కేపీ బాబు, జాతీయ రహదారులు తదితర శాఖల అధికారులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టీఈ ఉచిత సీట్లు పొందిన పేద విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీని అరికట్టాలి

- పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా
- విద్యాశాఖ అధికారులు స్పందించాలి
- కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి



ప్రజాభూమి ప్రతినిధి – రామచంద్రపురం

రామచంద్రపురం డివిజన్ పరిధిలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి భారీ మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయని పీడీఎస్‌యూ ఆరోపించింది. విద్యాహక్కు చట్టం కింద ఉచిత ప్రవేశం పొందిన పేద విద్యార్థుల నుండి కూడా వివిధ పేర్లతో డబ్బులు వసూలు చేస్తుండటం అత్యంత దుర్మార్గమని పేర్కొంటూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రామచంద్రపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో సరళావతికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పి.డి.ఎస్.యు రాష్ట్ర సహాయ కార్యదర్శి బి సిద్ధూ మాట్లాడుతూ ట్యూషన్ ఫీజు లక్షలాది రూపాయలు పాటు పుస్తకాల పేరుతో రూ.8,000, యూనిఫారాల పేరుతో రూ.2,000, ఆటల ఫీజు పేరుతో రూ.6,000, రవాణా పేరుతో రూ. 10,000, ప్రత్యేక కోచింగ్ తదితర పేర్లతో భారీ మొత్తాలు వసూలు చేసి పేద, మధ్యతరగతి కుటుంబాలను తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాసంస్థల చట్టం–1983 ప్రకారం ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల కంటే అధికంగా వసూలు చేయడం, డొనేషన్లు తీసుకోవడం నేరం అయినప్పటికీ, సంబంధిత విద్యాశాఖ అధికారులు కళ్లు మూసుకుని వ్యవహరిస్తున్నారని పీడీఎస్‌యూ తీవ్రంగా విమర్శించింది. చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కార్పొరేట్ విద్యాసంస్థలకు అండగా నిలుస్తూ, పేద విద్యార్థుల హక్కులను కాలరాస్తున్నారని ఆరోపించింది. చట్టాలు అమలుపై ఎలాంటి పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రైవేట్ విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమైందని, విద్యాశాఖ అధికారులు తమ బాధ్యతలను విస్మరించారని విమర్శించారు. విద్యా హక్కు చట్టం–2009 ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్య అందించడం ప్రభుత్వ రాజ్యాంగబద్ధ బాధ్యత. ఆర్టీఈ సెక్షన్ 12(1)(సి) ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించి ఎలాంటి ఫీజులు వసూలు చేయకూడదని అయినప్పటికీ ఆర్టీఈ విద్యార్థుల నుండి పుస్తకాలు, యూనిఫారాలు, ఆటల ఫీజు, రవాణా తదితర పేర్లతో డబ్బులు వసూలు చేస్తూ చట్టాన్ని బహిరంగంగా ఉల్లంఘిస్తున్నారని తెలిపారు. ఫీజులు చెల్లించిన విద్యార్థులకు మాత్రమే పుస్తకాలు, యూనిఫారాలు అందించడం, క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పించకపోవడం ఫీజులు చెల్లించని ఆర్టిసి విద్యార్థులను మధ్యాహ్నం రెండు గంటలకే ఇంటికి పంపించడం వంటి అమానుష వివక్షను విద్యాసంస్థలు కొనసాగిస్తున్నాయని ఆరోపించారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా రంగంలో ఫీజుల నియంత్రణ పూర్తిగా గాలికొదిలేసిందని పీడీఎస్‌యూ విమర్శించింది. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల అక్రమాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, పేద విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వం విద్యా మాఫియాల ప్రయోజనాలకే పనిచేస్తోందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొంది. ఆర్టీఈ కింద ప్రవేశం పొందిన విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన రీయింబర్స్‌మెంట్ బకాయిలను సంవత్సరాల తరబడి విడుదల చేయకపోవడం వల్ల పాఠశాలలు ఆ భారాన్ని పేద తల్లిదండ్రులపై మోపుతున్నాయని, దీనికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు కె.శివ, కే.రవి, వానపల్లి నాగరాజు, ఉదయ్, కే.సురేష్ పులి దిండి రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా సర్

- పారదర్శకత, జవాబుదారీతనానికి పెద్దపీట
- ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్‌పై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ప్రజాభూమి ప్రతినిధి – విజయవాడ

భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియను పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం వత్సవాయి మండలం పర్యటన నేపథ్యంలో కన్నెవీడు గ్రామంలో సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. బీఎల్‌వోల ద్వారా ఇంటింటి సందర్శన ద్వారా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ, డిజిటైజేషన్ కార్యకలాపాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 16,45,597 (96.04 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరిగిందని, అదేవిధం గా 3,10,995 (18.15 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్తయిందన్నారు. ఈ నేపథ్యంలో త్వరితగతిన ఫారాల పంపిణీని పూర్తిచేయడంతో పాటు డిజిటైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. సర్ ప్రక్రియ నేపథ్యంలో ఈసీఐ మార్గదర్శకాలకు అనుగు ణంగా బీఎల్‌వో–బీఎల్ఏ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఓటర్ల సేవలో 1950 హెల్ప్‌లైన్: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం జరుగుతున్న నేపథ్యంలో ఓటర్లకు మెరుగైన సేవలు అందించేందుకు భారత ఎన్నికల సంఘం హెల్ప్‌డెస్క్ (1950 హెల్ప్ లైన్) అందుబాటులో ఉందని.. దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఓటర్లకు అవసరమైన సమాచారం, మార్గదర్శకత్వం, సమస్యల పరిష్కారం కోసం ఈ టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ హెల్ప్‌లైన్ ద్వారా ఓటరు నమోదు, ఓటరు జాబితాకు సంబంధించిన సందేహాలు, ఫిర్యాదులను పరిష్కరించుకోవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. కలెక్టర్ వెంట నందిగామ ఆర్‌డీవో జి.అనిల్ కుమార్ ఉన్నారు.